# మాస్టర్ ఎమ్.ఎన్.


(ప్రచండ జ్వాల)



మాస్టర్ పార్వతీకుమార్

# C V V

## మాస్టరు యోగము - సాధనా సూత్రములు




సంకలనము : **మాస్టర్ పార్వతీకుమార్**

**"నా ఈ యోగము విశ్వవ్యాప్తమగుట తథ్యము. మానవజాతి మొత్తమునకు ఈ యోగ ముద్దేశింపబడినది. ఇది జాతులకు, మతములకు, ప్రాంతములకు అతీతము. మీ సంస్కారముల రంగులు దీనికి పులమక, ఇచ్చిన ప్రార్థన విధానమును యథాతథముగ పాటించవలెను."**

**ఈ పుస్తకమందు మాస్టరుగారి యోగమునందలి సాధనా సూత్రములు విపులముగా వివరింపబడినవి.**

వెల : రూ॥ **80-00**

ప్రతులకు : ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,
కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002. ఫోన్ : 0891-2701531.
www.dhanishta.org info@dhanishta.org

# మాస్టర్ ఎమ్.ఎన్.

(ప్రచండ జ్వాల)

**మాస్టర్ పార్వతీకుమార్**

**ధనిష్ఠ**

ప్రథమ ముద్రణ : 25-08-2021 ప్రతులు : 1,000
(మాస్టర్ ఎమ్.ఎన్. గారి జయంతి)

© ధనిష్ఠ ఫౌండేషన్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

వెల : **రూ. 100-00**

ప్రతులకు :
**ధనిష్ఠ ఫౌండేషన్,**
15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,
కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002
ఫోన్ : 0891-2701531, 2509154,
website : www.dhanistha.org.
info@dhanistha.org
ISBN : 978-81-89467-99-9

ముద్రణ :
**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**
విశాఖపట్నం-530 016.
ఫోన్ : 0891-2796538, 9849996538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

"**ధనిష్ఠ**" అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ'' 1992లో జన్మించినది.

"**ధనిష్ఠ**" మాస్టర్ పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

"**ధనిష్ఠ**" ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : **మాస్టర్ పార్వతీకుమార్**

మాతృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 30 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞానబోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో "**డాక్టర్ ఆఫ్ లెటర్స్**" పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత

అలరారినప్పుడే దానికి సాఫల్యత, సార్ధకత ఉండునని, "*మానవ సేవయే మాధవసేవ*" అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచు చున్నారు. మాస్టర్ పార్వతీకుమార్ గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తననుతాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాలరనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్ గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "*పరహితము పరమధర్మ*" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించు చున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ ఫౌండేషన్**

# ముందుమాట

ఇంతవరకూ మాస్టర్ ఎమ్.ఎన్.గారి జీవితచరిత్రను గురించి వారి అనుయాయులు చేసిన కృషిని గుర్తించటమే ఈ ప్రయత్నము. వారు మాస్టర్ ఎమ్.ఎన్.గారు యిచ్చిన యోగ మార్గమునందు ఎంతో శ్రద్ధతో పయనించి, తమ తమ జీవితాలలోని యోగానుభవములు, మాస్టర్ ఎమ్.ఎన్.గారు యిచ్చిన బోధలను శ్రద్ధాభక్తులతో తెలుగుభాషలోను మరియు ఇంగ్లీషు భాషలోను ప్రచురించారు. ఈ సమాచారమంతయు ఈ చిరు పుస్తకమునకు ఎంతో దోహద పడినది. శ్రీ గూడూరు నమశ్శివాయగారు మరియు శ్రీ అక్కిరాజు విద్యారణ్యులవారు చేసిన కృషి ప్రశంసనీయము. శ్రీ దామరాజు హనుమంతరావుగారితో గడిపిన దినములలో వారు వెలుబుచ్చిన అనుభవములు కూడ ఉపయోగపడినవి. వారందరికీ మా ప్రత్యేక కృతజ్ఞతలు.

ఇదే విధముగా సోదరుడు శ్రీ కంభంపాటి శివశంకర్ ఎన్నో సందర్భములలో మాస్టర్ ఎమ్.ఎన్.గారి జీవనచరిత్రను గూర్చి నన్ను వ్రాయమని కోరుట, సందర్భానుసారముగా మన

సోదరబృందమున కొంతమంది వివిధ ప్రదేశములలో, వివిధ కాలములలో కోరటం ఈ పుస్తక రచనా ప్రారంభమునకు కారణము. ఈ పుస్తక రచన విషయములో చిరంజీవి టి.ఎస్.వి. రమణకు నా ప్రత్యేక కృతజ్ఞతలు. నేను పిలిచినంతనే నా దగ్గరకు వచ్చి ఈ పుస్తకము యొక్క వివరణమునంతయూ కంప్యూటర్ ద్వారా రికార్డ్ చేసి, పుస్తక ముద్రణకు, నా దర్శకత్వములో సలహాలు తీసుకుని సహకరించినందుకు నా కృతజ్ఞతలు. అతని శ్రద్ధాభక్తులు, సమర్పణబుద్ధి, సంసిద్ధత అసామాన్యము. ఈ చిరంజీవికి మాస్టర్ ఎమ్.ఎన్.గారి ఆశీర్వచనములు సదా ఉండుగాక! మాస్టర్ ఎమ్.ఎన్.గారిని గురించిన ఈ పుస్తకమును చదివే పాఠకులకు ఇతోధికముగా మాస్టరుగారి ఆశీర్వచనము లభించాలని, ఈ యోగమార్గమునందు కావలసిన సుళువులు వారికి అందవలెనని, ఈ యోగమునందు వారు పరిపూర్ణులు కావలెనని, దానికి మాస్టర్ ఎమ్.ఎన్.గారి దివ్యచరిత్ర ఒక మైలురాయిగా నిలువవలెనని ఆకాంక్షించుచున్నాను. ఈ పుస్తకమును తెలుగులో అనువదించిన చి. సౌ. స్వర్ణలతకు మాస్టరుగారి ఆశీస్సులు!

ఈ ముద్రణమును సమర్పించిన **శ్రీ జనుంపల్లి రామేశ్వరయ్యగారి కుటుంబమునకు** శుభాశీస్సులు!

తేది : 25-08-2021 **- పార్వతీకుమార్**

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | పరిచయము | .... 11 |
| 2. | పూర్వచరిత్ర | .... 19 |
| 3. | అవతరణము | .... 27 |
| 4. | సంక్షోభ సమయం – అన్వేషకుని జన్మ కారణము | . 39 |
| 5. | దీక్ష | .... 58 |
| 6. | యోగ జీవనము | .... 69 |
| 7. | మాస్టర్ యోగము | .... 87 |
| 8. | స్వాతంత్ర్యము | .... 94 |
| 9. | స్వాతంత్ర్యానంతర క్రియాశీలత | .... 105 |
| 10. | చివరి ప్రయాణము | .... 116 |
| 11. | అలౌకికత్వము /అతీంద్రియత్వము | .... 131 |
| 12. | హీలింగ్ మరియు టీచింగ్ | .... 140 |

# మాస్టర్ ఎమ్.ఎన్.

(ప్రచండ జ్వాల)

# 1

# పరిచయము

మాస్టర్ సి.వి.వి.గారు, మాస్టర్ ఎమ్.ఎన్.గారు మరియు మాస్టర్ ఇ.కె. గారు ఉమ్మడిగా విశ్వప్రణాళిక కార్యక్రమమును విజయవంతముగా నిర్వహించారు. అది శాఖోపశాఖలుగా అనేక సత్సంకల్ప బృందములద్వారా, మాస్టరుగారి వాహికల ద్వారా వికసించి విశ్వమంతటా వ్యాపించినది. మాస్టర్ సి.వి.వి.గారు గురుపరంపరకు చెందినవారు. మానవ వికాస పరిణామము, పరిపూర్ణత, పరివర్తన, మార్పు మరియు ఉత్కృష్టతను జీవన లక్ష్యముగా పెట్టుకున్నారు. ఈ గురుపరంపర ప్రణాళికలో మాస్టర్ ఎమ్.ఎన్.గారు పరివర్తన, మార్పు, ఉత్కృష్టత అని మూడుగా వికసించే మాస్టర్ సి.వి.వి. గారి యోగమును ప్రచోదనం చేసి, ఉపదేశించి ఒక ప్రచండ జ్వాలను వ్యాప్తి చేశారు. మాస్టర్ సి.వి.వి. గారి శక్తి ఈ భూగ్రహంపై విత్తనంలా వచ్చి మాస్టర్ ఎమ్.ఎన్. అనే మహా వృక్షమై (ప్రచండజ్వాలయై) మాస్టరుగారి కార్యక్రమానికి సరియైన వారిని ఎన్నుకొని అంకురింప చేసింది. అక్కడి నుండి ఆ విత్తనము మొలకెత్తిన తరువాత కలుపు తీసి ఆ మొక్క ఆరోగ్యంగా పెరిగేలా సంరక్షణాభారమును మాస్టర్ ఇ.కె.

గారు వహించారు. ఆ విత్తనము నిస్వార్థ సేవ, జ్ఞానప్రాప్తి ప్రసారం చేస్తూ వ్యక్తిలో కావలసిన పరివర్తన చేసి ఉన్నతికి అమరత్వ స్థితి పొందడానికి దోహదం చేసింది. అలా అమరత్వం పొందినవారు జగద్గురువు నడిపించే గురుపరంపర కార్యక్రమములో చేరగలరు. గురుపరంపర మానవ ఉన్నతికి పలు విధముల సహాయం చేస్తుంది. మాస్టర్ సి.వి.వి. గారి శక్తి మానవులను గురుపరంపరా ప్రణాళికలో చేరడానికి త్వరితగతిని సహాయం చేస్తుంది. ఇందులో మాస్టర్ ఎమ్.ఎన్.గారి పాత్ర కనబడదు. గుర్తింపు లేదు. గురుపరంపర కార్యక్రమము తెలియక మిడిమిడి జ్ఞానముతో ఉన్నవారు తమకున్న కొద్దిపాటి జ్ఞానంతోనే వివరిస్తారు.

మాస్టర్ ఎమ్.ఎన్. గారు మానవత్వానికి ప్రతినిధి, మాస్టర్ సి.వి.వి. యోగశక్తికి తమను తాము సమర్పించుకున్నవారు. ఆయన తనలో అవసరమైన పరివర్తనకోసం పన్నెండేళ్ళు సాధన చేసి గురుత్వాన్ని సాధించారు. తొమ్మిదేళ్ళపాటు ఈ యోగమార్గమును కోరి వచ్చిన జిజ్ఞాసువులకు ఉపదేశం చేశారు. ఆయన ఈ శక్తితో అనుసంధానం చెంది 20 ఏళ్ళ, 2 నెలల, 13 రోజులపాటు (29 డిసెంబర్ 1919 సాయంత్రం 4.00 గంటల నుండి 11 మార్చి 1940 సాయంత్రం 4.00 గంటల వరకు), ఆ తరువాత ఆయన ఉజ్జ్వల రూపాన్ని ధరించి విశ్వవ్యాపకమైన మాస్టరుగారి యోగమార్గములో జిజ్ఞాసగల సాధకులు, అభివృద్ధిని కోరే సాధకులకోసం మాస్టరుగారి కార్యక్రమాలను నిర్వహిస్తూ వచ్చారు. ఆయనకు *'జ్వాలా నరసింహం'* అని పేరుపెట్టడం ఆకస్మికంగా జరిగినది కాదు. జ్వాల అంటే అగ్నిజ్వాల. ఆ జ్వాలను

ఆయన మాస్టర్ సి.వి.వి. అనే శక్తితో చేర్చి అవసరమైన వ్యాప్తి, వికాసము మరియు పరివర్తనను కలుగచేశారు.

ఆ గురుపరంపర ప్రణాళికలో భాగంగా ఆ గురుపరంపర కార్యక్రమమును ముందుకు నడిపించటానికి మరొక అగ్నిజ్వాల 'జ్వాల్‌కూల్' అన్న పేరుతో దిగి వచ్చింది. అందుకు సంబంధించిన 'ఎక్వేరియన్ పాత్' (కుంభమార్గము) అని పిలువబడ్డ మాస్టర్ సి.వి.వి. యోగమును జ్వాల్‌కూల్ విస్తరింపచేశారు. ఒక జిజ్ఞాసువులో ఆ జ్యోతి ప్రజ్వలించినప్పుడు ఆ సాధకునికి అది పండుగరోజు. రాజయోగులకు అలాంటి ప్రచోదనం కలుగుతుంది. అందువలన శ్రద్ధాళువైన సాధకులలో కుండలినీ శక్తి గోచరించడం, వ్యక్తం కావటం మరియు వ్యాపకత్వమును పొందడం జరుగుతుంది. కుండలినీ జ్వాల వ్యక్తం కానంతవరకు ఉపదేశము పొందానని చెప్పకూడదు. శరీర కణములలో సుప్తముగా ఉన్న కుండలిని, ప్రాణ చైతన్యము ఒక దానితో మరొకటి చేరినప్పుడు మూలాధారములో కుండలినీశక్తి ప్రచోదింపబడుతుంది. రాజయోగి దీనిని సమర్థవంతముగా నిర్వహించగలడు. అందుకే అతడు నిష్ణాతుడు అని పిలువబడతాడు. దీనిని అందరు బోధకులు లేదా స్వంతశైలి గల గురువులు చేయలేరు. ఒక్క రాజయోగి మాత్రమే సమర్థుడు. అలాంటి రాజయోగి మాస్టర్ ఎమ్.ఎన్.గారు. తనకు తాను అనుభవజ్ఞుడై, ఉపదేశమిచ్చి, అంతరంగములో వెలుగు గలవారిని వెలిగించేవారు. అందువలన ఆయన *'ప్రచండజ్వాల'* అని పిలువబడ్డారు.

అలాంటి 'అనుగ్రహము' 1993వ సంవత్సరములో ఇప్పుడు జరుగుతున్న మాస్టర్ సి.వి.వి.గారి గ్రహాంతర విస్తీర్ణతలో ఈ గ్రంథ రచయితను ఎన్నుకున్నది. దాని పరిణామమే 'ఎక్వేరియన్ మాస్టర్' అన్న గ్రంథము. ఈ పుస్తకము జర్మనీ, స్పానిష్ మరియు ఫ్రెంచ్ భాషలలో అనువదింపబడి, తనకు తానే ప్రపంచమంతటా వ్యాప్తమైనది. సాధారణంగా థియసాఫికల్ బృందములలో 'మాస్టర్ జూపిటర్' అని పిలువబడే మాస్టర్ సి.వి.వి. గారి ప్రజ్ఞ ధ్యాన క్రియలలో సూచింపబడింది. ఆ అనుగ్రహము మళ్ళీ దర్శన మిచ్చి ఈ రచయితను మాస్టర్ ఇ.కె.గారి జీవిత చరిత్రను 'ది న్యూ ఏజ్ టీచర్' అనే గ్రంథము రచించేలా చేసింది. 2001లో గురుపరంపర ప్రణాళికలో మాస్టర్ ఇ.కె.గారి పాత్ర మరియు ఆయన కార్యక్రమమును, ఆయన బహుముఖ ప్రజ్ఞను గురించిన గ్రంథం మాస్టర్ ఇ.కె.గారి ప్లాటినమ్ జూబిలిలో (11-08-2001) విడుదల అయింది. ఆ అనుగ్రహమే మరొకసారి లభించి ''మాస్టర్ ఎమ్.ఎన్. గారి జీవితము మరియు కార్యక్రమము'' అన్న గ్రంథమును, ఆయన భౌతిక దేహమును త్యాగం చేసిన 72 ఏళ్ళ తరువాత రచించేలా చేసింది. ప్రపంచవ్యాప్తముగా జరిగిన వినమ్ర ప్రార్థనల పరిణామమే ఇంత కార్యక్రమము. మాస్టర్ ఎమ్.ఎన్. గారి గురించిన రచన ఎన్నో ఏళ్ళ కోరికయే.

ఈ గ్రంథమునందు భ్రమలు, భ్రాంతులకు, ఊహలకు ఎలాంటి అవకాశము లేదు. సాధారణముగా సద్గురువు చుట్టూ చేరినవారి నాణ్యతను బట్టి అట్టి భ్రాంతులు, భ్రమలు ఏర్పడుతుంటాయి. సాధారణముగా ఆవేశపూరితులైన భక్త

బృందముచే తాము నమ్మిన సద్గురువును దేవుని యొక్క అవతారముగా ప్రచారము చేస్తారు. ఇటువంటి కథలే మాస్టర్ ఎమ్.ఎన్.గారి చుట్టూ ఏర్పడినవి. అందుకు కారణము వారు జన్మించిన దినము మరియు శ్రీకృష్ణాష్టమి ఒకటే కావటము. ప్రతి సద్గురువు ఒక మానవుడిగా జన్మించి తరువాత తపస్సు ద్వారా పరిణామము చెంది, దైవత్వాన్ని సంతరించుకొన్నప్పుడు అతని ద్వారా దైవత్వము ఈ భూమిపై నడుస్తూ, తోటి మానవులకు ఉద్దీపనము (Inspiration) కలిగిస్తుంటాడు. అలా మాస్టరుగారు తోటి మానవులకు ఆదర్శంగా నిలిచి ఊర్ధ్వముఖంగా వెళ్ళేదారిలో సరియైన అడుగువేసేలా చేశారు. దివ్యప్రణాళికలో మానవుడు భగవంతునికి సరియైన ఉపకరణముగా భూమిపై ఉండి ఆయన ప్రణాళికను పరిపూర్ణం చేస్తున్నాడు. ఎవరిలో దివ్యత్వము రూపు దిద్దుకొన్నదో, వారు తప్పక దివ్యపురుషులై మానవ జాతికి తమను తాము సమర్పించుకుంటారు. ఎప్పుడైతే మానవుడు తనను తాను ప్రకృతికి సంబంధించిన శాశ్వత నియమాలు (ధర్మాలు) అనసరించి, అవసరమైన సేవ (పరహితము) చేస్తూ నిస్వార్థంగా, వ్యక్తిగత ప్రయోజనములను త్యాగం చేసి, తీవ్రమైన జిజ్ఞాసతో, ప్రార్థన, ధ్యానముల ద్వారా దివ్యత్వముతో అనుసంధానము చెంది మానవజాతికి సేవ చేస్తూ ఉంటారో, అలాంటి మనిషి దైవానికి వాహికగా, నడిచే దేవుడిగా భూమిపై ఉంటాడు. మనిషి యొక్క మనసు మరియు శరీరము అతనికి వాహనములు. ఆయన తన వాహికల ద్వారా పనిచేస్తూ వ్యక్తిత్వమును పెంచుకుంటాడు. ఒక జిజ్ఞాసువు తనను తాను దివ్యత్వానికి వాహికగా మార్చుకొని, భూమిపైన దివ్య కార్యములను పరిపూర్తి చేస్తుంటాడు. మాస్టర్

ఎమ్.ఎన్.గారు అలాంటి ఒక ఉదాహరణ. దివ్య ప్రణాళికలో ఆయన తనదైన ప్రత్యేక స్థానమును ఏర్పరచుకున్నారు. ఆయన సంతోషంగా, సేవాభావనతో, అందుబాటులో ఉండేలా, చాలా సామాన్యంగా ఉంటారు. ఆయన పనులు అమరమై ఎప్పటికీ ప్రేరణాత్మకంగా ఉన్నప్పటికీ ఆయన సమాజములోని అందరిలో ఒకడిగా జీవించారు.


ఒక మానవుడు దేవుని కుమారునిగా మారినప్పుడు అలాంటి మార్పును గురించి సాధారణముగా అది ఎట్లు ఏర్పడినది అన్న భావము కలుగుట, అలాంటి దైవకుమారుని గూర్చిన జీవిత వివరములు తెలుసుకొనుటకు ఉత్సాహపడుట సహజము. అటువంటి ప్రయత్నములో సూక్ష్మమైన వివరములు మరియు అవగాహన అవగతమగుటకు కావలసిన వాతావరణము ఏర్పడును. మనము ఒక పెద్ద వటవృక్షమును చూచినప్పుడు అది ఎలా సంభవించినదో తెలుసుకోవాలనుకోవడము చేత, అట్టి వివరము లన్నియూ సమగ్రముగా దర్శనమిచ్చును. సాధారణముగా సామాన్యమైన చూపుతో ఒక విత్తనమును చూచినచో, చూచిన వ్యక్తికి ఋషిదృష్టి లేనిచో అది కనబడదు. కారణము అన్ని విత్తనములు ఒకే రకముగా ఉన్నప్పటికీ కొన్ని విత్తనములు మహావృక్షములుగా మారును. కొన్ని విత్తనములు అదే చెట్టునకు సంబంధించినవి అయినప్పటికీ అంతగా పెరగక పోవచ్చును. మాస్టర్ ఎమ్.ఎన్. గారి జీవితచరిత్రను మరియు నిర్వర్తించిన యోగ ప్రణాళికను గూర్చి పరిశీలించినచో మనకు సహజముగా ఏర్పడే భావము, ప్రతివాడిలో అంకురించని విత్తనము ఉంటుంది.

కొన్ని వృక్షములు ఒక పరిమితి వరకు మాత్రమే పెరుగుతాయి. కొన్ని దేవ వృక్షముల పెరుగుదల ఎల్లప్పుడూ ఉంటుంది. అలాంటి వ్యక్తులే అమర జీవులవుతారు. వేప, మఱ్ఱి, మామిడి, దేవదారు, బూరుగచెట్టు పెరుగుతాయి కాని వాటికి తమదే అయిన పరిమితి ఉంటుంది. కాని మఱ్ఱిచెట్టు తన అస్తిత్వమును శాశ్వతంచేసి, ఊడల ద్వారా చాలా భాగం భూమిపై వ్యాపించి మానవులకు, ఇంకా చాలా జీవులకు నీడను, ఆశ్రయాన్ని యిస్తూ ఉంది.

మాస్టర్ ఎమ్.ఎన్. గారు అదృశ్యరూపంలోనే ఉండదలచు కున్నారు. అదే విధముగా తనకు గుర్తింపు కావాలని ఆయన ఎన్నడూ అనుకోలేదు. అలాగే వారు చేయు కార్యక్రమము అతి సూక్ష్మముగా, ఎవరూ గుర్తించలేనంత రహస్యముగా నిర్వర్తిస్తారు. హిమాలయ నివాసియైన మాస్టర్ జ్వాల్‌కూల్ వలె, మాస్టర్ ఎమ్.ఎన్.గారు కూడ తనను గూర్చి ప్రార్థించువారికి ఎటువంటి చిత్రపటమును ఏర్పరచలేదు. అదే విధంగా తన భౌతిక జీవితము యొక్క వివిధ ఘట్టములను గూర్చి సమాచారం ఇవ్వలేదు. తాను ఎవరిని ఎన్నుకుంటారో వారికి మాత్రమే తనను గూర్చిన సమాచారం తెలియునట్లు ఒక రహస్య సంబంధమును ఏర్పరచినారు. శ్రీ ఎమ్.ఎన్.గారిని అనుసరించువారు కూడ ఇటువంటి గుణమునే కలిగి ఉండుటవలన (రహస్య జీవనము మరియు మౌనము) వారిని గురించి పూర్తి వివరములు యిచ్చుటకు అవకాశము చాలా తక్కువ. అయినప్పటికీ వారిని గూర్చిన వివరములు, వారు అందించిన యోగమార్గమును గూర్చి తహతహలాడు వారికి ఈ పుస్తకమునందు ఇవ్వబడిన కొన్ని కోణములు మరియు ఘట్టములు

వారి ఆర్తిని తీర్చగలవని, ముఖ్యముగా భూమిపైగల అధిక సంఖ్యాకులకు అందునని ఈ గ్రంథకర్త భావించుచున్నారు. ఈ గ్రంథము రచించుటకు తగిన వివరములు తోటి సాధకులందరూ ఎంతో సమర్థవంతముగా అందించుటవలన మరియు పదే పదే గ్రంథకర్తకు గుర్తుచేయుట వలన ఇది సాధ్యమైనది. ఈ గ్రంథకర్త వారందరకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయుచున్నారు. ఈ గ్రంథకర్త గ్రంథ రచనలో తన అనుభవములను మరియు తన అవగాహనను కూడ కలిపి రచించినారు. కారణము ఈ గ్రంథకర్తకు మాస్టర్ ఎమ్.ఎన్.గారితో గల విశేష పరిచయము (తాను చేసిన ప్రార్థనలు మరియు వారికి సంబంధించిన పనులు) కూడ కారణము.

ఈ పుస్తకము ఎందుకు రచింపబడినదో దాని ప్రయోజనము నెరవేరుగాక! 'మాస్టర్' అనబడు దివ్యప్రజ్ఞ లేక దివ్యతేజస్సు అందరి హృదయములందు వెలిగి, జ్వాల బాగుగా నిలబడి మానవుడు నరుడుగా మారుటకు కావలసిన వికాసము చెంది తద్వారా అమృతత్వ స్థితికి అందరూ అర్హులు అగుదురుగాక!



# 2

# పూర్వచరిత్ర

మాస్టర్ ఎమ్.ఎన్.గారి పూర్తి పేరు మైనంపాటి జ్వాలా నరసింహం. మొదటి పేరు ''మైనంపాటి'' అన్నది ఆ కుటుంబానికి ఇంటిపేరు అయింది. మాస్టరుగారి పూర్వీకులు మైనంపాడు అనే పల్లెకు చెందినవారు. ఆ కుటుంబము పల్లె వదలి వెళ్ళినా, ఆ పల్లె పేరు ఇంటి పేరుగా మారింది. మైనంపాడు అన్నది ప్రాంతీయ భాషలో 'మైనంపాటి'గా మారింది. ఇది సర్వ సామాన్యం. భగవంతుడైన కృష్ణుడు కూడా 'ద్వారకావాసి కృష్ణుడు' అయ్యాడు. పాశ్చాత్య దేశాలలో జీసస్‌ను 'జీసస్ ఆఫ్ నజరేత్' అని పిలిచేవారు. మాస్టర్ సి.వి.వి.గారు పేరు కూడా ''సి.వి.వి. వెంకటరావ్ వెంకాసామిరావ్, కంచుపాడు.'' అందువలన ఆ కుటుంబానికి 'కంచుపాటి' అన్న పేరు వచ్చింది.

ఇప్పటికీ మైనంపాడు అన్న గ్రామము ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా, ఒంగోలు తాలూకాలో ఉంది. ఆ తరువాత ఒంగోలు జిల్లాగా మారింది. ఆ తరువాత ఒంగోలు జిల్లాకు 'ప్రకాశం జిల్లా' అని పేరు మార్చబడింది. మైనంపాడు పల్లె చుట్టూ సంపన్నమైన, పచ్చటి మాగాణి భూములు, మామిడితోటలు

ఉన్నాయి. ఆ భూములలో పంటకాలువల ద్వారా ప్రఖ్యాత కృష్ణానది నీటి వలన వ్యవసాయం జరుగుతుంది. ఆ మాగాణి పొలము ఎప్పుడూ వరిచేలతో నిండి ఉంటుంది. అది నల్లరేగడి నేల. ఆ మెట్ట భూములలో ప్రత్తి పండిస్తారు. మాగాణి భూములలో వరి పండించేవారు. ఉష్ణప్రదేశంలోని వాతావరణం, నీళ్ళను బట్టి పళ్ళు, కూరగాయలు వీలైనంతగా పండించేవారు. ఆయన ఉన్నప్పుడు ఆ పల్లెలో అన్నవస్త్రాలకు ఎలాంటి లోటు ఉండేది కాదు. మాస్టర్ ఎమ్.ఎన్.గారి పూర్వీకులు గ్రామాధికారులు (కరణాలు అని ప్రసిద్ధులు). వారు ఆ భూములను గ్రామీణ న్యాయవలయంలోకి చేర్చి గ్రామీణ రెవెన్యూ అథారిటీని ఏర్పరచారు.

మాస్టర్ ఎమ్.ఎన్.గారి పూర్వీకులు ప్రాచ్యదేశాలలో విశిష్ట అద్వైతమని, పాశ్చాత్యదేశాలలో అనుగ్రహ మార్గమని పిలవబడే సంప్రదాయమును అనుసరించేవారు. విశిష్ట అద్వైతము అన్నది అద్వైతమునకు వైభవోపేతమైన మార్గము. అద్వైతము పవిత్ర భరతభూమిలో మూలతత్త్వము. అద్వైతము ఒకే అస్తిత్వము అందరిలో ఉందని, మరొకటి లేదని చెబుతుంది. అద్వైత తత్త్వము ప్రకారము ఉన్నది బ్రహ్మమే మరొకటి లేదు. (బ్రహ్మ సత్యం, జగన్మిథ్య). సముద్రమొక్కటే ఉన్నది. అద్వైతము సముద్రము యొక్క ఉనికిని గుర్తించి, అలల రూపంలో ఉన్న సముద్రానికి గుర్తింపు లేదు.అద్వైతం ప్రకారం తరంగం ఒక భ్రమ. అది కేవలం సముద్రము. అల శూన్యము. విశిష్ట అద్వైతములో సముద్రములోని అలకు, సముద్రమునకు ఉన్న సూక్ష్మ వ్యత్యాసము వివరింపబడినది. అల కూడా సముద్రములోనిదే, కాని అది మరొక స్థితి. అలాగే

డాంబికులైన బుద్ధిజీవుల తాత్వికుల చర్చ, వాదములలో కూడా సూక్ష్మవ్యత్యాస మున్నది. విశిష్టాద్వైతము కూడా వివిధ రూపాలలో ఉన్న ఒకే సత్యాన్ని చూస్తుంది. 'నిజానికి అదే ఇదిగా ఉన్నది' *(ఓం ఇతి ఏతత్)*. నిజానికి సముద్రమే అలగా ఉన్నది. నిజానికి బల్ల, కుర్చీ, బీరువా– ఇలా అన్ని రూపాలలో ఉన్నది చెక్కనే కదా! అది అన్నింటా ఉన్న సర్వాంతర్యామిని తెలియచేస్తుంది. ఆ తత్త్వములో దేనికీ నిరాకరణ లేదు. ఆవిరి నీరుగా, నీరు మంచుగడ్డగా మారి, మరల విరుద్ధ ప్రక్రియలో మంచుగడ్డ నీరుగా, నీరు ఆవిరిగా మారుతుంది. 'అంతా నీరు' అంటుంది వేదం. *(ఆపోవా ఇదగమ్ సర్వం)* ఆవిరి, నీరు, మంచుగడ్డ వివిధ స్థితులలో ఉన్న ద్రవ పదార్థమే. అలా ఒకడే అందరిగా చూడబడి, ఒక్కడే అన్న అనుభూతి పొందుతున్నాడు. జీవితములోని ప్రతి చిన్న విషయములోనూ దివ్యత్వాన్ని అనుభూతి పొందారు.

అలా విశిష్ట అద్వైతము వచ్చింది. దానిని వేదవ్యాసులు అన్ని పురాణాలలో తలమానికమైన భాగవత పురాణములో పూర్తిగా విప్పి చెప్పారు. దానిని గురుపరంపరలోని వారు అనుసరించారు. పాశ్చాత్యదేశాలలో ఏసుక్రీస్తు ఈ మార్గమును అనుగ్రహ మార్గముగా చెప్పారు. అది అందరిలోను, అన్ని సమయాలలోను, అన్ని ప్రదేశములలో, అందరియందు, అన్ని వస్తువులు మరియు అన్ని సన్నివేశములలోను సర్వాంతర్యామిని దర్శించేలా చేస్తుంది. మాస్టరుగారి పూర్వీకులు ఈ మార్గమునే అనుసరించారు. వారి ఇలవేలుపు శ్రీకృష్ణ పరమాత్మ. మాస్టర్ సి.వి.వి.గారు కూడ కుంభరాశి చైతన్యపు స్పర్శ లభించక ముందు, మానవజాతి

ఉద్ధరణకు చెందిన కార్యక్రమములను నిర్వహించడానికి దివ్యప్రణాళికచేత నియుక్తులు కాక ముందు, శ్రీకృష్ణ పరమాత్మకు పరమభక్తులు. వారి దృష్టిలో సర్వవ్యాపి అయిన ఒకే శక్తి అనేక నామములను పొంది ఉన్నది. ఆ ముగ్గురూ (CVV., MN., EK గార్లు) భరద్వాజ ఋషి పరంపరకు చెందినవారు. అందుకే వారి గోత్రం 'భరద్వాజస గోత్రం' అయింది. ఋషి భరద్వాజుడు వశిష్ఠ ఋషి పరంపరకు చెందినవాడు. ఆ వశిష్ఠ ఋషి సౌరకుటుంబమును నడిపిస్తున్న మహాభల్లూకము (Great Bear)లోని నాలుగు నక్షత్రాలలో ఒకటి. ఈ సంఘటనలకు అన్నిటికీ ప్రత్యేక గుర్తింపు ఉన్నది.

మాస్టర్ ఎమ్.ఎన్. గారి పూర్వీకుల కుటుంబములో 300 ఏళ్ళ క్రితం ప్రేరణాత్మకమైన ఒక ఉదంతం జరిగింది. అప్పట్లో భారతదేశము మొగలుల పాలనలో ఉండేది. హైదరాబాదుకు సంస్థానాధిపతి ఉండేవాడు. 'భాగ్యనగరము' అని సహజముగా ఉన్న పేరును మార్చి 'హైదరాబాదు' అని పేరు పెట్టారు. హైదరాలి భాగ్యనగరము ప్రాంతముపై ఆక్రమణ చేసి తన రాజ్యాన్ని స్థాపించాడు. ఆయన పేరు మీదుగా భాగ్యనగరమునకు హైదరాబాదు అని పేరు పెట్టడం జరిగింది. మైనంపాడు గ్రామము కూడ నిజాం పాలనలోని హైదరాబాదు సంస్థానములో ఒక భాగము. ఆ గ్రామాధికారులు సంవత్సరానికి ఒకసారి వెళ్ళి తమ గ్రామపు ఆదాయ–వ్యయముల లెక్కలు చూపించి పన్నులను కట్టి నిజాంగారి ఆమోదమును పొందేవారు. బ్రాహ్మణ అధికారులకు గౌరవ మర్యాదలు అతి తక్కువగా ఉన్న సమయమది. మాస్టర్


ఎమ్.ఎన్.గారిది బ్రాహ్మణ కుటుంబము, అందులోనూ వైదిక సాంప్రదాయకమైనది. గ్రామీణ లెక్కలు మరియు పన్నుల విషయములో వారిని రకరకాల ప్రశ్నలతో అధికారులు బాధపెట్టేవారు, అవమానించేవారు. కారణం బ్రాహ్మణ మతమంటే చిన్నచూపుతో తక్కువగా అంచనా వేయటమే. భరతభూమి, ఒకే దైవం అనేక రూపాలలో వ్యక్తమవుతుందని నమ్మి ఇతర మతాలను, వారి విశ్వాసాలను సహనంతో అంగీకరించింది. వారు జైన మతాన్ని, బౌద్ధమును, ఇస్లామును, క్రైస్తవమును, సూఫీ తత్త్వమును, యూదులను ఇలా ఎందరినో సంతోషంగా ఆహ్వానించింది. 'నమ్మకం, విశ్వాసం, ప్రార్థనల ద్వారా భగవంతుని చేరవచ్చు' అన్నది సగటు భారతీయుని నమ్మకం. కాని ఆ భావనను తక్కువగా, తప్పుగా అర్థం చేసుకున్నవారి వలన అక్కడక్కడ తిరుగుబాటు, హింసాకాండలు, అవమానాలు జరిగాయి. అప్పుడు మాస్టరుగారి కుటుంబ యజమాని పేరాజుగారు (మాస్టర్ ఎమ్.ఎన్.గారి కంటే ఏడు తరాల ముందువారు) గ్రామాధికారిగా ఉండి తమ లెక్కాచారాలను, పన్నులను నిజాంగారి సభలో ప్రవేశపెట్టినప్పుడు బ్రాహ్మణులకు దారుణమైన అవమానం జరుగుతుందని ముందు గానే జాగ్రత్తపడేవారు. పేరాజుగారు నిజాం దగ్గరకు వెళ్ళే ముందు రోజు ఎంతో బాధతో గడిపేవారు.

పేరాజుగారు ముందురోజు సాయంకాలం నిజాం సభలో అవమానం జరగకుండా, మనసు బాధపడకుండా, వ్యంగ్యములు లేకుండా తిరిగిరావాలనే ఆర్ద్రతతో కృష్ణ పరమాత్ముని ప్రార్థించారు. ఆ సాయంత్రం వరకు ఆయన ఉపవాసముండి కేవలం మంచినీళ్ళు

తాగి పడుకున్నారు. ఆ రాత్రి ఆయన చిరునవ్వుతో ఉన్న కృష్ణుని దర్శించి అనుభూతి పొందారు. ఆ రాత్రి కలలో ‘‘నేను కొన్నేళ్ళుగా నదీ తీరంలోని ఇసుకలో ఉండిపోయాను. రేపు నీవు నదిలో స్నానం చేసి నన్ను ఎత్తుకుని, నీ గ్రామానికి తీసుకొని వెళ్ళి, గుడి కట్టించి అందులో ప్రతిష్ఠ చేయించు’’ అన్న మాటలు వినిపించాయి. అలా కల కన్నాక పేర్రాజుగారికి సంతోషం, ఆశ్చర్యం కలిగింది. ఆయన తెల్లవారకముందే భాగ్యనగరంలోని నదీతీరానికి స్నానానికి వెళ్ళారు. ఆ నది అసలు పేరు ‘ముచికుందా’ నది. ముచికుందుడు కృష్ణునికి పరమభక్తుడు. ఆ కథ మనకు భాగవత పురాణము దశమ స్కంధములో దొరుకుతుంది. ఇస్లాం పాలనలో భాగ్యనగరము హైదరాబాదుగా మారినట్లుగా, ముచికుంద నది ‘మూసీ’ నదిగా మారిపోయింది. ఈనాడు సామాన్య మానవునికి అది మూసీ నదిగానే తెలుసు. ముచికుంద నది అన్న పేరు తెలిసినవారు చాలా అరుదు. పేర్రాజుగారు నదిలో స్నానం చేసేటప్పుడు నదీతీరములో ఏదో తగిలింది, ఆయన ఆశ్చర్యపోయారు, తనకు వచ్చిన కలను గుర్తు చేసుకుని, నదీతీరములోని ఇసుకలో చేతితో తడిమి చూసినప్పుడు మూడు అడుగుల, నల్లరాతితో చేయబడిన, చేతిలో పిల్లనగ్రోవి పట్టుకున్న త్రిభంగి కృష్ణ విగ్రహం దొరికింది. అది చూడగానే ఆయన ఒక్కసారిగా సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు. ఒళ్ళంతా గగుర్పాటు చేత రోమాలు నిక్కబొడుచుకున్నాయి. కంట నీళ్ళు కారిపోతున్నాయి. ఆ ప్రాతః సంధ్యా సమయంలో ఆయన ఆ నల్లరాతి విగ్రహాన్ని తన ఒంటిమీద ఉన్న తువ్వాలుతో చుట్టేశాడు. త్వరత్వరగా తాను వచ్చిన ఎద్దుబండి దగ్గరకు వెళ్ళి అందులో

కూర్చోవడానికి అనువుగా వేసుకున్న గడ్డితో కప్పి పెట్టాడు. ఆయన ప్రశాంతముగా వెనక్కి వెళ్ళి స్నానం చేసి తాను ఉంటున్న సత్రమునకు (అందరికీ అది అతిథి గృహము) వచ్చాడు. ఆనంద పరవశుడై ఉదయం ప్రార్థన మరియు పూజాది కార్యక్రమములు పూర్తి చేశాడు. అత్యంత ఆత్మవిశ్వాసము మరియు ఉత్సాహముతో ఆయన గ్రామంయొక్క రికార్డులను తీసుకొని, కొంతమంది అనుయాయులతోబాటు నిజాం సభకు వెళ్ళాడు. ఆయన వంతు వచ్చినప్పుడు తాను తెచ్చిన అకౌంట్స్ పుస్తకాలను ఆ అధికారులకు అందచేశాడు. వారు ఆయన ఇచ్చిన రికార్డులను చాలా జాగ్రత్తగా పరిశీలించారు. వారు ఎలాంటి ఆక్షేపణలు రాయలేదు. అడ్డు ప్రశ్నలు వేయలేదు. ఆ పని అంతా ప్రశాంతంగా జరిగిపోయింది. కట్టబడిన పన్నులకు చలాను, రసీదులు ఇచ్చారు. పన్నులు కట్టేసి పేర్రాజుగారు గంభీరంగా తన సత్రానికి వచ్చాడు. ఆయన భగవంతునికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. ఆయన ఎద్దుబండి మీద ఇంటికి తిరిగిరాగానే నదీతీరంలో దొరికిన విగ్రహానికి సంబంధించిన ఉదంతాన్ని చాలా సంతోషంగా చెప్పాడు. సన్నిహితుల సహాయ సహకారాలతో శ్రీ కృష్ణునికి ఒక అందమైన గుడిని కట్టించి అందులో ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈనాటి వరకూ ఆ దేవాలయం చక్కగా నిర్వహింపబడుతూ, వచ్చిన శ్రద్ధాళువులకు కృష్ణ సాన్నిధ్యాన్ని అందిస్తోంది. చాలా ఏళ్ళ వరకూ ఆ కుటుంబ సభ్యులే ఆ మందిరానికి ధర్మకర్తలుగా ఉండేవారు. ఆ తరువాత ఇప్పుడు స్థానిక అధికారుల పర్యవేక్షణలో అక్కడి ప్రభుత్వమే నిర్వహిస్తూ ఉంది.


మాస్టరుగారి వంశపరంపరలో ఈనాటి వరకూ శ్రీకృష్ణుడినే నరసింహుడిగా భావించి పూజిస్తూ ఉన్నారు శ్రీకృష్ణుడు భగవద్గీత ఆరవ అధ్యాయములో చెప్పినట్లుగా అలాంటి కుటుంబాలలో దివ్యప్రజ్ఞల ఆత్మలు దిగివస్తాయి. మాస్టర్ ఎమ్.ఎన్.గారు జన్మించిన కుటుంబము సంపన్న కుటుంబమే కాక యోగులు మరియు భక్తులు ఉన్న కుటుంబము.



# 3

## అవతరణము

ఆయన జనన సమయములో రవి కన్యలోను, చంద్రుడు వృషభరాశిలోను ఉన్నారు. ఆయన ఆరూఢ లగ్నం, తుల. సాయన




జన్మ చక్రము

జన్మకుండలి ప్రకారం లగ్నం నుండి అష్టమ భావంలో ఇంద్రగ్రహం (Neptune), చంద్రుడు, శని మరియు యమ గ్రహం (Pluto) ఉన్నాయి. నవమ స్థానంలో కుజుడు మిథున కర్కాటక రాశుల భావమధ్యములో నుండగా, బృహస్పతి దశమ భావమైన కర్కాటకములో నున్నాడు. ఏకాదశభావమైన సింహములో శుక్రుడు, కన్యలో రవి ఉన్నారు. కన్యారాశిలో బుధుడు, వరుణుడు (Uranus) సమాగమములో ద్వాదశ భావము ననుసరించి ఉన్నారు. రాహువు వృశ్చికరాశి 4 భాగలలోనూ (degrees), కేతువు వృషభములోనూ ఉన్నారు. సప్తమ స్థానము మొదలు ద్వాదశ స్థానము వరకు ఆయన జాతక చక్రంలోనున్న గ్రహములను బట్టి, జ్యోతిష పండితులు ఆయనకు 'మాలికాయోగము' అబ్బునని అభిప్రాయపడిరి. మాలికా యోగమనగా జీవితమందలి ఆధ్యాత్మిక సంబంధిత విషయములలో ఒక వరుస క్రమములో సంభవించు పురోగమిత సంఘటనలద్వారా, గ్రహకూటమిలో సూర్యుడు వెలుగొందునట్లుగా జీవితమున పేరు ప్రఖ్యాతులలో వెలుగొందుట. అనగా ఇతరులకు ఆదర్శప్రాయముగా, మార్గదర్శకముగా వెలుగు నింపు జీవితము అన్నమాట.

చాంద్రమాన పద్ధతిలో మాస్టరుగారి జన్మదినం శ్రావణ బహుళాష్టమి, అనగా శ్రీకృష్ణజన్మాష్టమి. జనన సమయములో చంద్రుడు కుమారస్వామి యొక్క నక్షత్రమైన కృత్తికలో నున్నాడు. మాస్టరుగారి తల్లితండ్రులు మైనంపాడు వాస్తవ్యులైనప్పటికీ, ఆయన నాయుడుపేటలోని తన మాతామహుని ఇంట జన్మించిరి. శ్రీ ఎమ్.ఎన్.గారి తండ్రి శేషయ్య, స్కూలు టీచర్. ఆయన

ఒంగోలుకు తూర్పున పది మైళ్ళ (పదహారు కి.మీ.) దూరంలో బంగాళాఖాతం ఓడరేవుకు దగ్గరలో ఉన్న కొత్తపట్టణంలోని స్కూల్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేశారు. శ్రీ ఎమ్.ఎన్. గారు తమ తల్లితండ్రులకు మొదటి సంతానము. తల్లిదండ్రులు ఏతముక్కల గ్రామంలోగల గుడిలోని దేవుడిచేత ప్రేరణ పొంది 'జ్వాలా నరసింహం' అని పేరు పెట్టారు. ఆ గుడిలోని దేవుడి పేరు గూడా 'జ్వాలా నరసింహమే'.

శ్రీ ఎమ్.ఎన్.గారి బాల్యమంతయు కొత్తపట్టణంలోనే గడిచింది. వారికి 5వ ఏటనే అక్షరాభ్యాసం జరిగింది. వాళ్ళ నాన్నగారు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసే ప్రాథమిక పాఠశాల లోనే వీరిని కూడా చేర్చారు. తదనంతరము మాధ్యమిక విద్యకోసం ఒంగోలు పట్టణములో ఉన్నారు. ఉన్నత విద్యకోసం ఆ రోజులలో ప్రముఖ పట్టణమైన రాజమండ్రిలో, వారి మేనమామ గారైన టంగుటూరి ప్రకాశం గారింట్లో ఉన్నారు. శ్రీ టంగుటూరి ప్రకాశంగారు పేరుమోసిన న్యాయవాది, ప్రముఖ స్వాతంత్ర్యయోధుడు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన బ్రిటిష్ సైనికుల తుపాకుల తూటాలకు ఎదురుగా గుండె నిలిపినవారు. ఆయన భారత స్వాతంత్ర్య పోరాట సమయంలో ఆంధ్రదేశానికి మంచి ఊపునిచ్చారు. అంతటి ధైర్యసాహసాలను చూపిన ఆయన జాతీయ స్థాయిలో 'లయన్ ఆఫ్ ఆంధ్ర' (ఆంధ్ర కేసరి) అన్న బిరుదు పొందారు. ఆయన ప్రముఖ న్యాయవాదిగా అప్పటి మద్రాసు (చెన్నై) హైకోర్టులో పనిచేసేవారు. మొదట్లో మద్రాస్ రాష్ట్రము దక్షిణ భారతదేశములో ఆంధ్ర, తమిళనాడు, కర్నాటక

మరియు కేరళ సంస్థానములతో కూడిన అతిపెద్ద సంయుక్త రాష్ట్రము. ఈ నాలుగు సంస్థానములలోని నాగరికులు వివిధ భాషలను మాట్లాడుతున్నప్పటికీ మదరాసీలని, ఇక మిగిలినది దక్షిణ భారతదేశమని గుర్తించి పిలువబడేవారు. టంగుటూరి ప్రకాశంగారు దక్షిణభారతదేశంలో ప్రసిద్ధులైన వారిలో ఒకరు. భారత స్వాతంత్ర్యం తరువాత ఈ నాలుగు సంస్థానములు ప్రత్యేక హోదాను పొందినప్పుడు టంగుటూరి ప్రకాశంగారు ఆంధ్రదేశానికి ముఖ్యమంత్రిగా నియమింపబడ్డారు. ఆయనపై గల గౌరవానికి సంకేతంగా ఒంగోలు జిల్లాకు 'ప్రకాశం జిల్లా' అని పేరు మార్చబడింది. ఆయన శ్రీ ఎమ్.ఎన్.గారికి మేనమామ. బాల్యంలో శ్రీ ఎమ్.ఎన్. గారికి మేనమామయే ఆదర్శంగా ఉండేవారు. ఆయన ఆడంబరములో, సంతోషములో, చలాకీతనములో, సత్యము, దాతృత్వములో, ఔదార్యంలో మేనమామను మించేవారు. న్యాయవాద వృత్తిలో కూడ ఆయన మేనమామను మించినవారు. ఆయన స్వంత ప్రాక్టీసుతో స్వతంత్ర న్యాయవాదిగా ఉండి, న్యాయాలయంలో పనిచేసేవారు.

**విద్యాభ్యాసం :**

విద్యాలయంలో అడుగుపెట్టిన మొదటి రోజు నుండి ఈ బాలుడు తన స్వంత ప్రతిభ, యోగ్యతలతో అసాధారణమైన మేధాశక్తిని ప్రదర్శించాడు. బాల్యంలోనే 'ప్రతిభ' అనే సద్గుణముచేత ప్రభుత్వం ఇచ్చే స్కాలర్‌షిప్ పొందాడు. ప్రభుత్వం విద్యార్థులు తమ విద్యాభ్యాసములో ప్రదర్శించే ప్రతిభకు నిదర్శనంగా స్కాలర్‌షిప్ ఇస్తుంది. అలాంటి విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుంది.

శ్రీ ఎమ్.ఎన్.గారు 1901లో మద్రాస్ క్రిస్టియన్ కాలేజీ నుండి మెట్రిక్యులేషన్ పరీక్షకు హాజరయ్యారు. మరొకసారి ఆయన ఎనలేని ప్రతిభావంతుడైన విద్యార్థిగా తన ప్రతిభను ప్రదర్శించి పట్టా పుచ్చుకున్నారు. మద్రాసు కాలేజీ విద్యాభ్యాస సమయంలో ఆయన విద్యార్థి వసతి నిలయంలో (హాస్టల్) ఉండేవారు. ఆయనలో స్నేహితులను ఆకట్టుకునే నైపుణ్యం ఉంది. ఆయన స్నేహితులు ఆయనను ఒక ప్రతిభావంతుడైన విద్యార్థిగా మాత్రమే కాక సరదాగా, అల్లరిగా ఉండే స్నేహితుడిగా గుర్తుంచుకొనేవారు. ఆ రోజులలో బ్రాహ్మణ కుటుంబాల నుండి వచ్చే అనేకమంది విద్యార్థులు తమ తలపై శిఖలను ఉంచుకునేవారు. ఆ శిఖలు వారిలోని సనాతన ఆచార సంప్రదాయానికి, ఆస్తికత్వానికి సంకేతం. వారందరూ నిద్రపోయినప్పుడు వారి శిఖలను కత్తిరించి ఆ వెంట్రుకలతో బంతిని తయారుచేసి తరగతిగదిలో టీచర్ గారి టేబిల్ పై పెట్టి, తన బ్రాహ్మణ స్నేహితులందరూ ఉదారులని, తమ శిఖలను బంతిగా చేసి బాల్ బాడ్మింటన్ ఆడుకోవడానికి యిచ్చారని ప్రకటించాడు. ప్రతివారం ఇలాంటి అల్లరి పనులు చేస్తూ తన స్నేహితులకు, టీచర్లకు కూడా ఆనందాన్ని, సంతోషాన్ని కలిగించేవారు.

1903లో ఆయన 'ప్రీ కాలేజి', 1905 లో మద్రాసు (చెన్నై) కాలేజి నుండి ఫిజిక్స్ ప్రత్యేక విషయంగా డిగ్రీ పొందారు. ఆయన పరీక్షలో ప్రథమ శ్రేణిని, డిగ్రీ పరీక్షలో ద్వితీయ శ్రేణిని పొందారు.

**వివాహము — వృత్తి :**

ఆయన 1907లో రాజమండ్రిలో ప్రత్యేక శిక్షణ పొంది 1908 లో విజయవాడలోని చర్చ్ మిషన్ స్కూల్‌లో టీచర్‌గా వృత్తిని చేపట్టారు. ఈ చర్చ్ మిషన్ స్కూల్ తరువాత మహాత్మాగాంధీ మునిసిపల్ హైస్కూలుగా పేరు మార్చబడింది. 1903 మరియు 1905లో ఆయన మద్రాసులో డిగ్రీ చదువుతుండగానే మేనమామ ప్రకాశం పంతులుగారి ఆధ్వర్యంలో 1904లో కర్నూలుకు చెందిన శ్రీమతి రంగనాయకమ్మగారితో పెళ్ళి కుదిరి, పెళ్ళి జరిగి పోయింది. శ్రీ ఎమ్.ఎన్.గారి పెళ్ళి సమయంలో, ప్రకాశంగారు ఇంగ్లండ్ లో బారిస్టర్ చదువుతుండేవారు. తన మేనల్లుడి పైగల ప్రేమ కారణంగా ఆయన భారతదేశానికి తిరిగి వచ్చి పెళ్ళి జరిపించారు. అప్పుడే ఆయన తన మేనల్లుడికి న్యాయవాద వృత్తిని ప్రాక్టీస్ చేయమని సూచించారు.

ఆయన రాజమండ్రిలో (1907) ఉపాధ్యాయ శిక్షణలో ప్రత్యేక కోర్సును నిర్వహించి 1908 – 1909 వరకు అధ్యాపక వృత్తిని చేపట్టారు. ఆయనకు సహోద్యోగులలో మంచి అధ్యాపకుడిగా గుర్తింపు లభించినప్పటికీ, తన స్వభావానికి అధ్యాపక వృత్తి సరిపోదని గుర్తించారు. ఆయన 1910 మరియు 1911లో 'లా' చదవటానికి మద్రాసు వెళ్ళారు. ఆయన తన మేనమామలాగే మంచి లాయర్‌గా తయారవ్వాలని నిర్ధారించుకున్నారు. ఆయన మద్రాసులో రెండేళ్ళు ఉండి తన 'లా' చదువును పూర్తి చేశారు. ఆ సమయంలో ఆయన మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో పనిచేస్తూ ఆర్థికంగా కూడా నిలదొక్కుకున్నారు.

ఆయన ఫిజిక్స్ టీచరుగా పనిచేస్తూ, విద్యార్థుల సౌలభ్యంకోసం ఒక పుస్తకాన్ని కూడా రచించారు. దానిని విద్యార్థులకోసం 'చంద్రికా గ్రంథాలయము'వారు ముద్రించారు. ఆయన తండ్రి ఉపాధ్యాయుడు కావటం చేత ఆయన ముందుగా అధ్యాపక వృత్తినే ఎంచుకున్నారు. కాని తన ప్రవృత్తికి మేనమామ చేయు వృత్తియే సరియైనదని భావించిన ఆయన తన వృత్తిని మార్చటానికి వెనుకాడలేదు. ఆయన మంచి ఉపాధ్యాయుడిగా, మంచి రచయితగా పేరుపొందినప్పటికీ ఆ వృత్తిని కొనసాగించలేదు. నిజానికి ఆయన వ్రాసిన భౌతికశాస్త్ర పుస్తకం చాలాసార్లు పునర్ముద్రించబడింది. ఆ పుస్తకము క్రమంగా 16 విద్యా సంవత్సరములలో 16 సార్లు ముద్రింపబడింది. ఆ పుస్తకం శిక్షణపై సంపూర్ణ అధికారాన్ని యిస్తుంది. మేనమామగారి ఆకర్షణీయమైన జీవనవృత్తి చేత తనకు తెలియకుండానే ప్రభావితమై ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో న్యాయవాద వృత్తికి మారిపోయారు.

1912లో న్యాయవాది కోర్సు పూర్తిచేసి వృత్తిని ప్రారంభించడానికి ముందుగా రాజమండ్రిలోని తన మేనమామ దగ్గర తర్ఫీదుకోసం వచ్చారు. తర్ఫీదు పూర్తి అయ్యాక ఒంగోలుకు దగ్గరగా ఉన్న మరొక పట్టణం బాపట్లకు వచ్చారు. ఆయన బాపట్లలోని సబ్-కోర్టులో ప్రాక్టీసు చేస్తూ ఉండేవారు. 1912లో ఒంగోలుకు వచ్చి ఒంగోలు పట్టణంలోని కోర్టులో కూడా ప్రాక్టీసు ప్రారంభించారు. ఆంధ్రదేశములోని ఒంగోలు పట్టణము చాలా వ్యాజ్యములకు పేరు పొందినది. ఆయన తన కుటుంబాన్ని ఒంగోలుకు మార్చినప్పటికీ కొంతకాలము వరకు ఆయన బాపట్లలో

కూడ ప్రాక్టీసు చేసేవారు. చాలా కొద్ది కాలములోనే ఆయన సివిల్ మరియు క్రిమినల్ లాయరుగా కూడ మంచిపేరు తెచ్చుకున్నారు. ఆయన కోర్టులో వాక్చాతుర్యం గల లాయరుగా, హాస్యము, బుద్ధిచాతుర్యముగల లాయర్‌గా పేరు పొందారు. ఆయన తనదైన సూక్ష్మబుద్ధి చేత, ఎన్నో వ్యాజ్యములను పరిష్కరించారు.

శ్రీ ఎమ్.ఎన్.గారు టెన్నిస్ మరియు బిలియర్డ్స్ ఆటలలో మంచి నేర్పరి. ఈ రెండు ఆటలు ఆయన మనస్సును ఆకర్షించి, ఆహ్లాదపరచేవి. ఈ రెండు ఆటలలో ఆయన మంచి నేర్పును కూడ సంపాదించారు. అప్పటికి శ్రీ ఎమ్.ఎన్.గారి మేనమామ ప్రకాశంగారు బారిష్టర్ చదవడానికి రాజమండ్రి నుండి ఇంగ్లండ్ వెళ్ళి, ఆదర్శప్రాయమైన బారిష్టర్ డిగ్రీతో మద్రాసుకు తిరిగివచ్చి, మద్రాసు హైకోర్టులో అడ్వకేట్‌గా పనిచేశారు. అతని మేనమామ మద్రాసు హైకోర్టులో పనిచేస్తుండగా, శ్రీ ఎమ్.ఎన్.గారు ఒంగోలు సబ్ కోర్టులో పనిచేస్తుండేవారు. శ్రీ ఎమ్.ఎన్.గారి న్యాయవాద వృత్తి ప్రత్యేక శ్రద్ధతో జరిగిందని ఇక్కడ మనం చెప్పుకోవాలి. ఆయన కేవలం న్యాయంకోసమే న్యాయవాద వృత్తి చేశారు. వివాదాలలో చిక్కుకున్న ప్రజలు సివిల్, క్రిమినల్ కేసులతో ఆయన దగ్గరకు వచ్చేవారు. ఆయన చాలా శ్రద్ధతో ఆ కేసులను తీసుకొని తన కక్షిదారులకు న్యాయం కలిగించేవారు. ఆయన తాను చేసిన పనికి ఏనాడూ అడిగి ఫీజు తీసుకోలేదు. ఫీజు విషయాన్ని ఆయన తన నుండి లాభంపొందిన తన కక్షిదారుల ఇష్టానికే వదిలేవారు. ఎప్పుడైనా, ఎవరైనా ఫీజు ఇవ్వాలని అడిగినప్పుడు, తన ఆఫీసు రూములో, ఒక మూల కోటుహాంగర్‌కు తగిలించిన కోటుయొక్క

జేబును చూపించేవారు. ఆయన భార్య ఇంటి ఖర్చులకు ఎప్పుడైనా డబ్బు అడిగితే కూడా ఆ కోటు జేబు చూపించి, ఎంత అవసరమో అంతే తీసుకొమ్మని చెప్పేవారు. ఆయన తన చేతితో ఏనాడూ డబ్బు తీసుకోలేదు, అలాగే తన చేతితో డబ్బు ఇవ్వనూ లేదు. అవసరమైన పనులకు ధనం స్వేచ్ఛగా వస్తూ ఉండేది, అలాగే ఖర్చు అయిపోతూ కూడా ఉండేది. అలా ఆయన తన పెద్ద కుటుంబాన్ని మాత్రమే కాక తనవారనుకున్నవారికి కూడా ఆర్థిక సహాయం చేసేవారు. జీవితావసరాలకు సంబంధించినంత వరకూ ఆ కోటు జేబు గల్లాపెట్టెలా ఉపయోగపడేది. ఆ జేబులో ఎంత డబ్బు ఉన్నదని ఆయన ఏనాడు లెక్కపెట్టి చూడలేదు. శ్రీ ఎమ్.ఎన్.గారికి ఇతరుల నుండి సహాయం పొందే అలవాటు ఏనాడూ లేదు.

ఆయన ఇంకా ఉన్నత చదువులను కొనసాగించారు. ఆయన ఉన్నత చదువుకోసం జాతీయ స్కాలర్‌షిప్‌లను కూడా పొందారు. ఆయన చదువు విద్యాపరంగా కాని, ఆర్థికపరంగా కాని ఏనాడూ ఇబ్బంది కాలేదు. పాఠశాలలో కాని, కాలేజీ చదువులో కాని ఆయన తన చదువులో ఏకసంథాగ్రాహిగా ఉండేవారు. అద్వితీయమైన గ్రహణశక్తి ఆయనకు ఉండేది. పెద్దలు కుదిర్చిన వివాహాన్నే చేసుకున్నారు. ఆయన ఇంటికి పెద్ద కొడుకు కావటంచేత, తండ్రివైపు కుటుంబంతో బాటు తనదే అయిన పెద్ద కుటుంబాన్ని కూడా భరించారు. చదువుకునే రోజులలో కూడ తన దగ్గరకు వచ్చిన విషయాలకు స్పందించేవారు. ఆయనకు ఏనాడూ, ఏ వస్తువు మీద కూడ బలమైన కోరిక కలిగేది కాదు. ప్రకృతి యొక్క విషాద పరిణామాలు కలిగేటంతవరకూ ఆయన పరిపూర్ణ జీవితాన్ని గడిపారు.

ఆయన చుట్టూ ఉన్నవారు సంప్రదాయవాదు లైనప్పటికీ శ్రీ ఎమ్.ఎన్.గారు ఆధునికత యొక్క పరిమళాన్ని చూపించారు. ఆ కాలములో బ్రాహ్మణ కుటుంబాల నుండి వచ్చినవారు శిఖను ఉంచుకొని తలపై పాగా, అందులో ఒక తురాయి ధరించి తమ సంప్రదాయాన్ని గౌరవించేవారు. శ్రీ ఎమ్.ఎన్. గారు సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారైనను అలాంటి వేషధారణకు కాస్త దూరంగా ఉండేవారు. అప్పుడప్పుడూ శిఖ లేకుండా క్షవరం చేయించుకొని జుత్తును ఉంచుకొనేవారు. భారతీయ సంప్రదాయానికి తగినట్టుగా వస్త్రధారణ చేయక ఆయన పాశ్చాత్య దుస్తులను కూడా ధరించేవారు. ఇంట్లో కూడా అందరూ ధరించే అంగవస్త్రాన్ని కాకుండా సంప్రదాయానికి విరుద్ధంగా ఆయన లుంగీ మరియు టీ–షర్ట్ ధరించేవారు. ఆయన సంప్రదాయబద్ధమైన నుదుటి గుర్తులను (భస్మధారణ, తిలకధారణ) పెట్టుకునే వారు కాదు. అయనకు పెద్ద మీసాలు (బుర్ర మీసాలు) పెంచుకోవాలన్న కోరికతో వాటిని జాగ్రత్తగా పెంచుకొని చివరలో మెలి తిప్పేవారు. అది ఆ రోజులలో ఉన్న పద్ధతికి విరుద్ధంగా ఉండేది. ఆయన జీవితంలోని అన్ని కోణాలలో ఆస్వాదించాలనే కోరిక గలవాడై, తన చుట్టూ ఉన్న వేషధారణకు కాని, ఆచార వ్యవహారాలకు కాని బద్ధుడు కాలేదు. బ్రాహ్మణుడై ఉండి కూడా రోజూ ఆయన పాలు లేకుండా చల్లటి కాఫీ (కోల్డ్ కాఫీ) తాగడం, పెద్ద మోతాదులో సిగరెట్లు కాల్చడం లాంటి అసాధారణ అలవాటు ఆయనకు ఉండేది. శ్రీ ఎమ్.ఎన్.గారు తనను తానే సరిచేసుకొని, రూపుదిద్దుకున్న నిజమైన కుంభరాశి వ్యక్తి. ఆయనకు మదిలో ఉన్న ఆదర్శవ్యక్తి తన

మేనమామ ప్రకాశంగారు ఒక్కరే. కాని పైన చెప్పిన అలవాట్లలో ఆయన తన మేనమామను కూడ మించిపోయారు. శ్రీ ఎమ్.ఎన్. గారి ప్రకారము తాను ఒక పెడసరి మరియు మొండివాడు. ఆయన తనగురించి మాట్లాడుతూ "నేను చాలా అహంభావముతో, మొండిపట్టుదలతో ఉండేవాడిని. మాస్టర్ సి.వి.వి. గారిని కలిసేదాకా 'నేనూ ఒక బ్రాహ్మణుడను' అనే భ్రమలో ఉండేవాడిని. మాస్టరుగారిని కలిసి, ఆయనను చూసిన తరువాత ఆయనలోని బ్రాహ్మణుడిని చూశాక, బ్రాహ్మణుడంటే ఏమిటో తెలిసింది. నేనింకా బ్రాహ్మణుడను కాలేదని అర్థం అయింది. నాలో పొగరు మోతుతనం, మొండితనంతో పాటు అసహనం కూడా ఉండేవి. మాస్టరుగారి స్పర్శ లభించే దాకా నా వ్యక్తిత్వం అలా ఉండేది" అన్నారు.

ఒంగోలులో ప్రాక్టీసు బాగా పెరిగింది. వ్యాజ్యాలు, కక్షిదారుల ఒత్తిడి నుంచి తప్పుకొని కొంత విశ్రాంతి పొందడానికి ఆయన సాయంత్రం క్లబ్బుకు వెళ్ళి టెన్నిస్, బిలియర్డ్స్ మరియు పేకాట కూడా ఆడేవారు. బిలియర్డ్స్ మరియు టెన్నిస్ ఒంగోలులో బాగా ప్రసిద్ధి కావటానికి అప్పుడప్పుడూ టోర్నమెంట్స్ జరిపేవారు. అప్పట్లో ఫ్యాషనైన అలవాటు, సిగరెట్ కాల్చడం కూడా ప్రారంభించారు. ఆయన ఒకదాని తరువాత ఒకటిగా సిగరెట్ కాలుస్తూ చైన్ స్మోకర్‌గా తయారయ్యారు. ఆయన కేవలం క్యాప్‌స్టన్ సిగరెట్లతో మాత్రమే ఉత్తేజితులయ్యేవారు. ఆయనకున్న పని ఒత్తిడి వల్ల అలా ఖరీదైన అలవాట్లకు గురి అయ్యారు. కాఫీ మరియు సిగరెట్ ఆయన జీవితంలో ఒక భాగంగా

తయారయ్యాయి. ఆయన తనతో బాటు ఎప్పుడూ 50 సిగరెట్ల ప్యాకెట్ మరియు ఒక ఫ్లాస్క్ ఉంచుకునేవారు. చల్లటి స్ట్రాంగ్ కాఫీ ఆయన చివరి క్షణంలో కూడా నేస్తంగా నిలిచింది. ఆయన 'బార్ ఆఫ్ లాయర్స్'కు లీడర్‌గా ఉండేవారు. ఒంగోలు క్లబ్ లో ఆయన సభ్యుడు. ఆయన ఆ క్లబ్ కోసం బిలియర్డ్స్ టేబిల్ కూడా కొన్నారు. ఆ ఆటకు మంచిపేరు తేవడానికి ఆయన తన సహోద్యోగులను ఆ ఆటలో పాల్గొనడానికి ప్రోత్సహించేవారు. ఆయన ఒంగోలులోని సి.వి.ఎన్.క్లబ్‌లో జీవిత సభ్యులయ్యారు. క్లబ్‌లో అనేక రకాల కార్యక్రమములలో పాల్గొన్నప్పటికీ రోజురోజుకు ఆయనలోని మానసిక ఒత్తిడి బాగా పెరిగింది. ఆ ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఆయన రామాయణ, భారత, భాగవత మరియు భగవద్గీత గ్రంథాలను చదవడం ప్రారంభించారు. ఆయన ప్రాక్టీస్, పెళ్ళి, కుటుంబము, ఆటలు, క్లబ్ లో పేకాట, ధూమపానము అన్నీ ఆయనను చాలా శ్రమకు గురిచేశాయి. ఫలితంగా ఆయన టైఫాయిడ్ జ్వరానికి గురయ్యారు. దాని ఫలితంగా ప్రేగులలో అంతరంగ రక్తస్రావము కూడా అయినది. ఆయన మేనమామ ఆయనను ప్రకృతి చికిత్సలో భాగంగా తొట్టి స్నానము చేయించగా ఆయన ఆరోగ్యములో ఆశ్చర్యకరమైన మార్పు వచ్చింది. ఆయన అప్పటినుండి ఆరోగ్యరీత్య బాగా పుంజుకున్నారు. శ్రీ ఎమ్.ఎన్. గారు కోలుకుంటూ ఉండగానే అంతుచిక్కని జబ్బుచేసి తండ్రిగారు చనిపోయారు. 'తన కొడుకు జీవన ప్రయాణం నిరాటంకంగా కొనసాగాలని తండ్రి ప్రాణం వదిలారు' అన్నది బంధుమిత్రుల అభిప్రాయము.

4

# సంక్షోభ సమయము-అన్వేషకుని జన్మ కారణము

తండ్రిగారు మరణించిన తరువాత, అతి కొద్ది కాలములోనే ఆయన తల్లి మరియు అత్తగారు కూడా మరణించారు. ఇంటిలోని ముగ్గురు పెద్దల మరణం యొక్క ప్రభావం ఆయనపై చాలా పడింది. మరణ రహస్యం తెలుసుకోవడానికి ఆయన మన సనాతన గ్రంథాలను మళ్ళీ మళ్ళీ చదివారు. మరణాన్ని గురించిన ఆలోచనలు, జీవితానికి సంబంధించిన ఆలోచనలు ఆయనను చుట్టుముట్టేవి. నిగూఢమైన జన్మరహస్యం, జీవనకారణం, మృత్యువు – పునర్జన్మ గురించి తెలుసుకోవడానికి మనసు ఆలోచనల అడవిలో ఎడతెరిపి లేకుండా ప్రయత్నించేది. 1914 దాకా జీవితం ఆటలాగ, సంతోషంగా, చదువులో, వృత్తిలో, సామాజిక సంబంధాలలో కూడా విజయవంతముగా గడిచింది. జీవితంలో ఎన్నో మరణ సమస్యలు చుట్టుముట్టినప్పటికీ, అలౌకిక జీవితంలోకూడ ప్రగతిని పొంది గృహస్థు అయ్యారు. ఆయనకు ఐదుగురు కొడుకులు మరియు ముగ్గురు కూతుళ్ళు ఉన్నారు. ఇంటికి పెద్దకొడుకు కావటం చేత ఆయనకు తండ్రి వైపు కూడా కుటుంబ బాధ్యతలు ఉండేవి. ఆయన తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, వాళ్ళ కుటుంబాలు మరియు తన కుటుంబమును కూడ నిర్వహించారు.

తన పెద్దల మరణానికి సంబంధించిన మరణ రహస్యాలు, అంతేకాక 1913లో జరిగిన తన 10 ఏళ్ళ తమ్ముడి మరణం శ్రీ ఎమ్.ఎన్. గారిని బాగా కలవరపరిచింది. తన జీవిత లక్ష్యం ఏమిటి ? అనే అంశాన్ని తెలుసుకోవాలన్న లోతైన ఆలోచన మనసులో కలిగింది.పెద్దవాడైన కారణంగా ఆయనకు తమ్ముడంటే చాలా ప్రేమ. తమ్ముడి మరణాన్ని ఆయన మనసు అంగీకరించలేక పోయింది. లోలోపలే జీవించటానికి కారణమేమిటి ? అని మనసు పదే పదే ప్రశ్నించసాగింది. తన తోటివారు అలా మృత్యురూపంలో మాయమవుతూ ఉంటే, ఆయన్ని వరించి వచ్చే విజయాలు ఎలాంటి సంతోషాన్ని ఇవ్వలేకపోయాయి. అది ఆయనలో ఏదో వెలితిని మిగిల్చింది. ఆయన యాంత్రికంగా వృత్తికి సంబంధించిన, సామాజిక, సాంసారిక బాధ్యతలను నిర్వహిస్తున్నప్పటికీ లోనున్న మనస్సు జనన మరణాల రహస్య అన్వేషణలో నిమగ్నమైనది. ఎంత గొప్ప వాడైనప్పటికీ మృత్యుదేవతకు బలి కావలసిందే కదా! అని తెలుసుకున్నారు. 'మానవుడు మృత్యువును దాటలేడా?' అన్న ప్రశ్న మనసులో మెదిలేది. స్నేహితులు, దార్శనికులు, వేదాంతులు, ఆచార్యులు, పండితులు మృత్యువును గురించిన తమ సమాధానాలను వివరించినప్పటికీ శ్రీ ఎమ్.ఎన్.గారి మనసు అంగీకరించలేదు. "*జాతస్య హి ధ్రువో మృత్యుః .......*" (పుట్టినవాడు మరణించక తప్పదు) అని సంస్కృత శ్లోకాన్ని చెప్పినప్పటికీ ఆయనకు అది రుచించలేదు. మనసు ఒప్పుకోలేదు. 'ఇది అలా ఉండదేమో' అని భావించారు.

జీవితంలోని అన్ని కోణాలను పరీక్షగా గమనించే ఆయన తన

గురించి తానే కూలంకషంగా పరీక్ష చేసుకున్నారు. లెక్కలేనన్నిసార్లు ఆయన తనకు తానే ఇలా ప్రశ్న వేసుకున్నారు. 'నేను' (ఆయన) కూడా చనిపోతానా? మృత్యువుతో అంతా ముగిసిపోతుందా? తాను మృత్యువును దాటలేడా? తాను అమరుడు కాలేడా? ''మనిషి జీవించాడనికి తగు జాగ్రత్తలు తీసుకొంటే, జీవించాలనే బలమైన కోరిక ఉంటే, ఆ మనిషికి మరణము లేదని, రాదని'' అతని అంతరంగంలోని మౌనవాణి శ్రీ ఎమ్.ఎన్.గారికి సూచించేది. మనిషి మృత్యువును అధిగమించగలడని అతని అంతర్వాణి ప్రమాణపూర్వకంగా చెప్పేది. ఆయన చాలా పురాణ కథలను పరిశీలించి ఎంతోమంది శిష్యులు, భక్తులు తమ ఆస్తిక్య భక్తితో, కఠిన సాధనచేత మృత్యువును అధిగమించారని గమనించారు. అయితే ఆయనను నూతన విధానంలో పెంచడం జరిగింది. ఆతని పాలన పోషణ అంతయూ పాశ్చాత్య ప్రభావముతో కూడిన విధానములోనే జరిగింది. ఆయన ఎప్పుడూ తమ పూర్వీకులుచేసిన కఠిన సాధననుగాని, వారు పెంచి పోషించిన సంప్రదాయ పరంపరను గురించి ఆలోచించలేదు. తన వంశ పరంపరలో పైన తెలిపిన సాధనయొక్క జ్ఞానం అన్నది ఎక్కడో తప్పిపోయింది. ఆయనకున్న ఒకే ఒక్క ప్రేరణ తన కుటుంబములో తనకంటే ఏడవతరం ముందున్న పేర్రాజుగారు. అప్పట్లో దైవంగా రూపు కట్టుకొని వచ్చిన శ్రీకృష్ణునితో పేర్రాజుగారికి జరిగిన దర్శనము, అందులోని సంభాషణ ఆతని కనుల ముందు కదిలేవి. తాను కూడా శ్రీకృష్ణుడు జన్మించిన తిథిలో జన్మించానని గమనించిన శ్రీ ఎమ్.ఎన్.గారికి చాలా సంఘర్షణ కలిగేది. పురాణపురుషుడైన

శ్రీకృష్ణుడు ఏ రోజు జన్మించాడో, అదే రోజు తాను జన్మించడము, మరియు తాను ఒక విభిన్న లౌకిక ప్రపంచంలో కూరుకు పోవడము ఎంత విభిన్నమో కదా అని ఆశ్చర్య పోయేవారు.

అలా ఘర్షణ ఆయన జీవితంలో మానసిక వ్యథ మరియు నిరాశ నిస్పృహలకు దారితీసింది. శ్రీ ఎమ్.ఎన్.లోని అంతరంగం అమరత్వం గురించిన సత్యాన్వేషణ చేస్తూ ఉంటే, బాహ్యంలో ఆయన యాంత్రికంగా తన వృత్తి, సామాజిక, సాంసారిక బాధ్యతలను కూడా నిర్వహించేవారు. అది నిరీక్షణా సమయం. అలాంటి సతత నిరీక్షణ వలన ఆయనలో పుట్టిన అవిశ్రాంతత తీవ్రమై అసహనానికి దారితీసింది. 'తన జీవితం కూడా అందరిలా లౌకిక జీవితంగానే గడిచిపోవాలా?' అన్న ప్రశ్న ఆయనలో మొదలైంది. ఆయన అంతరాత్మ 'యాంత్రికంగా భౌతిక ప్రపంచములో గానుగెద్దులా నీ జీవితం వ్యర్థం కానివ్వకు' అని హెచ్చరించేది. అదే జరిగితే ఈ జీవితానికి విలువలేదు. అలాగని జీవితాన్ని ముగించడంలో కూడా అర్థంలేదని ఆయనలోని వివేకం హెచ్చరించేది. జీవన సత్యాన్ని అన్వేషించాలనే ఆయన నిర్ణయం రోజురోజుకు పెరుగుతూ దృఢంగా మారింది. ఎదురుచూడడం అన్నది నిజంగా విసుగొచ్చే విషయం. అందులో సందేహం లేదు. కాని అక్కడ ఒక సూచన లోపలినుండో లేదా బయటినుండో వచ్చేదాకా ఎదురుచూడటం తప్ప వేరే దారి లేదు. శ్రీ ఎమ్.ఎన్.గారి ఆత్మ అనిశ్చిత పరిస్థితిలో ఉంది. ఆయనకు లౌకిక విషయాలపట్ల క్రమంగా ఆసక్తి తగ్గుతూ వుంది, కాని సత్యాన్ని గురించి తెలుసుకునే దారి కూడా దొరకటం లేదు. అది ఆయనకు

తరచుగా కలిగేది. ఆయన జాతకరీత్యా తులా లగ్నము వారు, సింహరాశి గుణములు కలిగినవారు. చంద్రుడు వృషభరాశిలో కలిగినవారు కనుక స్వావలంబన కలిగి సరియైన సమయము కొరకు వేచి ఉండగలిగినారు. అలా 1919 వరకూ అంటే 7 ఏళ్ళ పాటు ఆయన నిరీక్షణ సాగింది.

**పిలుపు :**

మనిషికి కాలం కలిసివచ్చినప్పుడు జీవితంలో కూడా అలాంటి ఘటనలే జరుగుతాయి. మనిషికి సరియైన సమయం తెలియకపోయినా ప్రకృతి ప్రణాళికలో సరియైన సమయం నిర్ధారింపబడి ఉంటుంది. 1919 సంవత్సరపు చిట్టచివరి భాగంలో అంటే డిసెంబరులో దివ్య పరిష్కారం దొరికింది. విచిత్రం ఏమిటంటే అది కూడా ఆయనకు మేనమామ ప్రకాశంగారి ద్వారానే దొరికింది. శ్రీ ప్రకాశంగారు మద్రాసు హైకోర్టులో న్యాయవాద వృత్తిలో ఉండేవారు. వారికి భగవదాదేశంగా పుణ్యక్షేత్రమైన శ్రీరంగం దేవాలయమునకు సంబంధించిన ఒక కోర్టు కేసును పరిష్కరించవలసినదిగా ఆదేశం వచ్చింది. శ్రీరంగం అనే పుణ్యక్షేత్రం తమిళనాడు రాష్ట్రంలో అతి ప్రసిద్ధమైన పుణ్యక్షేత్రం. దానికి సంబంధించిన కోర్టు పనికి ఎక్కువ సమయం తీసుకునే పరిస్థితి ఉండటం వలన వారు శ్రీరంగములోనే ఉండవలసిన అవసరం ఏర్పడి ఒక తాత్కాలిక నివాసం ఏర్పరచుకున్నారు. సాధారణంగా సూర్యుడు ధనుస్సు రాశిలో ఉన్నప్పుడు డిసెంబర్ నెలలో శుద్ధ ఏకాదశి అతి ముఖ్యమైనది కావటం వల్ల శ్రీరంగంలో

దానికి సంబంధించిన ప్రత్యేక పూజలు అతి వైభవంగా నిర్వహించబడతాయి. ఇప్పటికీ భారతదేశంలో దానిని 'వైకుంఠ ఏకాదశి'గా పరిగణిస్తూ హిందువుల దైవమైన నారాయణుని పేరున అతి విశేషంగా పూజలు, ప్రార్థనలు జరుగుతూ ఉంటాయి. ఆ రోజు అతి ముఖ్యమైన రోజు కావటం చేత భారతదేశం నలు మూలల నుండి యాత్రికులు శ్రీరంగం వస్తారు. తన మేనల్లుడైన మైనంపాటి నరసింహం మీద ప్రత్యేకమైన ప్రేమతో శ్రీ ప్రకాశంగారు ఆ రోజుకి భార్యా పిల్లలతో బాటు శ్రీరంగం చేరమని కబురు పంపారు. శ్రీఎమ్.ఎన్.గారి కుటుంబం, ఉత్సవం ముగిసేదాకా తమ ఇంట్లోనే ఉంటూ ఉత్సవాలన్నీ చూడాలనేది శ్రీ ప్రకాశంగారి ఆకాంక్ష. ఈ కబురు అందిన వెంటనే శ్రీ ఎమ్.ఎన్. గారు ఎంతో ఉత్సాహంగా ఒంగోలునుండి కుటుంబముతో సహా బయలుదేరారు. వారు రెండురోజుల ముందుగా మద్రాసు చేరుకుని తన రెండవ మేనమామ అయిన శ్రీ జానకిరామ్ గారి ఇంటికి చేరారు. శ్రీ జానకిరామ్ గారు మద్రాసులో ప్రసిద్ధ హోమియో డాక్టరుగా స్థిరపడి ఉన్నారు. వారు కూడా తమదైన పద్ధతిలో జీవితాన్ని పరిపూర్ణంగా పండించుకున్నారు. వారు కొంతకాలము ఐరోపా ఖండంలో ఆధునిక విద్యలో కూడా ఆరితేరారు. ఆ తరువాత హోమియో వైద్యశాస్త్రమునందు ఆసక్తి కలిగి జర్మనీ కూడా వెళ్ళారు. హోమియో వైద్య సిద్ధాంతాన్ని, శాస్త్రాన్ని జర్మనీలో పరిపూర్ణంగా అధ్యయనం చేశారు. మద్రాసు పట్టణంలో హోమియో వైద్యసేవ చేసి వైద్యుడిగా ఖ్యాతి గడించారు. వారి అన్నగారైన ప్రకాశంగారు అదే మద్రాసు పట్టణములో ప్రముఖ న్యాయవాదిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు.

శ్రీ ఎమ్.ఎన్.గారు రెండురోజులు ముందుగా మద్రాసు పట్టణం చేరుకుని, ఆ పట్టణంలో ఉన్న ముఖ్య ప్రదేశాలు కుటుంబ సభ్యులకు చూపించే ఉద్దేశముతో అక్కడికి వచ్చారు. ఆ రోజులలో భారతదేశపు దక్షిణ ప్రాంతములో మద్రాసు అతి పెద్దది. అతి ముఖ్యమైన పట్టణము కూడా. శ్రీ ఎమ్.ఎన్.గారు మద్రాసులో ఉన్నప్పుడే శ్రీ ప్రకాశంగారి దగ్గర నుండి ఒక ప్రత్యేక టెలిగ్రామ్ (తంతి వార్త) వచ్చింది. ఆ వార్తలో శ్రీరంగపట్టణములో 'మశూచికము' (Smallpox) అనే వ్యాధి ప్రబలంగా వ్యాపించి ఉండడముతోపాటు కుటుంబ సభ్యులలో ఒకరికి ఆ జబ్బు ఉండడంవలన శ్రీరంగం రావద్దని వ్రాసి ఉంది. ఈ వార్త చూసుకున్న శ్రీ ఎమ్.ఎన్.గారు తన చిన్న మేనమామ అయిన జానకిరామ్ గారితో మద్రాసు పట్టణంలో మరికొన్ని రోజులు ఉండడానికి నిశ్చయించుకున్నారు. ఇదే శ్రీ ఎమ్.ఎన్. గారి జీవితంలో అతి ముఖ్యమైన మలుపుగా పరిణమించింది.

డా. జానకిరామ్ గారి జీవన విధానమును శ్రీ ప్రకాశంగారి జీవన విధానముతో పోలిస్తే పూర్తిగా విభిన్నమైనది మరియు విలక్షణమైనది. శ్రీ ప్రకాశంగారు ఎప్పుడూ జనసమ్మర్దంలో ఉండే వ్యక్తి. వారు మద్రాసు పట్టణ హైకోర్టులో అతి ప్రముఖమైన న్యాయవాది. వారు ఆ రోజుల్లోనే బారిస్టర్ అట్ లా పూర్తి చేశారు. వారు ఎప్పుడూ అతి ఉన్నత స్థాయి వ్యక్తులతో తిరిగేవారు. ఆంధ్ర – మద్రాసు రాష్ట్రములు కలిసి ఉన్న రోజుల్లోనే వారు (బారిస్టర్ అట్ లా) అతి స్వతంత్రమైనటువంటి వ్యక్తిత్వం కలిగి మరియు నిజాయితీతో కూడిన జీవితం గడిపేవారు. సంఘంలోని వ్యక్తులు

వారికి ఎంతో గౌరవమర్యాదలు ఇచ్చేవారు. చివరికి ఆయన భారతదేశ స్వాతంత్ర్య సమరయోధులుగా తన జీవితాన్ని అంకితం చేసుకొని దేశానికి రాజకీయ స్వేచ్ఛకోసం మహాత్మాగాంధీ గారితో కలిసి పనిచేశారు. బ్రిటిషు ప్రభుత్వం భారతదేశం విడిచి పోవాలని చెప్పి ప్రత్యేక విన్నపాలు చేస్తుండేవారు. వారి ప్రసంగాలు అనర్గళమైన భాషలో ఆ ప్రాంతములో ఎంతోమందిని ప్రభావితం చేసేవి. ఆ ప్రసంగాల కారణంగా ఆ ప్రాంతపు ప్రజలు ఉత్తేజితం అయ్యారు. వారు ఒక జాతీయ నాయకులుగా గుర్తింపబడ్డారు. బ్రిటిష్ సామ్రాజ్యపు అధికారులను మరియు సైన్యాన్ని నిర్భయంగా ఎదుర్కొనేవారు. బ్రిటిష్ పాలకులు వారిని ఎదుర్కొన్నప్పుడు తనని నిర్భయంగా కాల్చవచ్చునని చెప్పి తాను వేసుకొన్న చొక్కా చించి తన గుండెను చూపించిన ధీరుడు. బ్రిటిష్ సైన్యంవారు తుపాకులు ఎత్తి కాల్చుతామని బెదిరించినప్పుడు వారు సింహంలా గర్జిస్తూ, “మీరు నన్ను కాల్చదలచుకుంటే కాల్చవచ్చు. మీకు నిజంగా ఆ ధైర్యం ఉందా?'' అని ప్రశ్నించారు. ఈ చర్యతో భయభ్రాంతులైన ఆ సైనికులు అనుకున్న విధంగా చేయలేకపోయారు. ఇది ఒక అతిపెద్ద సంఘటనగా భారతదేశంలో ఉన్న అన్ని వార్తాపత్రికలలోను ప్రచురించబడింది. ఆ ఉదంతం అనంతరం శ్రీ ప్రకాశంగారిని “ఆంధ్రకేసరి'' అన్న పేరుతో పిలిచేవారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే వారు ఆంధ్రప్రాంతానికి ప్రప్రథమ ముఖ్యమంత్రిగా కూడా నియమించబడ్డారు.

శ్రీ ప్రకాశంగారి తమ్ముడు డా. జానకిరామ్ తన జీవన విధానాన్ని ఇంకొక విధముగా మలచుకున్నారు. వారు పరిపూర్ణమైన

సేవాభావాన్ని కలిగి తన దగ్గరకు వచ్చిన రోగులకు సేవ చేయటం పరమావధిగా భావించారు. వారు కూడా శ్రీ ప్రకాశంగారివలె జీవనానికి కావలసిన విద్యలన్నిటినీ నేర్చుకున్నప్పటికీ ఒక హోమియో వైద్యునిగా స్థిరపడటానికి నిశ్చయించుకున్నారు. తదనుగుణముగా ఐరోపా దేశంలో విద్యను అభ్యసించారు. జర్మనీ వెళ్ళి హోమియో వైద్య విధానము గూర్చి ప్రత్యేక సాధన, అభ్యాసము చేశారు. ఆ తరువాత మద్రాసు తిరిగి వచ్చి ఒక ఉన్నతమైన జీవన విధానముతో తన దగ్గరకు వచ్చిన రోగులకు ప్రేమభావంతో వైద్యం చేసేవారు. అందువలన వారు కుటుంబ సభ్యుల, బంధువుల మరియు స్నేహితుల ప్రేమాభిమానములను చూరగొన్నారు. డా. జానకిరామ్ గారు ఎంతో ప్రశాంతము మరియు నిశ్శబ్దము అయిన జీవితం గడుపుతుండగా వారి పెద్ద అన్నగారైన శ్రీ ప్రకాశంగారు ప్రజల మధ్యలో అగ్నిహోత్రంలా మెలిగేవారు. డా. జానకిరామ్ గారు సమావేశాలలో గాని, బృందజీవనాలలో కాని ఎంతో నిశ్శబ్దంగా ఉంటూ ఉండగా వారి అన్నగారు శ్రీ ప్రకాశంగారు అనర్గళమైన భాషతో ప్రసంగిస్తూ ప్రజలను ఆకట్టుకునేవారు. శ్రీ జానకిరామ్ గారు అంతర్ముఖత్వానికి ప్రతీకగా కనబడేవారు. శ్రీ ప్రకాశం గారు తద్భిన్నంగా బహిర్ముఖమైన కార్యక్రమాల్లో మునిగి తేలేవారు. అయినప్పటికీ ఆ సోదరులు ఇద్దరి మధ్య సహజమైన మరియు నిజమైన సోదరత్వము ఉండేది. ఒకరికొకరు అరమరికలు లేకుండా అభినందించుకుంటూ జీవించారు.

డా. జానకిరామ్ గారు ఒక క్రమశిక్షణతో కూడిన జీవన విధానములో ఉండేవారు. దినచర్య అంతా ఒక పద్ధతిగా నడిచేది.

వారు ఉదయం, సాయంత్రం సంధ్యా సమయములో ప్రార్థనలు మరియు పూజ చేసుకునేవారు. సూర్యోదయానికి ముందే లేచి సద్గ్రంథ పఠనము చేసుకునేవారు. కుటుంబ బాధ్యతలు చక్కగా నిర్వహించుకునేవారు. వారి వైద్యసేవాభావం వలన వారి చుట్టూ సత్సంకల్పం కలిగిన వ్యక్తులు చేరుతుండేవారు. ప్రకృతి అంటే ఎంతో ఇష్టపడేవారు. ప్రకృతి ధర్మాలను కూడా ఎంతో ప్రేమించి ఆచరించేవారు. వారి జీవితం ఒక యోగపరమైనటువంటి కోణంలో కూడా నడుస్తున్నట్లు చుట్టుపక్కల వారికి అర్థమవుతూ ఉండేది.

శ్రీ ఎమ్.ఎన్.గారు తన చిన్న మేనమామగారైన జానకిరామ్ గారింట్లో ఉండిపోయిన కారణంగా డా. జానకిరామ్ గారిని నిశితంగా పరిశీలించే అవకాశం కలిగింది. దీనికి కారణం వారు శ్రీరంగానికి వెళ్ళలేక పోవటమే. ఆ కారణంగా ఎక్కువకాలం డా. జానకిరామ్ గారితో సమయం గడిపే అవకాశం చిక్కింది. శ్రీ ఎమ్.ఎన్. గారు తన చిన్న మేనమామ డా. జానకిరామ్ గారిలో ఉన్నటువంటి అనుకరణీయమైన గుణాలను గమనించారు. డా. జానకిరామ్ గారి క్రమశిక్షణతో కూడిన జీవనవిధానము మరియు వారి సేవాభావమునకు ఎంతో ఆకర్షితులయ్యారు. తన మేనమామగారి జీవన విధానము శ్రీ ఎమ్.ఎన్.గారి హృదయాన్ని రంజింపచేసింది. తన మేనమామగారి జీవన విధానము ఎంతో సాధారణంగా, సహజంగా, పరమ ప్రశాంతితో ఉన్నటువంటిదని గమనించారు. అదే విధముగా వారు ప్రకృతి ధర్మాలకు అనుగుణంగా తన జీవనవిధానము ఏర్పరచుకున్నట్లుగా కూడా

గమనించారు. శ్రీ ఎమ్.ఎన్.గారు తన మేనమామ అయిన డా. జానకిరామ్ గారిని పరిశీలించిన తరువాత తన అంతరంగములో ఉన్న ప్రశ్నలకు, ఆలోచనలకు, సంశయాలకు సరియైన సమాధానములు పొందటానికి, చర్చించడానికి ఇతనే సరియైన వ్యక్తి అని అనిపించింది.

అదే విధముగా తనకు కావలసిన మార్గదర్శనము, తాను ప్రశాంత జీవనము గడపడానికి వలసిన పద్ధతిని తెలుసుకోవడానికి డా. జానకిరామ్ గారితో మనసులో ఉన్న భావాలు, ఆలోచనలు పంచుకోవాలని, తద్వారా పరిష్కారము దొరుకుతుందనే భావము స్థిరపడింది. నెమ్మదిగా తన మేనమామగారితో తన మనసులో జరుగుతున్న అంతర్మథనం మరియు దానివల్ల కలుగుతున్న అశాంతి, దుఃఖము, మృత్యువు యొక్క రహస్యము, జీవన సమస్యలను మరియు అమరత్వము గూర్చి ఉన్న కోరిక గూర్చి వివరంగా చర్చించారు. తన తల్లిదండ్రులు దేహత్యాగము చేసిన తీరు, స్వల్పవ్యవధిలోనే తన అత్తగారు, మామగారు, వారికి తోడుగా తనకు అత్యంత ప్రియతముడైన పది సంవత్సరముల చిన్న తమ్ముడు కూడా చనిపోవటం, అందు కారణముగా తన జీవితంలో తనకు కలిగిన బాధను డా. జానకిరామ్ గారితో పంచుకున్నారు. అంతేకాక జీవితసత్యం తెలుసుకొనే ప్రయత్నంలో భాగంగా ఇంతవరకు తాను చేసిన ప్రయత్నములను కూడా ఆయనకు వివరించారు. తన మేనమామలో ఒక మంచి స్నేహితుణ్ణి, మార్గదర్శిని, తత్త్వవేత్తను దర్శించి తన పరిస్థితినంతా కూలంకషంగా ఏమీ దాచకుండా వివరించారు.

డా. జానకిరామ్ గారు చిరునవ్వు నవ్వారు. వారి చిరునవ్వు ఒక చల్లని చంద్రకిరణంవలె తృష్ణతో ఉన్న ఆత్మను తాకి ప్రశాంత పరచింది. శ్రీ ఎమ్.ఎన్.గారి మనసుకి ఎప్పుడూ లేనంత శాంతి కలిగింది. డా. జానకిరామ్ గారు శ్రీ ఎమ్.ఎన్.గారితో ‘‘నీవు కుంభకోణం వెళ్ళగలిగితే నీలో ఉన్న అన్ని ప్రశ్నలకు సమాధానం దొరుకుతుంది. అక్కడ ఒక పరమగురువు (యోగమునకు సంబంధించిన) నీకు అమరత్వము, అమృతత్త్వము గూర్చి, మరణ రహస్యము గూర్చి తెలియచేయగలరు. మానవజాతి మరణాన్ని దాటి శాశ్వతముగా ఉండుటకు కావలసిన యోగమార్గములో నడిపించడానికి ఆయన అవతరించారు’’ అని చెప్పారు. అదే వారి అవతార ప్రయోజనము. శ్రీ ఎమ్.ఎన్.గారికి ఈ వాక్యములను వినగానే తాను తీవ్రంగా ప్రయత్నిస్తున్న మార్గము తప్పకుండా అక్కడ లభిస్తుందనే భావన కలిగింది. ఇది తనను ఎంతోకాలంగా మానసికంగా వేధిస్తున్న ప్రశ్న. తానున్న కాలంలోనే అటువంటి పరమగురువు అందుబాటులో ఉన్నారన్న సత్యాన్ని నమ్మలేకపోయారు. అటువంటి వ్యక్తి కోసమే తాను అన్వేషిస్తున్నట్లు (మరణ రహస్యాన్ని తెలుసుకోవటం) భావించారు. తదుపరి సంభాషణలో శ్రీ జానకిరామ్ గారు కూడా అదే పనిలో ఉన్నట్లు, తాను కూడా కుంభకోణంలో గల మాస్టరుగారిని కలిసినట్లు తెలియచేశారు. వారి ద్వారా తాను1918 కంటే మునుపే మార్గోపదేశాన్ని పొందినట్లు, అట్లా పొందిన వారిలో తాను 614 వ మీడియంగా మరియు శ్రీ గురువుగారి చేత స్వయముగా ఉపదేశింపబడినవానిగా చెప్పారు. డా. జానకిరామ్ గారు తన మేనల్లుడైన శ్రీ ఎమ్.ఎన్. గారికి ఆ పరమగురువు పేరు

''సి.వి.వి.'' అని, వారు ఏర్పరచిన మార్గమునకు 'భృక్తరహిత తారక రాజయోగము' అను పేరు పెట్టారని తెలియచేశారు. దానిని రకరకములుగా సత్యయోగమని, కుండలినీ యోగమని, మాస్టర్ సి.వి.వి. యోగమని ఆ చుట్టుపక్కల ప్రాంతాలవారు పిలుస్తారని తెలియజేశారు. అదే విధముగా శ్రీ మాస్టర్ సి.వి.వి.గారిని 'కామెట్ మాస్టరుగారు', 'మిస్టిక్ మాస్టర్', 'మాస్టర్ జూపిటర్', 'కుంభకోణం మాస్టర్', 'కుంభయుగపు చైతన్య ప్రజ్ఞ' అని తెలియచేశారు. ఈ వివరాలు విన్న శ్రీ ఎమ్.ఎన్. గారికి ఎంతో ఉత్సాహం కలిగింది. ఒక అమృతధార పొందినటువంటి అనుభూతి కలుగగా శ్రీ మాస్టర్ సి.వి.వి. గారి జీవితాన్ని గూర్చి మరియు వారి అవతార ప్రయోజనాన్ని గురించి మరింత తెలియచేయమని కోరారు.

తన మేనల్లునిలో కలిగిన ఉత్సాహానికి సమాధానంగా డా. జానకిరామ్ గారు మాస్టర్ సి.వి.వి.గారి గురించి ఇలా వివరించారు. ''మాస్టర్ సి.వి.వి.గారు 1868 సంవత్సరం, ఆగష్టు 4 వ తేదీన జన్మించారు. వారిని గూర్చి భృగునాడిలో ముందే చెప్పబడి ఉంది. ఆ నాడిలో వారు సాక్షాత్తు పరబ్రహ్మమని, మానవజాతి పరబ్రహ్మమును చేరుటకు కావలసిన మార్గాన్ని ఏర్పరచి సహాయ సహకారములను అందించటానికి అవతరించారని వ్రాశారు. (ప్రతి జీవి పరబ్రహ్మ స్వరూపము అని తెలుసుకోవటం ఏ యోగ మార్గమునకైనా పరమావధి మరియు చివరిమెట్టు.) శ్రీ మాస్టరుగారు ఇచ్చిన యోగమార్గము మానవునికి ఏర్పడవలసినవి, సూక్ష్మ (golden) శరీరం త్వరితగతిని ఏర్పడేటట్లు, అలాంటి శరీరం ఏర్పడటానికి ఉపాధిగా

ఈ భౌతిక మానవ శరీరము ఏర్పడిందని వారు వివరించేవారని చెబుతారు. ఇట్టి సూక్ష్మశరీరం ఏర్పడిన వారికి భౌతిక శరీరంలో ఉన్నప్పటికీ వారు స్వేచ్ఛగా తిరుగ గలుగుతారు. ఇలాంటి సూక్ష్మ శరీరం ఏర్పడటం వలన రక్త మాంసాదులతో కూడిన ఈ భౌతిక శరీరం వారిని బంధించదు. మృత్యువంటే భయం ఏర్పడదు. ఈ యోగాన్ని మరింత పరిశీలనగా అభ్యసించేవారికి వజ్రశరీరము (డైమండ్ బాడీ) కూడా ఏర్పడుతుంది. దీనినే యోగశాస్త్ర పరిభాషలో కారణశరీరము లేక లింగశరీరము అని అంటారు. ఇట్టి శరీరాన్ని పొందిన సాధకుడు శాశ్వతంగా ఉండిపోతాడు. ఈ యోగము యొక్క పరమావధి జీవునికి, తనకి, బ్రహ్మనికి తెలియచేయబడి అనుభవ మవుతుంది. ఇట్టి పరిస్థితి ఏర్పడటానికి కేవల కారణం మాస్టరుగారు యోగ సాధకుని శరీరంలో తన ప్రజ్ఞా ప్రభావంతో ప్రవేశపెట్టే క్రియ. దీనినే మాస్టర్ సి.వి.వి.గారు ముఖ్యప్రాణము, అనంత ప్రాణమని పిలిచేవారు. మాస్టర్ సి.వి.వి.గారు అగస్త్యాశ్రమము నుండి వచ్చిన ముఖ్యమైన మరియు ప్రత్యేక ప్రతినిధి కావటంవలన సృష్టిలో ప్రాణం యొక్క మూలం, దాని స్వభావం తెలిసికొనగలిగారు. వారికున్న శక్తి సామర్థ్యాల ఆధారంగా వారికి తోడు మరియొక ఉన్నత వ్యక్తి (చాలామంది ఈమె మేడమ్ బ్లావెట్స్కీ అని నమ్ముతారు) సహాయ సహకారాలతో సృష్టిలో ఉన్న ప్రాణ సిద్ధాంతమును సూర్యలోకము నుండి గ్రహలోకమునకు, తదనంతరం మన భూగ్రహం మీదకు కూడ దింపగలిగారు. తత్కారణంగా ఆయన రెండు ముఖ్య ఉద్దేశాలను పరిపూర్ణం చేయగలిగారు. అందులో మొదటిది

భూమిజీవుల పరిణామ దశను త్వరితగతిని కలిగేటట్టు చూడటం– తద్వారా సాధకుడు, వ్యాధి, క్షీణించుట మరియు మృత్యువును దాటి అమృతత్త్వాన్ని సంపాదిస్తారు. తదనంతరం పూర్ణజ్ఞానాన్ని పొంది సృష్టిలో తాను ఉన్న కారణం తెలుసుకొని తురీయ ఆనందస్థితిలో ఉండిపోతాడు. అట్టి జీవుడు (ఈ పరిణామాన్ని పొందిన కారణంగా) దివ్యప్రణాళికలో ఒక భాగంగా తన వంతు కర్తవ్యమును నిర్వర్తిస్తాడు.''

డా. జానకిరామ్ గారు వివరణలో ఇలా పలికారు. ''మాస్టర్ సి.వి.వి.గారి జీవితం ఎంతో వైభవోపేతమైన జీవితం. వారు పుట్టడమే సంపన్న కుటుంబంలో పుట్టడం వల్ల సంపద సమృద్ధిగా ఉండేది. వారు ఉన్న ప్రతి చోటా వైభవమే. ప్రేమ, దయ, దాక్షిణ్యం వారి సహజ గుణాలు. బయటికి అధునాతనమైన వ్యక్తిగా కనబడుతున్నప్పటికీ లోపలి వ్యక్తి సనాతనుడు. సంస్కృతం, ఇంగ్లీషు, తెలుగు, తమిళ భాషలలో అనర్గళంగా మాట్లాడేవారు. సాంఘికంగా కూడా వారు ఉన్నతమైన వ్యక్తి , 'టెంపుల్ టౌన్' అని పిలువబడే కుంభకోణం నగరసభకు మేయరుగా కూడా కొంతకాలం గడిపారు. ఊళ్ళో ఉన్న పెద్ద పెద్ద జమీందారులు, ఆ ప్రాంతపు సామంతరాజులు, మేధావులు, సంగీతంలో సుసంపన్నులైన వ్యక్తులవంటి వారితో వారికి పరిచయాలుండేవి. వారు హిమాలయాల్లోను, నీలగిరులలోను, వీటికి మించిన గ్రహలోకవాసులతోను ఆధ్యాత్మిక సంబంధములను కలిగి ఉండేవారు. బాహ్యలోకానికి ఎంతో సాధారణ వ్యక్తిగా కనిపించినప్పటికీ ఒక్కొక్కసారి వారి చేతల వలన అసాధారణ

ప్రజ్ఞావంతులేమో అని చుట్టుపక్కల ఉన్నవారికి అనిపించేది. వారు చనిపోయిన వారికి ప్రాణదానం చేసి బ్రతికించిన సందర్భాలు ఉన్నాయి. వారి చూపుతో ఎదుటి వ్యక్తియొక్క పూర్వజన్మ రహస్యాలు, వారు చేసుకున్న కర్మ పరిస్థితి, దాని వలన ప్రస్తుతం వారు అనుభవిస్తున్న అనారోగ్యాది కారణాలు గ్రహించి దానికి తగిన ప్రతిచర్య వారికి తెలియకుండా చేసి అట్టి జీవులకు పరిణామదశ త్వరితగతిలో సాగునట్టు చేసేవారు. వారు మంచి గాయకులు మరియు తత్వజ్ఞాని. వారు మంచి భోజనం వండించి పదిమందికి సమృద్ధిగా (రుచి శుచిలతో కూడినది) పెట్టేవారు. మీవలె వారు గృహస్థాశ్రమాన్ని అవలంబిస్తూ సంతానంతో ఉండేవారు. రెండుసార్లు వివాహం కూడా చేసుకొన్నారు. వివాహ వ్యవస్థలో విశ్వాసం ఉండేది. ఎటువంటి సంఘమునకైనా వివాహ వ్యవస్థలో గృహస్థాశ్రమం వెన్నెముక లాంటిదని నొక్కి చెప్పేవారు. తన అనుయాయులు ఎవ్వరూ వివాహం చేసుకోకుండా ఉండరాదని నియమం చేశారు. ఆర్థికపరంగా ఇంకొకరి మీద ఆధారపడి జీవించేవారు ఈ యోగమునకు పనికిరారని చెప్పేవారు. అట్టివారికి యోగప్రవేశం ఇచ్చేవారు కాదు. ఈ క్రింది నియమాలకు కట్టుబడి ఉండేవారికే ఉపదేశము చేసేవారు.

1. *ఉపదేశం తీసుకునే వ్యక్తికి 18 సంవత్సరాలు నిండి ఉండాలి.*

2. *ఆర్థికముగా ఎవరి మీదా ఆధారపడకుండా స్వతంత్రుడై ఉండవలెను.*

3. *వివాహ వ్యవస్థను నిరాకరించరాదు.*

4. *సంఘములో ఒక గృహస్థుగా తన ధర్మము తాను పాటిస్తూ, ఇతరులకు సహాయ సహకారములను అందించే స్వభావమును అలవరచుకొనవలెను.*

ఆయన తన అనుయాయులను సంఘపరమైనటువంటి ఎటువంటి కార్యకలాపముల నుంచి వైదొలగ వద్దని చెప్పేవారు. తన యోగమును అభ్యసించువారు సామాన్య జీవితము నుండి వేరుగా ఉండరాదని చెప్పేవారు. ఆయన ఐహిక జీవితమును కాదనుకొనుట మరియు సన్యాస ఆశ్రమమును కోరుకొనుటను ఎన్నడూ ప్రోత్సహించలేదు. వైరాగ్యమనగా మనస్సులో ఏర్పడవలసిన భావమే కాని భౌతికముగా అన్నిటికీ మరియు అందరికీ, సంఘమునకూ దూరముగా ఉండుట కాదని నొక్కి చెప్పేవారు.''

ఈ విధంగా డా. జానకిరామ్ గారు మాస్టర్ సి.వి.వి. గారి గురించి వివరించుచుండగా, ఎమ్.ఎన్.గారు మాస్టర్ సి.వి.వి. గారి సాన్నిధ్యంలోకి మానసికంగా ఆకర్షింపబడి ఇక ఎట్టి ఆలస్యము చేయకూడదని మనసులో భావించారు. తాను వెంటనే కుంభకోణం వెళ్ళి మాస్టర్ సి.వి.వి. గారిని దర్శించి వారికి శరణాగతుడై వారి అనుమతితో యోగములోనికి ప్రవేశించడానికి నిశ్చయించుకున్నారు. తన మేనమామ అయిన జానకిరామ్ గారికి తన కోరికను వెల్లడించారు. డా. జానకిరామ్ గారు నవ్వుతూ ఈ విధంగా సమాధానమిచ్చారు. ''ప్రస్తుతము ఈ వారములో

(అనగా డిసెంబర్ నెల చివరి రోజులలో) కుంభకోణములో యోగ సమావేశము జరుగుతుంది. దీనిని మాస్టరుగారు *'డిసెంబర్ కాల్'* అని వ్యవహరిస్తారు. మనము తప్పక వెళ్ళి వారిని దర్శించుకుందాము, ఆ సమయంలో నీవు ఉపదేశము పొందవచ్చును. మాస్టరుగారు సంవత్సరమునకు రెండుసార్లు యోగ సమావేశమును నిర్వర్తిస్తారు. అందులో ఒకటి మే నెలలో 29 వ తారీఖునాడు. ఈ యోగ సమావేశములు 29వ తారీఖు ఆధారంగా రెండు రోజులు ముందు ఆరంభమవుతాయి. మే నెలలో నిర్వహించు సమావేశాన్ని *'మే కాల్'* అని, డిసెంబర్ లో నిర్వహించే సమావేశాన్ని *'డిసెంబర్ కాల్'* అని వ్యవహరిస్తారు. ఇది కాక మరొక నాలుగు సమావేశములు విషువత్ దినములు, సంక్రమణములు (మార్చి 21, జూన్ 21, సెప్టెంబర్ 21, డిసెంబర్ 21) కూడా నిర్వహిస్తారు. అన్నీ కలిపి ఒక సంవత్సర కాలంలో 6 సమావేశములను మాస్టరుగారు నిర్వహిస్తారు.

నీవు శ్రీరంగమునకు వెళ్ళవలెననే ఉద్దేశముతో నా ఇంటికి వచ్చావు. శ్రీరంగములో నారాయణ దర్శనంకోసం వచ్చిన నీకు దైవసంకల్పము మరొక కారణం చేత మాస్టరుగారి దగ్గరకు నీదారి మళ్ళించినట్లుగా నాకు తోచుచున్నది. వారి ద్వారా నీవు చేరవలసిన గమ్యం ఆధ్యాత్మికపరంగా, నీవు నిజముగా చేరవలసిన గమ్యస్థానమునకు చేరుతావేమో! భవిష్యత్తులో నీకు ఏమి రాసి పెట్టి ఉన్నదో ఎవరికి తెలుసు? చిన్నప్పటి నుండి నీవు ఎంతో ప్రజ్ఞావంతుడిగా పెరిగావు. ఇంతవరకు అప్పచెప్పబడిన ప్రతిపనిని బాధ్యతాయుతంగా నిర్వహించావు. నీ జీవితంలో నీ దాకా వచ్చిన

ప్రతి కర్తవ్యమును పరిపూర్ణముగా నిర్వహించావు. నీవు ఒక పరిపూర్ణయోగిగా తయారు కావాలని రాసిపెట్టి ఉందేమో! నీకు శుభమగుగాక! నీకు తగిన ఆశీర్వచనం లభించుగాక! మనిద్దరం వెంటనే బయలుదేరి కుంభకోణము వెళ్దాం'' అని డా. జానకిరామ్ గారు తన సంభాషణను ముగించారు.

శ్రీ ఎమ్.ఎన్.గారు తనలో ఉబికిన ఉత్సాహం కారణంగా కుంభకోణం చేరేవరకూ తన మేనమామ అయిన జానకిరామ్ గారితో ప్రార్థనలో పాల్గొన్నారు. మాస్టర్ సి.వి.వి. గారిని కలవడానికి ఉత్సాహం ఆయనలో పెల్లుబికింది. ఒక ప్రేయసి తాను ప్రేమించిన ప్రియుని కలవడానికి ఎంత ఉత్సాహం చూపిస్తుందో మాస్టర్ సి.వి.వి.గారిని కలవగలనని అనుకున్నప్పుడు, మాస్టర్ ఎమ్.ఎన్. గారికి అంత ఉత్సాహం కలిగింది. మాస్టర్ ఎమ్.ఎన్.గారి మాటల్లో చెప్పాలంటే వారు చేసిన ఆ ప్రయాణం తన జీవితకాలంలో అన్ని ప్రయాణాల కన్నా ముఖ్యమైనది. పరిపూర్ణ ఆనందాన్ని యిచ్చినది. వారు (ఎమ్.ఎన్.గారు) ఈ ఘట్టాన్ని గురించి ఎప్పుడన్నా సింహావలోకనం చేసుకున్నప్పుడు (యోగసాధకులలో తనను ఎవరైనా అడిగినప్పుడు) వారి కన్నులలో ఆనందబాష్పాలు కనిపించేవి. ఆ ఘట్టాన్ని వివరించేటప్పుడు ఆయన గొంతు గద్గదమై మాట పరిపూర్ణముగా వచ్చేది కాదు. సింహరాశిలో పుట్టిన శ్రీ ఎమ్.ఎన్. గారిలోని సింహతత్త్వము, మాస్టర్ సి.వి.వి. గారిని కలవబోయే సమయానికి ఎంతో వినయంగాను, మృదువుగాను, భక్తితోను నిండి ఒక సాధుగోవు తత్త్వములోకి మారిపోయింది.

# 5

# దీక్ష


డా. జానకిరామ్ గారు మరియు శ్రీ ఎమ్.ఎన్. గారు కుంభకోణం చేరుకున్నారు. వారు మాస్టర్ సి.వి.వి. యోగాస్కూల్ చేరుకున్నప్పుడు, మాస్టరుగారు ఎవరి కోసమో ఎదురుచూస్తున్నట్లుగా యోగా స్కూల్ ఫ్రెండ్స్ సొసైటీలోని ప్రవేశద్వారము దగ్గరగా ఉన్నారు. పూర్వ పరిచయము ఉన్న డా. జానకిరామ్ గారిని చూడగానే చిరునవ్వు నవ్వారు. తరువాత ఆయన శ్రీ ఎమ్.ఎన్. గారి వైపు చూస్తూ చిరునవ్వుతో 'నీవు ఏమి కోరి వచ్చావు?' అని అడిగారు.

శ్రీ ఎమ్.ఎన్. గారు తక్షణమే 'నాకు శాంతి కావాలి' అని జవాబు ఇచ్చారు. మాస్టరుగారు నవ్వుతూ 'ఇవ్వబడింది! (Granted), లోపలికి రా!' అన్నారు. మాస్టరుగారు లోపలికి వెళ్ళి మాయమయ్యారు. అది చూసి శ్రీ ఎమ్.ఎన్.గారు ఆశ్చర్యచకితులయ్యారు. మాస్టరుగారిని విచారించగా ఆయన నుండి వచ్చిన జవాబు ప్రయత్న పూర్వకంగా వచ్చినది కాదని, ఆ జవాబు తనంతట తానే, తనకు తెలియకుండా ప్రజ్ఞాపూర్వకంగా కాక, అసంకల్పితంగా వచ్చింది. మాస్టరుగారి అంతరాళంలో

నుండి వెలువడిన మాట ఆయనకు శాంతిని ఖాయం చేశారు. మాస్టరుగారి వాణి శ్రీ ఎమ్.ఎన్. గారిలో మాటలకందని ఆనందాన్ని (కలరవాన్ని) ప్రవేశపెట్టింది. మాస్టరుగారి కృపాదృష్టి శ్రీ ఎమ్.ఎన్.గారిని ప్రభావితం చేసింది. మాస్టర్ సి.వి.వి.గారి చూపులు శ్రీ ఎమ్.ఎన్. గారిలోకి చొచ్చుకుపోయి, ఆయన అంతరాంతరాళాలలో ఉన్న భావనను పురిగొల్పి, ఆ మాస్టరుగారి యొక్క దృష్టి మరియు శక్తిని పొందాలనే కోరికను బలపరిచింది. మాస్టర్ సి.వి.వి. గారి మొట్ట మొదటి చూపులు శ్రీ ఎమ్.ఎన్.గారి ఊహలను కట్టివేశాయి. శ్రీ ఎమ్.ఎన్. గారికి అదొక దివ్యానుభూతి. ఇలాంటి ఆకస్మిక ఘటన ఆయనకు ఎప్పుడూ తారసపడలేదు. మాస్టర్ సి.వి.వి.గారి నిగూఢ తత్వము మరియు ఆయన స్పర్శ మాటలకు అందని అనుభూతి. ఆయనకు ఆ అనుభూతి తన జీవితములో చాలా ఆత్మీయంగా మిగిలింది. శ్రీ ఎమ్.ఎన్.గారి జీవితంలో ఏ వస్తువులోగాని, ఏ ప్రదేశములోగాని, ఏ వ్యక్తిలోగాని తనది అనే అనుభూతి ఎప్పుడూ పొందలేదు. ఆయనలో మాస్టర్ సి.వి.వి.గారి ఆలోచన తప్ప ఇతరములు ఏవీ లేనట్టుగా అయ్యారు. శ్రీ ఎమ్.ఎన్.గారి మనోఫలకం పైన మాస్టర్ సి.వి.వి.గారికే అగ్రస్థానం. అది అలాగే శాశ్వతంగా నిలిచింది.


ఆ సంఘటన 1919 డిసెంబర్ 29వ తేదీనాడు సాయంకాలం 4 గంటలకు జరిగింది. ఆ సంఘటన ఆయన జీవనమార్గములో మలుపు తిప్పి సాధారణ శ్రీ ఎమ్.ఎన్. గారిని 'మాస్టర్ ఎమ్.ఎన్.'గా మార్చింది.

దీక్షాదినము నాటి చక్రము – Initiation Day Chart



ఆ 'క్షణం' 'మాస్టర్' జన్మించే ప్రక్రియ ప్రారంభమై, ఆయన ద్వారా 1000 మంది మానవులు పరిణామము చెంది ఉన్నత మానవులుగా మారే సమయమైనది. ఆ క్షణాన్ని జ్యోతిష పట్టికలాగ ఇస్తున్నాను. ఆసక్తిగల పాఠకులు మహత్తరమైన ఆ క్షణాన్ని పరిశీలించగలరు.

దీక్షాదినపు ప్రగతి చక్రము – Initiation Day Progress Chart




శ్రీ ఎమ్.ఎన్ గారు దీక్ష తీసుకోవడానికి 29 డిసెంబర్ సాయంకాలం సిద్ధంగా ఉన్నారు. అంతకు ముందే దీక్ష తీసుకున్న 26 మరియు 176 నెంబర్లు గల సీనియర్ సాధకులిద్దరు శ్రీ ఎమ్.ఎన్.గారి పూర్వాపరాలు తెలుసుకోవడానికి 'టెస్ట్' (Test) నిర్వహించి నివేదికను తయారుచేశారు. 'టెస్ట్' అనే విశిష్ట పద్ధతిని మాస్టర్ సి.వి.వి. గారు ప్రవేశపెట్టి, దీక్షా సమయంలో ఉపయోగించేవారు. ఆయన తరువాత 'టెస్ట్' (Test) చేసే

ప్రక్రియను ఎవ్వరూ ఉపయోగించ లేదు. దీక్ష ఇవ్వడానికి ముందు, వారి ఇద్దరు అనుయాయులు, మాస్టర్ సి.వి.వి. గారి సహాయంతో, దీక్షను పొందగోరు వ్యక్తి ఆత్మయొక్క పూర్వజన్మల గురించి తెలుసుకోవడానికి జరిపే ఒక గుర్తింపు పరీక్ష. దీనికోసం మాస్టర్ సి.వి.వి.గారు ఆ శిష్యులకు దానికి సంబంధించిన దృష్టిని అనుగ్రహించారు. వారు తమ నివేదికను మాస్టర్ సి.వి.వి.గారి ముందు ఉంచారు. మాస్టర్ సి.వి.వి.గారు కూడ దానిని కూలంకషంగా పరిశీలించి సంతృప్తి చెంది, అనుగ్రహించి, దీక్షను యిచ్చి **666** అన్న సంఖ్యను కూడా కేటాయించారు. **ఆ దీక్ష 1919 వ సంవత్సరానికి చివరి దీక్ష. మాస్టర్ ఎమ్.ఎన్.గారు దీక్ష పుచ్చుకున్నప్పుడు ఆయన వయస్సు దాదాపు 36 ఏళ్ళు.**

దీక్ష తీసుకున్న తరువాత ఆయన వెన్నెముకలో తేలికపాటి విద్యుత్తు ప్రసరించినట్లు అనిపించింది. దానితో ఆయన వెన్నెముక నిటారుగా నిలబడి, అందులోని నాడీమండలము (Cerebro–spinal system)లో అంతయూ శక్తి ప్రసారము అయినట్లు అనిపించింది. కళ్ళు మూతలు పడ్డాయి. శరీరము, మనసు నిశ్చలమైనవి. అష్టాంగయోగములో మూడవమెట్టు అయిన 'ఆసనసిద్ధి' లభించింది. ఇంతకు మునుపు జరుగుతున్న తేలికపాటి విద్యుత్ ప్రసారము ఎక్కువవుతూ అది ఒక ప్రతిధ్వనిలా వెన్నెముకలోని నాడిమండల మంతయూ ప్రసారమైనది. శరీరమంతటా ఏదో తెలియని సుఖము, సౌలభ్యము అనిపించింది. మాస్టర్ ఎమ్.ఎన్. గారు అసహాయంగా తనలో జరుగుతున్న వాటిని సాక్షీభూతంగా గమనిస్తున్నారు. జరగవలసిన మార్పులు

తమంతట తామే జరుగుతున్నాయి. మాస్టర్ ఎమ్.ఎన్. గారు సాక్షిగా ఉన్నారు. ఆయన అందులో జోక్యం చేసుకోలేదు. తనలో దిద్దుబాటు జరుగుతున్నంతసేపు జోక్యం కల్పించుకోవాలని అనిపించలేదు, ఎందుకంటే ఆ సర్దుబాట్లు ఆయనకు ఆనందంగా, సౌకర్యంగా ఉన్నాయి. శరీరము క్రమంగా వేడి ఎక్కువ కావడము, తేలికగా అనిపించడాన్ని కూడా ఆయన అనుభూతి చెంది ఆశ్చర్యపడ్డారు. అలాంటి అనుభూతి ఇంతకు ముందు ఎప్పుడూ కలుగలేదు. అది ఎంతో హాయిగా అనిపించింది. మనసు స్థిమితంగా ఉంది. శాంతి అన్న పదానికి అర్థం కూడా అనుభూతిపరంగా తెలుసుకున్నారు. మాస్టర్ సి.వి.వి.గారు కృపాదృష్టితో చెప్పిన 'గ్రాంటెడ్' అన్న పదం పదే పదే గుర్తుకు వస్తున్నది. మాస్టర్ సి.వి.వి.గారు చూసిన విద్యుదయస్కాంతంలాంటి చూపులు గుర్తుకు వస్తున్నాయి. మాస్టరుగారి చూపులు ఆయన ప్రజ్ఞను అంతరాంతరాళాలలోకి తీసుకువెళ్ళాయి. అలా చూడటం అది మూడవసారి. మొదటిసారిగా ఇంటి తలవాకిలి దగ్గర, రెండవసారి దీక్షను ఇచ్చేటప్పుడు. ఆ చూపులను ఆయన తన కళ్ళతోనే చూడగలిగారు. కాని మూడవసారి చూసిన చూపులు విభిన్నంగా ఉన్నాయి. ఆ అనుభూతి భౌతికమైనది కాదు. శారీరకమైనదైతే ఖచ్చితంగా కాదు. మాస్టర్ ఎమ్.ఎన్.గారు కళ్ళు మూసుకొని తనలోపల మాస్టరుగారి పరిస్ఫుటమైన, ఉజ్వలమైన చూపులను చూశారు. అది చాలా ఆకర్షణీయంగా ఉంది. అది విద్యుత్తులా వుంది కాని, చాలా ఆత్మానందంగా, సుఖదాయకంగా ఉంది. మాస్టర్ ఎమ్.ఎన్.గారు తనలోపల తాను చాలా లోతులలో ఉన్నట్లుగా గమనించారు. అలా లోతుల్లోకి వెళ్ళేకొద్దీ తనను చైతన్యముతో

కూడిన వెలుగు ఆవరించినట్లుగా అనుభూతి చెందారు. తన చుట్టూ వెలుగు క్రమ్ముకుంది కాని ఏ ఆకారము కనబడలేదు, ఎలాంటి శబ్దము వినబడలేదు. కాని సూక్ష్మంగా విద్యుత్ తరంగముల ఝుంకారధ్వని నిరంతరంగా వినిపించేది. అంత లోతులలో కూడా ఆయన సాక్షీభూతంగానే ఉన్నారు. అకస్మాత్తుగా ఆయనకు "వీటన్నిటి నుండి ఎలా బయటికి రాగలను?'' అన్న ఆలోచన వచ్చింది. ఆయన అగాధములో ఉన్నట్లుగా, చుట్టూ వెలుగు ఆవరించినట్లుగా, ఆ వెలుగు సుఖంగా ఉన్నప్పటికీ ఆ వెలుగునుండి ఎలా బయటికి రావాలి? అన్నదే ఆలోచన. ఆ భయం మనసులోకి రావడంతో తనలో మంద్రస్థాయిలో ఉన్న విద్యుత్ ప్రకంపనాలు ఆగిపోయినట్లుగా గ్రహించారు. ఆయన మళ్ళీ తన మనోలోకానికి తిరిగి వచ్చారు. తన స్వరూపం మళ్ళీ తన అంతరంగంలోకి వచ్చింది. శరీరం మళ్ళీ తేలికగా అనిపించింది. నెమ్మదిగా కళ్ళు తెరచుకున్నాయి. గాఢనిద్ర నుండి బయటికి వచ్చినట్లుగా కళ్ళు భారంగా అనిపించాయి. తన శరీరం మునుపటికన్నా కొంచెం వేడిగా అనిపించి, కొద్దిగా ఆకలి, దాహము అనిపించింది. కొద్దిసేపట్లోనే ఆయన మామూలు స్థితికి వచ్చారు, కాని మనసు మాత్రం ఆ అలౌకికమైన, సరిక్రొత్త అనుభూతి గురించే ఆలోచిస్తూ ఉంది. మనసు మాటి మాటికీ దాని గురించే ఆలోచిస్తోంది. మాటి మాటికీ అలాంటి అనుభూతిని కావాలని మనసు కోరుతున్నది. మాస్టరుగారి ప్రార్థనలపట్ల ప్రేమ, ఆసక్తి పెరిగింది. ఈ ప్రేమ ఒక పవిత్రమైన, శాశ్వతమైన బంధమై శ్రీ ఎమ్.ఎన్. గారిని శక్తిపరంగా మాస్టరుగారితో మమేకం చేసింది. అది ఇద్దరూ ఒకటయ్యే క్షణంలో జరిగిన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అదే యోగ సాధన.

ఆ రాత్రి మాస్టర్ ఎమ్.ఎన్. గారు మౌనంగా తనలో జరిగిన సంఘటనను పునరావర్తనం చేసుకుంటున్నారు. ఆ జరిగిన సంఘటనకు ఆయన చైతన్యాత్మకమైన సాక్షి. అది ఆయనలో జరిగినా దానికి ఆయనే సాక్షిగా ఉన్నారు. ఆ విధంగా సాక్షిగా ఉంటూ గమనించే ప్రక్రియ ఆనందం కలిగించింది, ఎందుకంటే అందులో తాను తన ఉనికి కోల్పోలేదు. ఆ సాక్ష్యం అలాగే నిలిచింది. ఆయన జ్ఞాపకాలలో ఆ అనుభూతి నిలిచిపోయింది. ఆ అనుభూతి ఎంత మధురంగా ఉందో, ఆ అనుభూతికి సంబంధించిన జ్ఞాపకాలు కూడా అంతే మధురంగా ఉన్నాయి.

మద్రాసుకు తిరుగు ప్రయాణం మౌనంగానే జరిగింది. మాస్టర్ ఎమ్.ఎన్.గారు మాస్టరుగారిని కలిసినప్పటి నుండి, దీక్ష తీసుకున్నప్పటి నుండి ఆయనపై కలిగిన మాస్టరుగారి ప్రభావము, ఆయనలో కలిగిన ప్రత్యేకమైన మార్పును గమనించారు డా. జానకిరామ్ గారు. మాస్టర్ ఎమ్.ఎన్.గారు తనతోబాటు మాస్టరుగారి సాన్నిధ్యాన్ని కూడా తెచ్చుకున్నారని డా. జానకిరామ్ గారు గమనించారు. ఆయన తన మేనల్లుడు యోగమార్గములో లభించే శక్తిని సమన్వయం చేసుకోవటానికి, మరియు ప్రగతి సాధించు విషయములో జోక్యం కలిగించుకోలేదు. మాస్టర్ ఎమ్.ఎన్. గారు తన కుటుంబముతో బాటు నూతన సంవత్సర పండుగను మద్రాసులోనే చేసుకుని ఒంగోలులో తన ఇంటికి మౌనంగా తిరిగి వచ్చారు. ఒంగోలు నుండి మద్రాసు వెళ్ళిన మాస్టర్ ఎమ్.ఎన్. గారు విభిన్నముగా తిరిగి వచ్చారు. శ్రీరంగమునకు జరిగిన ప్రయాణము అంతరంగంలోని శ్రీరంగ ప్రయాణముగా

మారిపోయింది. శ్రీరంగం అంటే భగవంతుడు ఆడుకునే మైదానము. భగవంతుని యొక్క ఆ ఆటల మైదానము మాస్టర్ ఎమ్.ఎన్. గారిలోని అంతరంగంలో మాస్టరుగారి సాన్నిధ్యంతో తయారవుచున్నది.

ఆత్మ పరిపక్వత పొంది దివ్యస్పర్శకోసం సిద్ధంగా ఉన్నప్పుడు భగవంతుడు కూడా తనదైన ఆటగా దివ్యస్పర్శను అందిస్తాడు. ఈ దివ్యస్పర్శ ఎప్పుడు, ఎవరికి, ఎలా లభిస్తుందో ఎవరూ ఊహించలేరు. ఒక పూలతోటలో ఎన్నో రకరకాల పూలు ఉన్నప్పటికీ వాటిలో కొన్ని మాత్రమే భగవంతుని పాదాల దగ్గరకు చేరతాయి. ఒకే పూలమొక్కకు పూచినప్పటికీ అన్ని పువ్వులు భగవంతుని చేరలేకపోవచ్చు. ప్రతి పువ్వుకూ ఒక గమ్యం ఉంటుంది. కొన్ని పువ్వులు అలంకారానికి ఉపయోగపడతాయి, కొన్ని ఆడవాళ్ళ జడలలో ఉంటాయి. ఇంకా కొన్ని పెళ్ళిళ్ళలో, పేరంటాలలో, పండుగలలో, పబ్బాలలో ఉపయోగపడతాయి. కొన్ని మాత్రమే దేవాలయపు ఆవరణలో చేరతాయి. కాని కొన్ని పువ్వులు మాత్రం ఏరుకోబడి భగవంతుడి పాదాలవద్దకు చేరతాయి. మరికొన్ని పువ్వులు పూజలోచేరక నేలమీద రాలి అలాగే వాడి, పాడైపోతాయి. అలా ఒకే పూలమొక్క నుండి, ఒకే తోట నుండి ఒకేలాంటి ప్రకంపనలు, సుగంధము, ఆకారము, రంగు, సౌందర్యము కలిగి ఉన్నాయి. అన్నీ ఒక్కలాగే ఉన్నప్పటికీ కొన్ని మాత్రము భగవంతుడి పాదాల చెంతకు చేరగా, కొన్ని పాడైపోతాయి ఎందుకు ? దీనిని ఏ తర్కము కాని, బుద్ధిమంతుల

జ్ఞానము కాని వివరించలేదు. కానీ మానవ మస్తిష్కము తనదైన రీతిలో వివరణ యిచ్చి, తన స్వంత తర్కమును ప్రతిపాదించి, సిద్ధాంతములను ప్రవేశపెట్టి, ఉపదేశములాంటి నిష్ప్రయోజనమైన కార్యక్రమములను ఎందుకు జరుపుతుందో! భగవంతుని కృపాదృష్టి కొందరిపైనే పడుతుంది. భగవంతుడు కొందరిని మాత్రమే ఎందుకు ఎన్నుకుంటాడు? మిగిలిన వాళ్ళను ఎందుకు ఎన్నుకోడు ? అన్నది జవాబు లేని సమస్య. ఇప్పటికీ మానవ మస్తిష్కము 'ఎందుకంటే' అని ఎదురుచూస్తూ ఉంటుంది. చాలామంది పిల్లలు, తమ పెద్దలను అన్ని విషయాలకు 'ఎందుకు' అన్న ప్రశ్నతో చేర్చి అడుగుతారు. పెద్దలకు మాత్రం 'ఎందుకంటే' అన్న పదం ఉంటుంది. నిజంగా పిల్లలకు జవాబు దొరికిందో లేదో దేవుడికే తెలుసు, కొంతమంది పిల్లలు నిశ్శబ్దంగా ఉంటారు. కొంతమంది మళ్ళీ ప్రశ్నిస్తారు. పెద్దలు తమ అసహనాన్ని చూపిస్తూ అధికారంతో పిల్లల నోళ్ళు మూయిస్తారు. అది పాశవికం.

డా. జానకిరామ్ గారు కూడ సామాన్య శక్తి గలవారు కాదు. మాస్టర్ ఎమ్.ఎన్.గారు, మాస్టర్ సి.వి.వి.గారిని కలిసి ఆయన అనుగ్రహము పొందడానికి ఈయనే ఒక పరికరములా పనిచేశారు. కాలక్రమములో మాస్టర్ ఎమ్.ఎన్. గారు మాస్టర్ సి.వి.వి. గారికి సమానంగా తయారయ్యారు. ఈ విషయాన్ని స్వయాన మాస్టర్ సి.వి.వి.గారే ధృవపరిచారు! డా. జానకిరామ్ గారికి ఆనాడు తాను మాస్టరుగా పరిణామము చెందే వ్యక్తిని మాస్టర్ సి.వి.వి.గారి వద్దకు తీసికొని పోతున్నాను అని ఏమాత్రము

తెలిసి ఉండకపోవచ్చు. వారు మాస్టర్ ఎమ్.ఎన్.గారి జీవితంలో ఒక పెద్దగా వ్యవహరించి తరువాత ఆయన అభిమానిగా మారారు.

మాస్టరుగారి జీవితంలో డా. జానకిరామ్ గారు కూడ భావితరాల వారికి జ్ఞాపకాలలో అమరులయ్యారు. డా. జానకి రామ్ గారి వికాసము గురించిన ఉదంతము తెలియదు. బహుశ అది నిశ్శబ్దంగా జరిగిందేమో! దైవ సామ్రాజ్యంలో కొందరు కీర్తించబడతారు. కొందరు అలాగే ఉండిపోతారు. కీర్తింపబడ్డవారికి తమను ఎందుకు పొగడుతున్నారో తెలియదు. కాని అది భగవంతుని లీలగా భావిస్తారు. నిజమైన దైవకుమారులు ఆ వైభవమంతా దైవలీల అని, తమకు సంబంధించినది కాదని తెలుసుకుంటారు. డాంబికులు (మిథ్యావాదులు) మాత్రం ఆ వైభవం తమదేనని బ్రతికేస్తారు.

6

# యోగ జీవనము

## బాపట్లకు మార్పు :

బాపట్ల ప్రాంతము కూడా ఒంగోలుతోబాటు సమానంగా, అన్ని రంగాలలో, అన్ని విధాల అంతే ప్రాముఖ్యంతో బాటు ఎదుగుచున్న రోజులవి. ఆ రోజులలో సబ్ కోర్ట్ (చిన్న పరిధి న్యాయస్థానము) అవసరానికి తగ్గట్లుగా ఒంగోలు, బాపట్ల మధ్య మారుతుండేది. ఇందుకు కారణం ఆ ప్రాంతీయుల అవసరములు ఆ విధముగా ఉండేవి. మాస్టర్ ఎమ్.ఎన్. గారు కుంభకోణము నుండి ఒంగోలు చేరిన రోజులలో ఈ చిన్న న్యాయస్థానం ఒంగోలు నుండి మరల బాపట్లకు మార్చబడింది. అవసరానికి తగినట్లుగా వారు కూడా తమ నివాసస్థానము బాపట్లకి మార్చుకొనిరి. తన ఇంటిలో ప్రార్థనకు ప్రత్యేకముగా ఒక గది ఏర్పాటు చేసుకున్నారు. మాస్టర్ సి.వి.వి.గారి చిత్రపటమును ఆ గదిలో నెలకొల్పి ప్రతి నిత్యమూ ఉదయము, సాయంత్రం క్రమము తప్పకుండా ప్రార్థన చేయుట మొదలు పెట్టారు. సాధనకు యివ్వబడిన సూచనలన్నిటినీ పాటించెడివారు.

మాస్టర్ ఎమ్.ఎన్.గారు తన సహజ స్వభావము చేత మనుష్యులను ఆకట్టుకొనుట వలన, అతి తొందరలోనే వారి చుట్టూ మనుష్యులు చేరి వారితో పాటు ప్రార్థనలు చేసెడివారు. వారి బృందములో ఇద్దరు వ్యక్తులు అప్పటికే మాస్టర్ సి.వి.వి.గారి ద్వారా ఉపదేశము పొందినవారు. మరొక నలుగురు తరువాత కాలంలో మాస్టర్ సి.వి.వి.గారి దగ్గర స్వయముగా ఉపదేశము పొందినవారు. మొత్తమునకు ఈ ఏడుగురు (7) మొదటి బృందముగా మనము భావించ వచ్చును. వారి పేర్లు తెలియచేయుట ఎంతో ముదావహము :

| నెం. | నామము | ఉపదేశము పొందిన సంవత్సరం | వారికి ఇవ్వబడిన సంఖ్య |
|---|---|---|---|
| 1. | మైనంపాటి నరసింహం | 1919 | 666 |
| 2. | వెలగపూడి సుబ్బారావు | 1921 | 727 |
| 3. | ప్రయాగ రాఘవయ్య | 1917 | 570 |
| 4. | మాధవపెద్ది కాళిదాసు | 1921 | 731 |
| 5. | కొండూరు సత్యనారాయణ | 1921 | 733 |
| 6. | చోరగుడి రామ దత్తు | 1921 | 744 |
| 7. | గొల్లపూడి లక్ష్మణ శర్మ | 1918 | 604 |

మాస్టర్ ఎమ్.ఎన్. గారితో బాటు చేసే ప్రార్థనల గురించిన మాట ఆనోటా–ఈనోటా అన్ని చోట్లా పాకింది. ఆయన స్వభావం

తీక్షణమైనది. ఆయన చేసే ప్రార్థనలు కూడా తీక్షణముగానే ఉండేవి. ప్రార్థనలు దీర్ఘకాలము మరియు చాలా లోతులలో జరిగేవి. ప్రార్థనా ఫలితము వ్యక్తులకు వెంటనే తెలిసేది. మాస్టర్ ఎమ్.ఎన్. గారి చివరి రోజులలో వారితో పాటు ప్రార్థన చేయు బృందములు పెరిగినవి. వారి ఇంటికి యితర పనులకై వచ్చెడి వారికి, ఈ ప్రార్థనలలో కూర్చున్నవారి శరీరములలో కలుగు విచిత్రమైన కదలికలు నవ్వు తెప్పించేవి. కొంతమంది సభ్యులు ప్రార్థనలో ఉండగా వారికి తెలియకయే గాలిలో పైకి లేచి ప్రార్థనా మందిరపు పై అంచును పట్టుకుని వేళ్ళాడేవారు. అక్కడ వారు ఏమవుతున్నారో ఆ అంచుకు తప్ప మరెవ్వరికీ తెలియదు. మరికొంతమంది ఐ మూలగా గాలిలో తిరుగుతూ ప్రార్థనా మందిరపు పక్క గోడలకు బల్లులవలె అతుక్కుని ఉండెడివారు. మరికొంతమంది నేలమీదే బొంగరములవలె తిరుగుచుండెడివారు. మరికొంతమంది తమకు తెలియకయే ప్రార్థనా మందిరపు ద్వారము నుండి వెలువడి మాస్టరుగారింటి ప్రహరీ గోడల మీద కూర్చుండెడివారు. ఇది అంతయూ అతిశయోక్తి కాదు. ఈ గ్రంథ రచయితకు, పై చెప్పబడిన దృశ్యములన్నీ చూచిన దూరపు బంధువు మరియు ఒంగోలు నివాసిద్వారా తెలుపబడినవి. 2001 సంవత్సరములో ఈ గ్రంథ రచయిత ప్రార్థనా సమావేశములలో పాల్గొనినప్పుడు ఈ బంధువు కూడా వచ్చి రచయితను కలుసుకొనుట జరిగినది. అప్పటికే ఆయన 90 సంవత్సరములవారు. ఈ క్రింది విధముగా ఈ వింత దృశ్యముల గూర్చి పలికిరి. ‘‘మాస్టర్ ఎమ్.ఎన్.గారు యోగ తరగతులను ఒంగోలులో నిర్వహించు రోజులలో మేమందరమూ

చాలా పిన్నవయస్కులము. ఆ రోజులలో ఒంగోలులో వారు ప్రముఖ న్యాయవాది. సంఘములో కూడా ఆయనకు చాలా పేరు ప్రతిష్ఠలు ఉండేవి. నేను కూడా (రచయిత బంధువు) ఒక న్యాయవాదిని. ఆ రోజులలో కోర్టులోని ముఖ్య సభ్యులందరూ శ్రీ ఎమ్.ఎన్. గారి గూర్చి ప్రత్యేకముగా, వింతగా మాట్లాడుకొనుచుండెడివారు. ఒంగోలులోని క్లబ్ నందు ఆయన మంచి నైపుణ్యం కలిగిన ఆటగాడని, వారు చేయు చతుర సంభాషణముచే చాలామంది ప్రభావితులై వారి చుట్టూ చేరుచుండెడివారు. నేనొక విద్యార్థిగా ఉన్న రోజులలో ఉదయం, సాయంత్రం ఆయన ఇంటి ముందునుండే నా చదువు నిమిత్తమై వెళ్ళి వచ్చేవాడిని. ప్రార్థనా సమయమునందు వారితో ప్రార్థన చేయు సభ్యులు చేయు ఈ వింత చర్యలు చూచుటకు ఎంతో హాస్యాస్పదముగా ఉండెడివి. కొంతమంది సభ్యులు ప్రార్థనలో ఉన్నప్పుడు కొంతసేపు ప్రదక్షిణముగను, మరి కొంతసేపు అప్రదక్షిణముగను ఎంతో వేగముతో తిరుగుట నేను నా కళ్ళారా చూచితిని. మరి కొంతమంది పిల్లిమొగ్గలు వేయుట చూచితిని. నాకీ దృశ్యము లన్నియూ ఎంతో వింతగా ఉండేవి. ఇది అంతయూ గమనించిన నేను నా తల్లితండ్రులతో ప్రస్తావించగా వారు నన్ను అటు పోవద్దని వారించిరి. తరువాత జీవిత కాలములో నా పై గల అతిప్రేమ వలన, వ్యామోహము వలన వారు అలా చెప్పిరని గమనించితిని. మా బంధువుల ద్వారా మరియు స్నేహితుల ద్వారా మాస్టర్ ఎమ్.ఎన్.గారు చేయు ప్రార్థనలవలన వారికి అత్యద్భుతమైన చికిత్సలు జరిగినట్లు నాకు తెలిసినది. ఎటువంటి మానసిక, శారీరిక వ్యాధి అయిననూ మరియు అది ఎంత దీర్ఘకాలికమైనది అయిననూ ఈ ప్రార్థనల వలన పరిపూర్ణ

చికిత్స జరిగినట్లు తెలిసినది. ఆయన వద్దకు చేరిన వారి మానసిక శారీరక బాధల నుండి చాల సరళముగా వారికి విముక్తిని ప్రసాదించి ఆనందము కలిగించెడివారు. ఆయన ఇల్లు ఎప్పుడూ పెళ్ళి ఇల్లువలె వచ్చే పోయే వారితో ఎల్లప్పుడూ నిండుగా ఉండేది. ఆ ఇల్లు కూడా అతి విశాలమైనది కావటం చేత చాలా మందికి ఆశ్రయం లభించెడిది. వారి వంటింట్లో పగలు, రాత్రి అన్నది లేక ఆహారము వండబడుతూ ఉండేది. దాదాపు సంవత్సరమంతయూ మాటిమాటికీ ప్రార్థనా సమావేశములు నిర్వహించబడుచుండేవి. ఈ ముసలి వయసునందు వెనుకకు తిరిగి చూడగా నేను ఒక గొప్ప అవకాశమును చేజార్చుకుంటినని, ఒక మహాయోగి యొక్క సాన్నిధ్యమును కోల్పోయితి నని అనిపించుచున్నది''.

పై ఉదంతము చదువరుల అవగాహన కొరకు వ్రాయబడినది. దీనిని బట్టి ప్రార్థనలు ఎంత శక్తివంతముగా మరియు శ్రద్ధాభక్తులతో మాస్టర్ ఎమ్.ఎన్.గారి ద్వారా జరుపబడినవో చదువరులు గమనించ ప్రార్థన. ఇది అంతయు 1920 – 1925 వరకు మాస్టర్ ఎమ్.ఎన్.గారు బాపట్లలో ఉండగా జరిగిన ఉదంతము. తదనంతరము ఈ చిన్న న్యాయస్థానము మరల ఒంగోలుకు మార్చబడిన కారణంగా వారు కూడా తమ నివాసస్థానమును ఒంగోలుకు మార్చుకున్నారు.

వారు బాపట్లలో ఉండగా యోగ సమావేశములకు వచ్చు బృందముల సంఖ్య బాగుగా పెరగటం చేత కేవలము ప్రార్థనలే కాక ఏడు కోర్సులను కూడా తేది 9-1-1922 నుండి 13-4-1922 వరకు నిర్వహించారు. ప్రత్యేక కోర్సులు

కూడా ప్రార్థనలో ఒక భాగముగా మాస్టర్ సి.వి.వి.గారు కూడా నిర్వహించినట్లు సమాచారం ఉన్నది. మాస్టర్ సి.వి.వి.గారి అనుమతితో మాస్టర్ ఎమ్.ఎన్.గారు కూడా ఈ ప్రత్యేక కోర్సులను నిర్వహించుట జరిగినది. దీనికి కారణము మాస్టర్ ఎమ్.ఎన్. గారి బృందము యొక్క ప్రత్యేక అభ్యర్థన వలన వారికీ కోర్సులు నిర్వహించుట తప్పనిసరి అయినది. మాస్టర్ ఎమ్.ఎన్.గారు బాపట్లలో ఉండగా ఆ సమయంలో కూడ మాస్టర్ ఎమ్.ఎన్. గారు మాస్టర్ సి.వి.వి.గారితో ఉత్తరాల ద్వారా సంప్రదింపులు జరుపుచుండేవారు. ఆయన జరిపిన కోర్సులకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఇక్కడ ప్రస్తుత పరచాను.

| సంఖ్య | కోర్సు పేరు | ఆరంభ దినము | ముగించిన దినము | మధ్యవ్యవధి (రోజులలో) |
|---|---|---|---|---|
| 1. | మెర్చురీ కోర్స్ | 9.1.1922 | 3.2.1922 | 26 |
| 2. | ఆరీ కోర్స్ | 4.2.1922 | 14.2.1922 | 11 |
| 3. | సింపుల్ కోర్స్ | 14.2.1922 | 24.2.1922 | 11 |
| 4. | ఆర్డర్ కోర్స్ | 24.2.1922 | 12.3.1922 | 17 |
| 5. | హోలర్ కోర్స్ | 12.3.1922 | 18.3.1922 | 07 |
| 6. | వెండర్ కోర్స్ | 18.3.1922 | 19.3.1922 | 02 |
| 7. | ఎం కోర్స్ | 20.3.1922 | 30.4.1922 | 42 |

## ఉత్తరము సంఖ్య –1

ఉత్తరము నెం. : 451/1922

మాస్టర్ సి.వి.వెంకాసామిరావు
యోగా స్కూలు
డబీరు తూర్పు వీధి
కుంభకోణం.

తేది 11-03-1922

*ప్రియమైన ఎమ్.ఎన్.కు*

'ఎమ్' కోర్సు నిర్వహించుటకు అనుమతి లభించినది.అక్కడే బృందముగా ప్రార్థనలు చేయవచ్చును. ఈ కోర్సు నందు 2006 నామములు ఉండును. ఆ నామముల కాపీ నీకు పంపబడుచున్నది. ఇది ఎట్టి పరిస్థితులలోనూ నీ దగ్గరే ఉండవలెను. ఏ కారణము చేతనూ ఆ కాపీ నీ చేయిదాటి పోరాదు. మీడియములందరు ఒకే సమయమునకు, ఒకే చోట చేరి ఉదయము మరియు సాయంత్రము ఒకే సమయము నందు చేయవలెను. ఈ 'ఎమ్' కోర్సు నిర్వహించుటకు మీరందరూ కలసి ఒక సరియైన గదిని ఏర్పాటు చేసికొనవలెను. ఆ గది మీకు సౌకర్యముగా ఉండవలెను. యోగమిత్రులు వెంకటాద్రి తప్ప మిగిలిన వారందరు "వెండార్" (vendor) కోర్సును 1, 2 రోజులలో ముగించెదరని నేను విశ్వసిస్తున్నాను. "వెండార్" (vendor) కోర్సు అనంతరము మీరందరూ రోజునకు 100 నామముల చొప్పున ఈ 'ఎమ్'

కోర్సు నిర్వహించవలెను. ఉదయం ప్రార్థనలో 50 నామములు, సాయంత్రం ప్రార్థనలో 50 నామములు పూర్తి చేయవలెను. ఈ 'ఎమ్' కోర్సు నందలి ప్రతి నామము ఉచ్చరించినప్పుడు ఒక అర నిమిషము ఉచ్చరించుటకు, తదనంతరము ఒక అర నిమిషము విశ్రాంతిని ఇవ్వవలెను. నీవు ప్రతి మీడియంను కలిసి వారితో మాట్లాడి, అందరికీ సౌకర్యముగా ఉండు ప్రదేశము మరియు సమయము ఏర్పరచవలసినదని నా సలహా. నీ దగ్గర నుండి సమాధానము వచ్చిన అనంతరము, ఇక ముందు చేయవలసిన పనిని గూర్చిన వివరములు తెలియజేసెదను.

*శుభాకాంక్షలతో*
సి.వి.వి.

## ఉత్తరము సంఖ్య - 2

ఉత్తరము నెం. 587/1922

మాస్టర్ సి.వి.వెంకాసామిరావు
యోగా స్కూలు,
డబీరు తూర్పు వీధి,
కుంభకోణం.

తేది 24-4-1922

*ప్రియమైన ఎమ్.ఎన్.కు*

యోగమిత్రుడు లక్ష్మణ శర్మ మరియు సి.ఆర్. దత్తులను, నీ దగ్గరకు వచ్చి నిన్ను కలవవలసిందిగా ఆదేశించితిని. వారు తమ

సౌకర్యమును బట్టి త్వరలోనే ఇద్దరూ కలిసి రోజుకు 100 నామముల చొప్పున, మీ ఇంట్లోనే 'ఎమ్' కోర్సును ప్రారంభించవచ్చు. ఈ 'ఎమ్' కోర్సునకు సంబంధించిన పుస్తకములన్నియూ మీ ఇంటిలోనే ఉండవలెను. నేనిచ్చిన ఆదేశమును అనుసరించి, నీవు వారికి తగిన సూచనలు యిచ్చి వారికి సహాయము చేయవలెను.

*శుభాకాంక్షలతో*
సి.వి.వి.

## ఉత్తరము సంఖ్య - 3

ఉత్తరము నెం. 595/1922

మాస్టర్ సి.వి.వెంకాసామిరావు
యోగా స్కూలు,
డబీరు తూర్పు వీధి,
కుంభకోణం.

తేది 24.4.1922

*ప్రియమైన ఎమ్.ఎన్.కు,*

నీ ఉత్తరము అందినది. 'ఎమ్' కోర్సునకు సంబంధించిన పుస్తకములన్నియూ నీకు నమ్మకము ఉన్న మీడియం దగ్గర భద్రపరచుము. "నూతన బృందము సాధన"కు కావలసిన ఏర్పాట్లన్నీ చేసిన తరువాత మాత్రమే నీవు నా దగ్గరకు రావచ్చును.

*శుభాకాంక్షలతో*
సి.వి.వి.

మాస్టర్ ఎమ్.ఎన్.గారు 1920 మరియు 1921లో బాపట్లలో ప్రార్థనలు, కోర్సులు నిర్వహించారు. మాస్టర్ సి.వి.వి. గారి సూచనల మేరకు 1922వ సంవత్సరం మొదటి భాగంలో కూడా ఏప్రిల్ 30 దాకా నిర్వహించారు. ఆయన పుస్తకాల బాధ్యతలన్నిటినీ ఒక మీడియంకు అప్పగించి మద్రాసు మీదుగా కుంభకోణం వెళ్ళారు. ఆయన కుంభకోణం చేరడానికి ముందే మద్రాసులో వుండగానే ఆయనకు మే 12 తేదీన మాస్టర్ సి.వి.వి. గారు దేహత్యాగం చేశారన్న వార్త తెలిసింది. ఆ వార్త విన్న ఎమ్.ఎన్.గారు దిగ్భ్రాంతు లయ్యారు. కుంభకోణమునకు వెళ్ళకుండా బాపట్లకు తిరిగి వెళ్ళిపోయారు. మాస్టర్ సి.వి.వి. గారి ఆకస్మిక దేహత్యాగానికి చింతాక్రాంతులై, దిక్కుతోచని వారయ్యారు. ఆయన ఆత్మపరిశీలన చేసుకున్నప్పుడు మాస్టరుగారు జరిపించే బృంద ప్రార్థనలను ఇకముందు తాను కొనసాగిస్తూ ఆయనను అనుసరించే మీడియంలకు మరియు అనుయాయులకు సరియైన మార్గదర్శకత్వం వహించాలన్న సత్యాన్ని గ్రహించారు.

ఆయన మాస్టర్ సి.వి.వి.గారు భౌతిక దేహంలో ఉన్నప్పుడు చివరి రోజులలో తన అనుయాయులకు ''ప్రార్థనకు ప్రాముఖ్యత నివ్వాలి కాని కోర్సులకు కాదు'' అని చెప్పారు. ఆ సూచన ప్రకారం అన్ని ప్రయోజనములకు కేవలం ప్రార్థన ఒక్కటే చాలు, ప్రత్యేక ప్రార్థనల అవసరం లేదు. ప్రత్యేక ప్రార్థనల ప్రభావం యోగవిద్యార్థి యొక్క మానసిక ఆరోగ్యంపై దుష్ప్రభావము చూపడంతో వాటిని పక్కకు పెట్టడం జరిగింది. మాస్టర్ ఎమ్.ఎన్. గారికి ఆధారం దొరకటంతో ఆయన కోర్సులను వదలి కేవలం ఉదయం మరియు

సాయంత్రం ప్రార్థనలు మాత్రమే చేయించేవారు. తరువాత బృందములోని కొంతమంది సభ్యులు ఎలాగైనా వారిచేత 'ఎమ్ కోర్సు' చేయించాలని పట్టుబట్టారు. సాధారణ ప్రార్థన మాత్రమే చాలని ఎంత చెప్పినప్పటికీ వారు వినకపోయే సరికి మాస్టర్ ఎమ్.ఎన్.గారు లోతైన ధ్యానంలోకి వెళ్ళిపోయారు. ఆయన తన అంతర్దృష్టి ద్వారా మాస్టర్ సి.వి.వి.గారు అనుమతించినట్టుగా గ్రహించిన తరువాత 'ఎమ్ కోర్సు'ను నిర్వహించారు. ఆయన తన అనుయాయులకు "మాస్టర్ సి.వి.వి.గారి నామమును ఒక్కసారి ఉచ్చరించితే చాలు, అదే అన్ని ప్రయోజనములను కలిగిస్తుంది, ప్రత్యేక కోర్సులు అవసరం లేదు" అని చెప్పారు. కాని కాలక్రమంలో మాస్టర్ సి.వి.వి.గారి యోగమార్గాన్ని అనుసరించే అనుయాయులు రెండు బృందములుగా తయారయ్యారు. ఒక బృందము వారు కేవలం సాధారణ ప్రార్థనలను మాత్రమే నిర్వహిస్తే మరొక బృందము వారు ప్రార్థనతో బాటు ప్రత్యేక కోర్సులను కూడా నిర్వహించేవారు. ఈనాటికీ ఆ బృందములు తమకు కలిగిన ప్రేరణతోనే ప్రార్థనలను నిర్వహిస్తూ ఉన్నారు.

1924లో బాపట్లలోని యోగసాధన ముగిసి మరల ఒంగోలులో మొదలైనది. 1925 నుండి 1940 మార్చిలో జరిగిన దేహత్యాగం వరకు మాస్టర్ ఎమ్.ఎన్.గారు ఒంగోలులోనే ఉన్నారు. వారు దేహత్యాగం చేసినది కూడా ఒంగోలు పట్టణంలోనే. వారు ఆ రోజులలో ఒంగోలులోని లాయరుపేటలో 800 చదరపు అడుగుల స్థలము కొనుగోలుచేసి చక్కటి విశాలమైన ఇంటిని నిర్మించారు. ఆ ఇల్లు ఉమ్మడి కుటుంబానికి కావలసినంత

విశాలంగా ఉంది. ఆ తరువాత అది యోగసాధకుల ప్రార్థనలకు కూడా ఉపయోగపడింది.  ఈ మధ్యకాలం వరకు ఆ భవనం అలాగే ఉండేది. ఆ తరువాత ఒంగోలులోని బంగారు వ్యాపారుల సముదాయముచే కళ్యాణ మంటపంగా మార్చబడింది.

**సత్యయోగ స్కూలు, ఒంగోలు మరియు యోగాభ్యాసము :**

21 మార్చి 1921న 'సత్యయోగా స్కూలు' అను పేరున తన స్వంత ఇంటిలో స్థాపించారు. దీనిని కుంభకోణములోగల యోగా స్కూలునకు అనుబంధ సంస్థగా ఆయన భావించారు. కుంభకోణములోగల యోగా స్కూలు 1910 మే నెలలో స్థాపించబడగా, 16 సంవత్సరముల తరువాత దానియొక్క శాఖ (బ్రాంచ్) ఒంగోలులో ఉత్తర విషువద్దినమునాడు అనన్య సామాన్యమైన మాస్టర్ ఎమ్.ఎన్.గారి ఆధ్వర్యంలో స్థాపింపబడినది. ఏప్రిల్ 14, 1927లో మొట్టమొదటిసారిగా వారు ఒక పెద్ద సమావేశమును నిర్వహించారు. ఆ రోజు కాకతాళీయంగా తమిళుల సంవత్సరాది కావటం ఒక విశేషం. ఆ రోజున మాస్టర్ ఎమ్.ఎన్.గారు చాలామందికి ఈ యోగములో ప్రవేశము యిప్పించారు. మళ్ళీ ఏప్రిల్ 24 నుండి ఏప్రిల్ 30 వరకు, ఒక వారము రోజులపాటు బాపట్లలో తన తోటి న్యాయవాది, సహచరుడు మరియు అనుయాయి అయిన వెలగపూడి సుబ్బారావుగారింట్లో నిర్వహించారు. అంతకుముందు వారు బాపట్లలో ఉండగా చాలామందికి ఈ యోగ సమావేశము కల్పించారు. ఈ రెండు యోగ సమావేశములకు కుంభకోణం నుండి

కూడ యోగమిత్రులు వచ్చి చక్కని అనుభూతిని, ఆనందమును పొందుటే కాక శ్రీ ఎమ్.ఎన్.గారు నిర్వహించిన విధానమును చూసి ఎంతో ప్రశంసించారు. 1927 ఆగష్టులో మాస్టర్ ఎమ్.ఎన్.గారు మొట్టమొదటిసారి యోగ సమావేశమును, మాస్టర్ సి.వి.వి.గారి జన్మదినమైన చాంద్రమాన బహుళ పాడ్యమి నాడు ధనిష్ఠ నక్షత్ర ఘడియలలో నిర్వహించినారు. మాస్టర్ సి.వి.వి.గారు సౌరమాన పంచాంగం ప్రకారం ఆగష్టు 4వ తారీఖున పుట్టినప్పటికీ మాస్టర్ ఎమ్.ఎన్.గారు ఆయన పుట్టినరోజు నాడు అంటే చాంద్రమాన పంచాంగం ప్రకారం ధనిష్ఠ నక్షత్రరాశికి ప్రత్యేక ప్రాధాన్యత నిచ్చి అంటే సింహ మాసపు (శ్రావణ మాసం) పూర్ణిమనాడు లేదా ఒక రోజు అటు–ఇటుగా యోగ సమావేశములను నిర్వహించేవారు. ఆ కారణంగా ఆయన యోగ సమావేశములను శ్రావణ పూర్ణిమ (సింహ మాసం)కు అటు ఇటుగా మూడు రోజులపాటు నిర్వహించేవారు. అదే 1927 సంవత్సరములోనే నిడుబ్రోలు అనే ఊళ్ళో దుర్గాపూజల సమయంలో అంటే 27 అక్టోబర్ నాడు యోగ సమావేశములను నిర్వహించారు. ఆ యోగ సమావేశములో రాధాకృష్ణుల ఉదాత్త తత్త్వము (విశ్వ ప్రకృతి, విశ్వ పురుషుడు మరియు వారి అమరప్రేమ) వివరించారు. మాస్టర్ ఎమ్.ఎన్. గారికి రాధాకృష్ణుల గురించి చెప్పటం చాలా ఇష్టం. ఆయన ఆ విషయం గురించి మాట్లాడటం మొదలుపెడితే శ్రోతలు పవిత్ర స్థితిలో తేలుతూ ఉండేవారు. అందరూ తమ తమ హృదయాలలో ఆ పవిత్ర ప్రేమయొక్క అనుభూతిని పొందేవారు. అదే 1927వ సంవత్సరంలో మాస్టర్ ఎమ్.ఎన్.గారు యోగ విద్యార్థుల బృందముతో బాటు *'డిసెంబర్ కాల్'* కోసం కుంభకోణం వెళ్ళారు.

మాస్టర్ సి.వి.వి.గారు దేహత్యాగం చేసిన తరువాత వెళ్ళటం అదే మొదటిసారి.

1927 వ సంవత్సరము నుండి మాస్టర్ ఎమ్. ఎన్.గారు యోగ సమావేశపు ప్రార్థనలు, సభల యొక్క వేగం పెంచారు. ఆయన ఎంతో సమర్ధవంతముగా ఈ యోగ సమావేశములు, బృంద ప్రార్థనలు నిర్వహించారు. వారే ముఖ్యవక్తగా ఈ సమావేశములలో ప్రసంగించేవారు. వారి ప్రసంగములలో రకరకముల ఆధ్యాత్మిక విషయములను గూర్చి వివరించేవారు.

1. బ్రహ్మ, తత్ అను శబ్దములకు నిజమైన అర్థము.
2. నిర్మలప్రేమ తత్త్వము.
3. మాస్టరు మరియు వారు ఏర్పరచిన యోగ మార్గము.
4. రాధాకృష్ణ తత్త్వము.
5. విరాట్ పురుషుడు, అంకె 10 విశిష్టత.
6. ముఖ్యప్రాణము, అది శరీరములో ప్రవేశించు విధానము.
7. మానవ శరీరమునందుగల 7 ముఖ్యకేంద్రముల యొక్క విశిష్టత.
8. ప్రాణము యొక్క రాక మరియు పోక.
9. సమాధి.
10. కర్మము, ధర్మము.
11. M.T.A.
12. విశ్వమనగానేమి?

13. మెమొరి మరియు మెమొరాండం.
14. పురుష సూక్తము.
15. శ్రీకృష్ణుడు.
16. మన్వంతరములు.
17. కుండలిని.
18. మాస్టర్ మరియు అనుయాయి (Disciple).
19. మానవుడు మరియు సృష్టి.
20. మాస్టర్ సి.వి.వి. గారిచ్చిన యోగమునకు ముఖ్య కారణము.
21. మృత్యువు మరియు మృత్యుంజయత్వము.

మాస్టర్ ఎమ్.ఎన్.గారు అనర్గళముగా మరియు ఎంతో ఆకర్షణీయముగా మాట్లాడేవారు. ఆయన స్వరము శ్రోతల మనసులను రంజింపచేసేది. వారిది దృఢమైన శరీర సౌష్టవము. దీనికి తోడుగా వారు పొడవుగా ఉండేవారు. వారి కన్నులు ముఖ్యముగా ఎంతో ఆకర్షణీయముగా ఉండేవి. వారి నుదురు ఎంతో విశాలముగా ఉండేది. వారిని చూడగానే ప్రశాంతత ఉట్టిపడుతున్నట్లు చూపరులకు అనిపించేది. వారి శరీరము చామనఛాయ రంగుతో ఉండేది. మాస్టర్ ఎమ్.ఎన్. గారిని చూచిన చాలామందికి ఆయన మహా మేధావి అని, పైగా మాతృ హృదయం కలవారని అనుభూతి కలిగేది. ఆయన బుద్ధిజీవి, అలాగే ప్రేమమూర్తి. ఆయనలో ఒకవైపు సమర్థవంతుడైన పురుషుడు మరొక వైపు ప్రేమతత్త్వము మూర్తీభవించిన స్త్రీ కూడా కనిపించేది. ఆయన చేసే పనులలో అకుంఠిత దీక్ష, సామర్థ్యముతో

బాటు సున్నితమైన ప్రేమతత్త్వము కూడా వ్యక్తమయ్యేది. పనిలో ఇంతటి దక్షతను చూసి అన్ని రకముల వ్యక్తులు అంటే భక్తులు, మేధావులు, స్త్రీలు మరియు పిల్లలు ఆయన చుట్టూ చేరేవారు. వృద్ధులు కూడా వారి పాదస్పర్శ కోసమే వంగి నమస్కరించి, కావలసిన ఆశీర్వచనము పొందేవారు. వారిని చూసిన వారందరికీ మరల మాస్టర్ సి.వి.వి.గారిని చూసినట్లుగా అనిపించేది.




నెల్లూరు, ఒంగోలు, కర్నూలు, గుంటూరు మరియు కృష్ణా జిల్లాలలో మాస్టర్ ఎమ్.ఎన్. గారంటే తెలియనివారు లేరు.


ఆయన యోగపరమైన ఎటువంటి సమావేశములైనప్పటికీ అది చిన్న పట్టణమైనా, గ్రామమైనా, ఏ వూరివారు ఆహ్వానించినా వెళ్ళి పాల్గొనేవారు.

సంవత్సరాలు గడిచేకొద్దీ యోగసాధన లోకోత్తర మనిపించి, దానికంటే వృత్తి మరియు కుటుంబము రెండూ చాలా చిన్నవిగా కనిపించేవి. ఆయన సన్నిధిలో చాలామంది మాస్టర్ సి.వి.వి. మరియు యోగమును కూడా అనుభూతి చెందేవారు. ఆయన ద్వారా జరిగిన తక్షణ ఉపశమనము, దివ్యదృష్టి, అదృశ్యవాణి.... ఇలాంటి అనుభవాలు లెక్కలేనన్ని జరిగాయి. ఆ ఉదంతాలను ఈ పుస్తకము యొక్క చివరిభాగంలో ఇవ్వడం జరిగింది.

మాస్టర్ ఎమ్.ఎన్.గారు యోగ సమావేశములను దృఢపరచి ప్రతి ఏటా ఒంగోలులో మే, ఆగష్టు, డిసెంబరు నెలలలో తప్పకుండా జరిపేవారు. మిగిలిన సమయములో శిష్యుల కోరిక మేరకు యాత్రలను, సమావేశాలను నిర్వహించేవారు. సాధకులు కూర్చునేటప్పుడు ఒకరి వెనుక ఒకరు, ఒకరి పక్కన ఒకరు అలా కాస్త దూరంగా కూర్చోమని, అలా కూర్చుంటే ఎనర్జీ సరిగా ప్రసారమవుతుందని ఆయన సూచించేవారు. ప్రార్థన జరుగుతూ ఉండగానే ఆయన ఒక్కోసారి కళ్ళుతెరచి, ఒక్కోసారి కళ్ళు మూసుకొని కూడా గమనించేవారు. యోగసాధనలో ప్రతి విద్యార్థితోను సంబంధము కలిగి, యోగసాధనలో ప్రతివారికీ మార్గదర్శనం చేసేవారు. ఎందుకంటే యోగములో ఎవరి సాధన వారిదే. ప్రార్థనలో సాధకుని జీవశక్తికి సుస్పష్టమైన దిద్దుబాట్లు చేసి, ప్రార్థన తరువాత పాల్గొన్న విద్యార్థుల అనుభవాలను, వాటి

ఔచిత్యాన్ని వివరించేవారు. సాధన ద్వారా జీవితంలో లభించే చిన్న చిన్న విజయాలకు గర్వపడకూడదని హెచ్చరించేవారు. ఆయన మాస్టరుగారి పట్ల చాలా వినయ విధేయతలతో ఉండేవారు. ఆయన తన విద్యార్థులకు 'నేను, నాయొక్క, నాది' అన్న పదాలు వాడకూడదని కఠినంగా హెచ్చరించేవారు. ఎప్పుడైనా వారు ఆ పదాలను ఉచ్చరించినప్పుడు ఆయన తక్షణమే సరిదిద్దేవారు. ఆయన అప్పుడప్పుడు 'నేను'కు బదులుగా 'మనము', 'నాది'కి బదులుగా మనది' అన్న పదాలు వాడమని చెప్పేవారు. 'నేను చేశాను' అని చెప్పటానికి బదులుగా 'అది అలా జరిగింది' అని చెప్పాలని, 'నేను ప్రయాణం చేశాను' అన్న దానికి బదులుగా 'ఆ ప్రయాణం జరిగింది' అని చెప్పమనేవారు. పనులు జరుగుతున్నాయి అంటే తనలోని ఉనికి ద్వారానే జరుగుతున్నాయని అర్థం. ఎవరైనా నేనే ఈ పనులన్నీ చేస్తున్నాను, నా ద్వారానే జరుగుతున్నాయని భావిస్తే అతనిలో గర్వం పెరుగుతుంది.

మనలో గర్వం చేరుకుందంటే అది సూక్ష్మ, ఉన్నత శక్తి ప్రవాహానికి అడ్డుగోడగా నిలబడుతుంది.



7

# మాస్టర్ యోగము

మాస్టర్ సి.వి.వి. యోగము చాలా శక్తివంతమైనది. ఈ యోగము మానవజాతి యొక్క పురోగమనమును వేగవంతము చేయును. మానవ శరీరము నందును మరియు మనసు నందును వేగముగా మార్పులు కలిగించును. 12 సంవత్సరములలో, 12 జన్మలకు సరిపడు కార్యక్రమ మంతటినీ మాస్టరుగారు నైపుణ్యముతో సర్దుబాటు చేసేవారు.

ఈ యోగమునందు ప్రవేశించిన సాధకుని మనసు మరియు స్వభావములకు ఒత్తిడి కలుగును. నిజమైన సాధకునకు సమయము సరిపోవుటలేదనే భావన కలుగును. ఒక నెలరోజులు గడిచినంతనే తాను ఎన్నో యోగ కార్యక్రమములలో పాల్గొనినట్లు అనిపించును. అంతేకాక ఒక్క సంవత్సరము యిట్టే గడిచిపోయినదని కూడ భావన కలుగుచుండును. కాలము యొక్క భావన కలుగుచుండును. కాలము యొక్క లెక్కల పరిమాణము (Dimension) కూడ ఊహకు అందనంతగా మారును. సాధకుడు (విద్యార్థి) అనేక విషయములలో పాల్గొనినట్లు అనిపించును.

మాస్టర్ సి.వి.వి.గారి వద్ద సాధకుని కర్మరాహిత్య మగుటకు, తటస్థమగుటకు ఒక గూఢమైన మార్గము కలదు. ఒక్కొక్కసారి వారికి సంకల్పము కలిగినచో సాధకుని యొక్క కర్మ అతడు అనుభవించకుండానే హరింపబడును. కొన్ని కొన్ని కర్మలు ప్రార్థనయందే సర్దుబాటు చేయబడును. మరికొన్ని స్వప్నములలో హరింపబడును. కాని అధిక భాగము బృందములందు పంచబడుట వలన జరుగును. ఆరోగ్యపరమైన, ఆపదతో కూడిన ఆర్థిక పరిస్థితియందు ఒడుదొడుకులు, అతిహీనమైన పరిస్థితి (Crisis), ఒక దుఃఖభరితమైన సంఘటన జరిగినను, అకస్మాత్తుగా ప్రమాదము (Accident) కలిగినను, అట్టి కర్మల ఫలిత మంతయు బృందమంతటికీ పంచబడును. అలాంటి ప్రమాదములు, తద్వారా రావలసిన కర్మ అనుభవము సాధకునకు తెలియకుండానే హరింపబడును.

బృంద ప్రార్థనలు, బృందముతో కలసి సేవచేయుట, బృందములు బృందములుగా సద్గ్రంథ పఠనము చేయుట అను అంశములను గూర్చి ఎల్లప్పుడూ ప్రస్తావించేవారు. అలా చేయుటకు ఆదేశములు యిచ్చుచుండెడివారు. దీనివలన బృందప్రజ్ఞ ఏర్పడును. అదే విధముగా చక్కని అనుభూతులు ఏర్పడును. మొత్తము బృందమంతటికీ కర్మబంధము తెగిపోవును. సామాన్యముగా మానవుడు తనను గూర్చిన ఒక ప్రత్యేక భావము కలిగి ఉండుటవలన బృందముతో కలిసి ప్రార్థన చేయుటకు అతని మనస్సు, స్వభావము ఒప్పుకొనదు, ఇందువలన మాస్టరుగారు యివ్వదలచుకొన్న కొన్ని ప్రయోజనములను కోల్పోవుదురు.

ఎవరైతే బృందమునకు ధనము, సమయము మరియు శక్తి సామర్థ్యములను కేటాయించెదరో అలాంటి వారికి అద్భుతమైన సహాయ సహకారములను మాస్టర్ అనుగ్రహించెదరు. ఈ ప్రత్యేకమైన సౌకర్యము వీరి యోగమార్గము నందు మాత్రమే లభించును.

అస్వస్థులకు స్వస్థత ఏర్పరచునప్పుడు కూడ ఈ యోగమునందు రోగము తగ్గవలెనని ప్రార్థన చేయువారికి అవతలివారి రోగము యొక్క లక్షణములు సంక్రమించవు. దీనికి కారణము బృంద ప్రార్థనయే. ఎందుకంటే బృంద ప్రార్థన చేయుటవలన ప్రసారమగు దివ్యశక్తి అతి ఉత్తమమైనది మరియు ఉత్తమ స్థాయిలో కూడ ఉండును. సర్దుబాట్లు అతి వేగముగా జరుగుటవలన అతి తక్కువ వ్యవధిలో రోగికి స్వస్థత చేకూరును.

ఈ కుంభయుగమునందు కాలము త్వరగ గడచును మరియు వేగము కూడ ఎక్కువ. ఎందుకంటే మాస్టరుగారి చైతన్యము కుంభయుగ చైతన్యము కావడంవలననే. తక్కువ వ్యవధిలో ఎక్కువ పని జరుగును. దీనియొక్క అనుభవము సాధకునకు స్వయముగా తెలియుచుండును. ఈ తెలియుట కూడ చాలా విశిష్టముగా ఉండును.

మూఢనమ్మకాలను వదలివేయాలి. అర్థం లేని ఆచారాలను పారద్రోలాలి. కాని ప్రాచీన ఆచారాలలోని విలువలను గౌరవించాలి. కాని, వారు అప్పట్లో చెప్పిన ఆచారాలను కాలానుగుణంగా మార్చుకోవాలి. మాస్టర్ యోగములో

వస్త్రధారణలో, వేషభూషణాలలో కాని క్రమశిక్షణ పేరుతో నిర్బంధం లేదు. మాస్టర్ యోగములో సంపూర్ణ స్వాతంత్ర్యము ఉంది. ప్రతివాడూ తనకు తానే నియమాలు ఏర్పరచుకోవాలి, అంతే కాని బయటి నుండి ఎలాంటి నియమాలు లేవు. ప్రాంతీయ భాషకు విరుద్ధంగా తరచుగా ఆంగ్లభాషను ఉపయోగించేవారు. ఎందుకంటే నవయుగానికి ఆంగ్లభాషయే ఎన్నుకోబడింది. అలాగని ఆంగ్లభాషకు కూడ నిర్బంధం లేదు.

ప్రతి పనిలోను తత్త్వమే ముందుగా ఉండేది. మనిషిలో మారవలసినది బాహ్య ఆకారము కాదు, కేవలము తత్త్వమే. మాస్టర్ సి.వి.వి.గారికి ప్రియమైన వాక్యం ''ఆకారంలో మార్పు కాదు, అంతరంగములో మార్పు కావాలి''. "అవసరమైన వాటిలో ఐక్యత, అనవసరమైన వాటిలో భిన్నత, ప్రేరణలో ఔదార్యం ఉండాలి'' అన్న మాటలు ఈ మార్గములో జనవాక్యం అయ్యాయి. సాధకుడు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం చేసే ప్రార్థనలో శ్రద్ధ ఉంటే కావలసిన సూచనలు లోపలినుండే వస్తాయి. ఆ సూచనలు నిత్యజీవితం, ఆహార నియమాలు, కార్యాచరణ, మాట, ఆలోచన, ప్రాచీన గ్రంథ అధ్యయనము, చేసే ప్రతి సేవలోనూ అన్నింటికి సంబంధించినవి అంతరంగములో నుండే లభిస్తాయి.

మాస్టరుగారు స్వయంగా తానే ప్రతి విద్యార్థి యొక్క బాధ్యత వహించి, వారికి స్వ-పరిపాలన గురించి నేర్పేవారు. స్వయంనియంత్రణ, ఆత్మ నిర్భరత, ఆ తరువాత స్వతంత్రమునకు దారి తీస్తుంది. "నన్ను నేను పరిపాలించుకొంటాను. అలాగే ఇతరులను కూడా వారే పాలించుకొనేలా చేస్తాను'' అన్నవి

జీవన సిద్ధాంతము లయ్యాయి. మాస్టర్ యోగమార్గములో నియంత్రణ, దిశానిర్దేశము, ఇతరులపై అధికారం చలాయించడం ఇవన్నీ పాశవిక లక్షణాలు. ప్రతివాడు మానవ కుమారునికి ప్రతినిధి అయినప్పటికీ కాలానికి, సన్నివేశానికి తగినట్లుగా దైవ కుమారుడవుతాడు. అందరికీ తండ్రి ఒక్కడే. అందువలన వారందరూ అన్నదమ్ములు. ఎవరైన సలహాలు తీసుకొని, అందరితో కలిసి పనిచేయవచ్చు, అంతే కాని అధికారాన్ని చలాయించడం, నియమాల ద్వారా నియంత్రించడం ఉండదు. మాస్టర్ సి.వి.వి. గారు బృందమును *'సొసైటీ ఆఫ్ యోగా స్కూల్ ఫ్రెండ్స్'* అని పిలిచేవారు. ఆయన ఈ యోగ మార్గమును 'డైరెక్ట్ లైన్' అన్నారు. 'డైరెక్ట్ లైన్' అంటే ఏ విద్యార్థి క్రమం తప్పకుండా ప్రార్థన చేస్తాడో మాస్టరుగారి శక్తి అతనిలో కేంద్రీకృతమై అతనికి మార్గదర్శనం దొరుకుతుంది. ఈ కారణంగా అందరికీ తమ ప్రణాళికకు తగినట్లుగా పనిచేయడానికి స్వేచ్ఛ ఉంది. అతనికి స్వ–పరిపాలన (స్వ–రాజ్) తోబాటు, తగిన బాధ్యతలు కూడ ఉంటాయి. బాధ్యతలు లేక స్వతంత్రము లేదు. స్వతంత్రము మరియు బాధ్యత అన్నవి ఒకే నాణెమునకు రెండు ముఖముల లాంటివి.

ప్రతి యోగ విద్యార్థి కూడ మాస్టరుగారికి సమర్థవంతమైన కేంద్రమే. ప్రార్థన ద్వారా అతడు మాస్టరుగారి కేంద్రమును తనలో ఏర్పాటు చేసుకొని, ఆ తరువాత తనకు కావలసిన సూచనలను పొందవచ్చును. తన పనులకు తానే బాధ్యుడు.

మాస్టరుగారు ఈ మార్గమును చక్కగా అనుసరించే వారికి తప్పనిసరియైన మూడు ముఖ్య నియమాలను తెలిపారు.

*1. ప్రార్థన ఉదయం మరియు సాయంత్రం నిర్దిష్ట సమయానికి చేయాలి. రెండు ప్రార్థనల మధ్యలో 12 గంటల వ్యవధి ఉండాలి. ప్రార్థనలో గాని, ప్రార్థనా సమయంలో గాని మార్పులు ఉంటే ముందుగా జరిగే ప్రార్థనలో మాస్టరుగారికి ఆ విషయం నివేదించాలి.*

*2. ఇతరులకు సేవ చేయాలి కాని ఇతరుల నుండి ఏమీ ఆశించకూడదు. దాతగా ఉండాలి కాని గ్రహీతగా ఉండకూడదు.*


*3. లోపల, బయటా అంతటా ఉన్న 'ఒకే ఒక్క' సర్వాంతర్యామిని చూడగలగాలి. ఆ 'ఒక్కడి'కే ఉన్న మరొక పేరు 'మాస్టర్'.*

(ప్రైవాటికి అనుబంధ నియమములు)

1. ఎల్లప్పుడూ ఒక నోటు పుస్తకమును మీతో ఉంచుకోవాలి. అది నీలోనుండి విద్యుత్ తరంగంలా వచ్చే సూచనలను తీసుకోవడానికి నీలోని సంసిద్ధతను తెలియచేస్తుంది. వాటిని వ్రాసుకోవాలి. ఆయన చెప్పిన నోటు పుస్తకము అందరికీ చూపించడానికి కాదు.

2. అనవసరమైన తిరుగుళ్ళను, అనవసరమైన సంబంధాలను, మాటలను తీసివేయాలి. సామాజికంగా, ధార్మికంగా, వృత్తిపరంగా అందరితో స్నేహంగా ఉండాలి. నియమిత సంతోషాలకు అనుమతి ఉంది.

మాస్టర్ ఎమ్.ఎన్.గారు, మాస్టర్ సి.వి.వి.గారు తనకు 1919లో ఉపదేశించిన యోగమును చాలా శ్రద్ధగా అనుసరించారు. 1921 నాటికే మాస్టర్ సి.వి.వి.గారు భవిష్యత్ మాస్టరుగా శ్రీ ఎమ్.ఎన్.గారిని దర్శించి ఆయనను *'లిటిల్ మాస్టర్'* అని పిలిచారు. నిజంగా 12 ఏళ్ళకే శ్రీ ఎమ్.ఎన్.గారు మాస్టర్ ఎమ్.ఎన్.గా పరిణతి చెందారు. ఉత్తరాంధ్ర (కోస్తా) ప్రదేశ్‌లో ఆయనకు పల్లెలలో, పట్టణాలలో అనుయాయులు బాగా పెరిగారు. ఆయన హీలింగ్ చేస్తూ ఉండగా, *"ప్రాణా ట్రీట్, యోగా టీచ్"* అన్నది ఆయన నేర్పిన ముఖ్య నినాదము అయింది. ఆ దిశలో ఆయన కఠోరమైన సాధన చేశారు. ఆయన చాలామందిని వ్యాధుల నుండి నయం చేశారు. జీవితంలో ఎదురైన జటిలసమస్యలను చక్కగా పరిష్కరించారు. ఆయన తన జీవితకాలంలో దాదాపు 1200 మందికి దీక్షనిచ్చారు. మాస్టర్ సి.వి.వి. యోగమార్గంలో ఆయన ధృవతారగా వెలుగొందారు. మాస్టర్ ఇ. కె. గారు కూడా శ్రీ ఎమ్.ఎన్.గారిని, 'మాస్టర్ సి.వి.వి. యోగమార్గంలో ఆయన ధృవతార' అన్నారు. ప్రాచ్య పాశ్చాత్య దేశాలలో బృంద ప్రార్థనలలో ఆయన అదృశ్య హస్తాలు దారి చూపేవి. ఆయన ఒక ప్రచండ తత్త్వము. ఆయన పని నిశ్శబ్దంగా, నిరంతరంగా జరుగుతూనే ఉంటుంది.



# 8

# స్వాతంత్ర్యము

అది 21 మార్చి 1934. విజయవాడలో 'ఈక్వినాక్స్ ధార్మిక సమావేశం' ఏర్పాటు చేయబడినది. సుమారు 250 మంది యోగసాధకులు హాజరయ్యారు. మాస్టరుగారు ప్రార్థనలను నిర్వహిస్తున్నారు. సాధారణంగా ఇలాంటి ధార్మిక సమావేశాలలో మాస్టర్ ఎమ్.ఎన్.గారు అందించే ప్రార్థనలను అంతఃస్ఫూర్తితో ఉచ్చరిస్తారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రార్థన ప్రారంభించబడినది. అలా మొదలైన ప్రార్థన దాదాపు రెండు గంటలపాటు కొనసాగింది. సుమారు 10.40 నిమిషములకు మాస్టర్ ఎమ్.ఎన్. గారికి ఎక్కడో, ఏదో కాలిన వాసన వస్తున్నట్లుగా అనిపించింది. ఆ తరువాత నెమ్మదిగా ఆ కాలిన వాసన పరిసరముల నుండి కాదని, అది తన శరీరము నుండే వస్తున్నదని గమనించారు. ఆయన తన చేతులను వాసన చూసుకొని తనలోనే ఏదో కాలినదని గుర్తించారు. ఆ వాసనను ఆయన భరించ లేకపోయారు. కాని, అలాగే ప్రార్థనను కొనసాగించారు. చాలా మౌనంగా ఉంటూనే మెరిడియన్ ప్రేయర్, సాయంత్రం ప్రార్థన పూర్తి చేశారు. సాయంత్రం ప్రార్థన తరువాత శిష్యుడొకడు

మాస్టర్ ఎమ్.ఎన్. గారిని సమీపించి ఆయన నిశ్శబ్దతకు కారణం అడిగాడు. ఎందుకంటే సాధారణంగా ఇలాంటి కాంగ్రిగేషన్స్ (ధార్మిక సమావేశాలు)లో మాస్టరుగారు సంతోషంగా, ఉత్సాహంగా ఉంటూ అందరి యోగక్షేమాలను విచారించేవారు. తాను సంతోషంగా ఉంటూ, హాస్యంగా మాట్లాడుతూ అందరినీ ఆనందపరచేవారు. కాని ఆ రోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి కూడా మౌనంగానే ఉన్నారు. అలా ఎప్పుడూ జరగలేదు. మాస్టరుగారిలో స్పష్టంగా కనిపిస్తున్న ఈ మార్పును గమనించిన సాధకుడు కారణమేమిటని అడిగాడు. అందుకు మాస్టరుగారు ఆ శిష్యునితో ''అవును. ఉదయం 9 గంటల ప్రార్థన జరుగుతున్నప్పుడు 10.40 నిమిషాలకు నాలో ఏదో మార్పు జరిగింది. రక్తమాంసాలతో కూడిన ఈ శరీరానికి అంత్యక్రియలు జరిగి, చితిలో కాలినట్లుగా ఒక గుప్తమైన అనుభవం కలిగింది. ఆ తరువాత నేను ఇంకొక శరీరంలో ప్రవేశించిన అనుభవం కూడా కలిగింది. అలాంటి అనుభూతి ఇన్ని రోజులుగా ప్రార్థనలు చేస్తున్నా ఏనాడూ కలుగలేదు. ఈ విషయం నేను నా చేతిని వాసన చూసుకున్నప్పుడు దృఢపడింది. ఎందుకంటే నా చేతినుండి శవం కాలిన వాసన వచ్చింది. ఇప్పుడు నేను వేరొక భిన్నమైన శరీరంలో ఉన్నాను. నేను స్వతంత్రుడను. ఇప్పుడు నేను "అక్షర పురుషుడను'' (నాశము లేని వ్యక్తి).

భగవద్గీత 15వ అధ్యాయములో 'ఒకే మనిషి అంతస్థంలో మూడు రకములుగా ఉంటాడు. ఒకడు 'పురుషోత్తముడు' అంటే దివ్యాత్మ (విశ్వమానవుడు). ఇంకొకడు 'అక్షర పురుషుడు'

మరియు వ్యక్తిగత ఆత్మ. 'క్షరపురుషుడు' (నాశముగల వ్యక్తి) అంటే దేహధారియై జనన మరణాలు గలవాడు. మూడవ వాడు సశరీరంగా మరణించి మరల సశరీరంగా జన్మిస్తాడు. దేహధారియై తనతోబాటు తనదైన వ్యక్తిత్వమును, ప్రాపంచిక సంబంధాలను కూడ తెచ్చుకుంటాడు. మరణముతో ఈ ప్రాపంచిక సంబంధాలు కూడ ముగిసిపోతాయి. ఈ లౌకికమైన మనిషిలోనే లోకోత్తర మానవుడు విశ్వమానవుని ప్రతిరూపముగా ఉంటాడు. లౌకిక మానవుని ప్రతీకయే లోకోత్తర మానవుడు. అతడు ఎంత దివ్యంగా ఉంటాడో అంతే సహజంగా ఉంటాడు. అతడే వైయక్తిక ఆత్మ లేక ప్రత్యగాత్మ అని పిలువబడ్డాడు. ఈ ప్రత్యగాత్మ విశ్వాత్మనుండి వేరు పరచబడినది. అతడు అఖండములోని ఒక చిన్న ముక్క అంతే. విశ్వమానవుడు ఒక మహా సముద్రమైతే ఇతడు ఒక తరంగం. అలలోని నురుగులా వ్యక్తిగత ఆత్మతో సమాన లక్షణాలుగల లౌకిక మానవుడు ప్రక్షిప్తం చేయబడ్డాడు. అలలో కొంత సారముంటుంది కాని, నురుగులో ఏమీ ఉండదు. అలలోని నీటికి సముద్రములోని నీటికి ఏ మాత్రమూ తేడా వుండదు. విశ్వాత్మకు వ్యక్తరూపమే ఈ వైయక్తిక ఆత్మ (ప్రత్యగాత్మ). మానవుడు లౌకిక విషయాల వైపు ఆకర్షింపబడి సత్యాన్ని మరచిపోతాడు. కాలానుగుణంగా ఈ సత్యం బయటికి వస్తుంది. తనలోని నురుగు తత్వాన్ని, అల తత్వాన్ని గుర్తించి సముద్రానికి తనకు గల మూలతత్వాన్ని గుర్తించి సత్యాన్ని తెలుసుకుంటాడు. ఈ సత్యం తెలిశాక నురుగుతో గల సంబంధం తెగిపోతుంది. శాశ్వతమైన గుర్తింపు స్థిరపడుతుంది. అలాంటి శాశ్వతమైన గుర్తింపు దైవకుమారునికి ఒక హోదా.

తాను దైవ కుమారుడని మనిషి మరచినప్పుడు అతడు మరల మానవ కుమారుడిగా జన్మిస్తాడు. మానవ కుమారుడు మరల మృత్యువుద్వారా ఉపదేశము పొంది దైవకుమారుని హోదా పొందగలడు. మానవుడు తన సహజమైన గుర్తింపు పొందగలడని భారతీయ సనాతన గ్రంథములన్నీ చెబుతున్నాయి. మహాభారతము, రామాయణము, భాగవతము, భగవద్గీత, కఠోపనిషత్తు, సావిత్రి ఉపాఖ్యానము, మార్కండేయ ఉపాఖ్యానము ఈ సిద్ధాంతముల ఆధారమైనవే. మానవుడు తన కార్యవిధానము ద్వారా సహజ (గుర్తింపు) వ్యక్తిత్వమును పొందగలడు. యోగశాస్త్రము ప్రత్యేకంగా అమరత్వం మరియు ఆత్మసాక్షాత్కారము కోసమే వ్రాయబడినది.

మాస్టర్ సి.వి.వి.గారు ఈ కార్యవిధానము ద్వారా లౌకిక ప్రజ్ఞ యొక్క మరణాన్ని మరియు అలౌకిక ప్రజ్ఞయొక్క జననాన్ని అనుభూతి చెందారు. ఆయన చిత్తశుద్ధికల సాధకులకు అంతఃకరణ శరీర (సూక్ష్మ శరీర) నిర్మాణము మరియు అందులోకి ప్రవేశమును కల్పిస్తానని వాగ్దానము చేశారు. ఈ శరీరమును స్వర్ణ శరీరమని కూడ అంటారు. అంటే బుద్ధిలోకములలోని పదార్థముల ద్వారా స్థూలశరీర నిర్మాణము చేయబడుతుంది. బుద్ధిలోకములలోని పదార్థము నాలుగవ ఈథర్‌కు సంబంధించినది. మాస్టర్ సి.వి.వి.గారు ప్రకృతిలో ఈ శరీరనిర్మాణము త్వరగా జరిగే ఏర్పాటు కూడా చేశారు. ఆయన అమరత్వంగల శరీరమును యిస్తానని ప్రతిజ్ఞ చేశారు. అంతేకాక ఆయన ఈ యోగమును 'అమరత్వపు యోగము' (అమరయోగము) అని చెప్పారు. ఆయన 'ఎవరైనా ఈ యోగములో ప్రవేశిస్తే వారికి మరణము లేదు. వారు మరణాన్ని

దాటగలరు' అని నిర్ధారించి చెప్పారు. మృత్యువును దాటడమంటే బ్రహ్మత్వపు ప్రయాణంలో సగం ప్రయాణం జరిగినట్లే. మాస్టర్ సి.వి.వి.గారు అమరత్వము మరియు బ్రహ్మత్వము యిస్తానని ప్రతిజ్ఞ చేశారు.

రక్తమాంసములతో కూడిన భౌతిక శరీరము నుండే సూక్ష్మ శరీర నిర్మాణం జరుగుతుంది. రక్తమాంసాదులతో కూడిన ఈ శరీరము సూక్ష్మశరీర నిర్మాణానికి ఆధారభూమి. ఈ భౌతిక శరీరం లేక సూక్ష్మశరీర నిర్మాణం జరగదు. సూక్ష్మశరీర నిర్మాణానికి కావలసిన ముడిసరుకు ఇదే. రక్తమాంసములతో కూడిన ఈ శరీరము ఒక విశిష్ట యోగ ప్రక్రియకు గురి అయినచో అందులోనుండే బంగారుకాంతితో కూడిన శరీరము తయారవుతుంది. బంగారు కాంతితో కూడిన శరీరమునకు యింకా చాలా పేర్లు ఉన్నాయి.

అవి :

1. సూక్ష్మ శరీరము.
2. సటిల్ బాడి.
3. దివ్యశరీరము.
4. హిరణ్మయ శరీరము.
5. అంతఃకరణ శరీరము.
6. ఈథరిక్ బాడీ (నాలుగవ ఆకాశము).
7. భాగవత శరీరము.
8. యోగ శరీరము.

పాలు లేక వెన్న రాదు. చెట్టు లేకుండా పూలు, కాయలు, పండ్లు లేవు. గుడ్డు లేక పిల్ల లేదు. అలాగే రక్తమాంసాదులతో కూడిన శరీరము లేక వెలుగు శరీరం లేదు. ఈ కారణంగా సనాతన గ్రంథములలో *'శరీరమిదం ఖలు ధర్మసాధనం'* అంటే 'లౌకిక మరియు అలౌకిక సిద్ధి పొందడానికి మానవ శరీరము ధర్మసాధనము' అని చెప్పబడింది. సనాతన గ్రంథాలు యింకా ఇలా చెప్పాయి. మానవశరీరము లభించడమంటే అది ఆత్మకు దొరికే అపురూపమైన అవకాశం. మానవుడిగా పుట్టడము కూడ అపురూపమైన అవకాశం. సత్యాన్ని, బ్రహ్మమును చేరడానికి అదొక రహదారి. దేవతలు కూడ బ్రహ్మత్వమును పొందటానికి మానవ శరీరమును పొందాలని ఎదురు చూస్తూ ఉంటారు. దేవతల కంటే యోగులు, ద్రష్టలు, ఋషులు, మహర్షులు, బ్రహ్మర్షులు కూడ శ్రేష్ఠమైనవారు. దేవత లందరికీ తమ మూలము తెలియదు కాని యోగికి తన మూలము తెలుసు. అందుకే శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి అన్నిటికంటే యోగమార్గము ముఖ్యమైనదని, ఆ మార్గములోనే ముందుకు సాగమని చెప్పాడు.

ముందుగా తాను బ్రహ్మత్వస్థితికి చేరినవాడే సద్గురువు. అందుకు సంబంధించిన విధానములకు, మార్పులకు తనను తాను అప్పగించుకున్నవాడు. మార్పులు అసంఖ్యాకంగా జరుగుతాయి. అది గొంగళిపురుగు సీతాకోకచిలుకలా మారటానికి జరిగే పరిణామ ప్రక్రియ. ఒక గొంగళిపురుగు కోశస్థ దశనుండి అనేక మార్పులు చెంది సంపూర్ణంగా విభిన్నంగా సమర్థవంతంగా బయటకు వస్తుంది. ప్రతి సీతాకోకచిలుక కూడ మూలంలో

గొంగళిపురుగే. ప్రతి దైవకుమారుడు కూడ మూలంలో మానవ కుమారుడే. కానీ దైవకుమారుడు కొంత భిన్నంగా ఉంటాడు. అతని యోగ్యతలు, సమర్థత విభిన్నంగా ఉంటాయి. అతని అనుభవాలు, భావాలు విభిన్నంగా ఉంటాయి. ఆతని పనులు కూడ దైవీ సంబంధం కలిగి ఉంటాయి. అవి సత్సంకల్పముతో, స్థిరత్వంతో కూడి ఉంటాయి, అతని మాటలు కూడ దివ్యత్వం కలిగి ఉంటాయి. అలాంటి వారు దివ్యస్పర్శను కలిగి ఇతరులకు కూడ అలాంటి దివ్యస్పర్శను అందించగల సమర్థత కలిగి ఉంటారు. వారి దర్శన, స్పర్శ, సంభాషణ కూడ మనలో వికాసాన్ని కలిగిస్తాయి. వారి బోధనలు ఆకాశంలో శిలాక్షరములుగా చెక్కబడినవి మరియు అవి శాశ్వతంగా ఉంటాయి. వారు నిరంతరం స్ఫూర్తిదాతలుగా ఉంటారు. సంక్షిప్తంగా చెప్పాలంటే వారి ఉనికి దివ్యత్వంతో కూడి ఉంటుంది. బ్రహ్మమునకు వారికి ఏమాత్రం వ్యత్యాసం ఉండదు. వారు వ్యక్తరూపంలో ఉన్న బ్రహ్మమే.

మాస్టర్ సి.వి.వి.గారు చాలాసార్లు తాను బ్రహ్మమే అని నిశ్చయంగా చెప్పారు. మాస్టర్ ఎమ్.ఎన్.గారు ఆయన అడుగుజాడలను అనుసరించి అమరత్వాన్ని సాధించారు. ఆయన మరణాన్ని అనుభూతి చెంది కూడా జీవితాన్ని కొనసాగించారు. ఆయన భౌతికంగా మరణించినప్పటికీ మరల దానికి మించిన అలౌకికవ్యక్తిగా జన్మను పొందారు. 'మృత్యువంటే మరణం కాదు' అని మన సనాతన ధర్మగ్రంథాలు చెబుతున్నాయి. మాస్టర్ ఎమ్.ఎన్.గారు మానవ కుమారునిగా మరణించి, మరల దైవీ కుమారునిగా జన్మించారు. 'ఒక భవిష్యవాణి పరిపూర్ణమైనది'–

అంటుంది బైబిలు. ఆయన దైవానికి ప్రతిరూపమయ్యారు. బైబిల్ లో 'దేవుడు మానవుని తన ప్రతిరూపంగా, తన ఇచ్ఛతో సృష్టించాడు' అని చెప్పబడింది. కాని మనిషి దానిని పాడు చేసి, వక్రీకరించాడు. దానిని వికారం చేశాడు. దైవం మరల గురువు రూపంలో వచ్చి చక్కపరచి సహజస్థితికి కొనితెస్తాడు. సహజస్థితి పొందగానే మార్పు చేయబడిన సత్యము మాయమవుతుంది. ఇలా వాస్తవాన్ని తెలుసుకొని తరువాత మారినట్టి పుత్రుల (Prodigal Son) కథలు అనేకం ఉన్నాయి. మాస్టర్ ఎమ్.ఎన్. గారి విషయంలో ఇలాగే జరిగింది. ఆయనను మాస్టర్ సి.వి.వి.గారు "లిటిల్ మాస్టర్" అనేవారు. మాస్టర్ ఎమ్.ఎన్.గారు మాస్టర్ సి.వి.వి. గారి భవిష్యవాణిని పరిపూర్తి చేశారు. ఆయన కూడా 'మాస్టర్' అయ్యారు.

**సంఖ్య 666 :**

మాస్టర్ సి.వి.వి. గారు మాస్టర్ ఎమ్.ఎన్. గారికి దీక్ష నొసంగి, '666' అన్న సంఖ్యను యివ్వడము దైవప్రేరణతో జరిగినదిగా భావించాలి. క్రమసంఖ్యలో మాస్టర్ ఎమ్.ఎన్. గారికి ఆ సంఖ్య యివ్వడమైనది. 666 అన్నది పవిత్రమైన సంఖ్య. అందులో ఒక సందేశం ఉంది. 6ను తలక్రిందులుగా వ్రాస్తే అది 9 అవుతుంది. 9 అంకె ఆత్మకు సంబంధించినది. 6 అంకె పశుతత్వము (పశు ప్రవృత్తికి సంబంధించినది). మానవుడు పాశవిక స్థితి నుండి దైవత్వానికి చేరుకున్నప్పుడు ఆ అంకె 6 నుండి 9గా మారుతుంది. మానవుడు మూడుసార్లు తలక్రిందులై


కష్టపడతాడు. మళ్ళీ మూడుసార్లు యథాస్థితికి వస్తాడు. మూడుసార్లు తలక్రిందులై మూడుసార్లు యథాస్థితికి వస్తే అప్పుడు నీవు 'మాస్టర్ మేసన్' (రాతి భవనం నిర్మించే మేస్త్రి) అని 'ఫ్రీ మేసనరి'లో చెప్పబడింది. మానవుడు సత్యాన్ని తలక్రిందులుగా అర్థం చేసుకుంటాడు. భౌతిక వస్తువులపట్ల, తన సహచరులపట్ల, తత్వములపట్ల, అతని ఆలోచనలు తలక్రిందులుగానే ఉంటాయి. అతడు ఎప్పుడూ పరిసరముల నుండి దేనిని పొందుదామా అనే ఆలోచిస్తాడు. కాని ఆ మూడు లోకాలలోనూ తీసుకొనే పద్ధతికి వ్యతిరేకంగా యివ్వడము అనేదాన్ని నేర్చుకోవాలి. తోటి మానవులకు భౌతిక వనరులను, ప్రేమను, దయ మరియు సేవలు అందించడము, తనను తాను దివ్యప్రణాళికకు సంపూర్ణ సమర్పణ చేసుకోవడం ద్వారా పాశవిక స్థితినుండి ఉన్నత స్థితికి చేరుకోగలడు. అప్పుడు అతనిలోని భౌతిక, సంవేగాత్మక మరియు మానసిక కక్ష్యలలో ఉన్న పాశవిక ప్రవృత్తి మరణిస్తుంది. 'ఎవరైనా మూడుసార్లు మరణించాలి' అని గుప్తవిద్యలో చెప్పబడింది. 'మూడు కక్ష్యలలో ఇవ్వడమేగాని తీసికొనేవాడు కాకూడదు' అనేది గుప్తవిద్యలో తెలుపబడినది. మాస్టర్ ఎమ్.ఎన్. గారు దీనిని చక్కగా నిర్వర్తించి చూపించారు. తన జీవితాన్ని పరిసర జీవులకు సర్వ సమర్పణ చేయడం ద్వారా తనలోని పశువును చంపేశారు. ఈ 'సర్వసమర్పణ' వేదములలో కూడా చెప్పబడినది. అది 'సర్వహుత యజ్ఞము' అని చెప్పబడింది. అంటే తోటి జీవులపట్ల సర్వ సమర్పణా భావముతో ఉండటమే. మాస్టర్ ఎమ్.ఎన్.గారు తన ఇంటిని, సంపదను సమాజ హితంకోసం సమర్పించారు. తనకున్న ధీశక్తిని,

సామర్థ్యాన్ని కూడ సమాజసేవకు సమర్పించారు. తన జీవితాన్నే సహజీవులకు సమర్పించి, ఒంటరిగా, ధైర్యంగా మాస్టర్ సి.వి.వి. గారి సాన్నిధ్యంలో నిలబడ్డారు. ప్రకృతి నియమము లనుసరించి ఆయనకు ఆశీర్వచనములు లభించు కాలము ఆసన్నమైనది.

*'యజ్ఞార్థం కురు కర్మాణి'* అని శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీతలో చెప్పాడు. 'నీవు చేసే పనులు తోటిజీవుల సేవ కావాలి' అన్నది దీనికి సామాన్య అర్థం. ఆ సర్వ సమర్పణా భావం చేతనే ఆకాశంలో సూర్యుడు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాడు. అలాగే గ్రహములు, దేవతలు. దీనిని మానవుడు ఎప్పుడు నేర్చుకొంటాడో అప్పుడు లౌకిక (ఉన్న) స్థితి నుండి ఉన్నత స్థితికి ఉద్ధరింపబడతాడు. మాస్టర్ ఎమ్.ఎన్. గారు దీనిని నిర్వర్తించి వెలుగుశరీరములో నిలిచారు. మాస్టర్ ఎమ్.ఎన్. గారు ఒక ప్రచండ జ్వాలగా ఉండి ఈనాడు ఈ యోగమార్గము అనుసరించు వారిలో జ్యోతిని ప్రజ్వలనము గావించుచున్నారు. అందరికీ ప్రచోదనం కలిగిస్తున్నారు. ఆయన అదృశ్య సహాయకుడు. ఆయన తాను ధృవతారగా పరిణామము చెంది జీవన సముద్రంలో కొట్టుమిట్టాడుతున్న వారికి దారిదీపం అయ్యారు. ఇది ప్రతియొక్క నిజమైన సాధకుని అనుభవము. మృత్యువు కూడ అతనిని దర్శించి, బాగుండాలని ఆశిస్తుంది. మృత్యుదేవత జ్ఞానితో బాటు స్నేహపూర్వకంగా చేయి చేయి కలిపి నడుస్తుంది. ఇలాంటి అనుభవము కలిగేదాకా ఎవ్వరూ తాను 'మాస్టర్' అని గర్వంగా చెప్పుకోడు. అలా ఎవరైనా చేస్తే, అతడికి ప్రకృతి విధించే జరిమానాను చెల్లించవలసి ఉంటుంది.

మాస్టర్ ఎమ్.ఎన్.గారు తమ ఈ మరణానుభూతిని సంక్షిప్తంగా డైరీలో వ్రాసుకున్నారు. ఆయన భౌతికంగా ఉన్నప్పుడు అపుడపుడు తన అనుయాయులకు 11 మార్చి 1940 తారీఖును జాగ్రత్తగా గమనించమని సూచించేవారు. కాని యథాలాపంగా ఉన్న సామాన్య జీవులు ఆ విషయాన్ని మరచిపోయారు. ఎన్నోసార్లు సూక్ష్మంగా యిచ్చు సూచనలు వ్యర్థమవుతుంటాయి.

ఈ అనుభూతి పొందిన తరువాత మాస్టర్ ఎమ్.ఎన్.గారి చికిత్సా సామర్థ్యము, శిక్షణా సామర్థ్యము, ప్రార్థనలో మార్పు, చేర్పులు చేయుట అనే విషయాలు మెరుగుపడినవి.




# 9


## స్వాతంత్ర్యానంతర క్రియాశీలత

మాస్టర్ ఎమ్.ఎన్. గారు తన 51వ ఏట (50 ఏళ్ళు, 7 నెలలు) నిజమైన స్వాతంత్ర్యమును పొంది 'మాస్టర్' అయ్యారు. ఆయన 29 డిసెంబర్ 1919 లో దీక్షను పొంది 1934 లో మరణాతీత స్థితియొక్క అనుభూతిని పొందారు. దీక్ష పొందిన తరువాత ఇది కావడానికి 14 సంవత్సరముల, 3 నెలలు పట్టింది. ఆయన మరణానుభూతి పొందిన తేదీ మరియు సమయము గొప్ప పరిణామానికి దారితీసింది. ఆనాటి గ్రహగతులను చూపించే చిత్రములను పొందుపరచటం ముదావహంగా ఉంటుంది.

చిత్రం–1


04° 43'
07° 29'
06° 09'
14' 12°
10° 35'
15° 06'
1
2
3
4
5
6
7
8
9
10
11
12

చిత్రం–2


11° 23'
08° 30'
13° 21'
07° 11'
04' 12°
07° 43'
1
2
3
4
5
6
7
8
9
10
11
12

ఆ మరునాడు ఆయన తన అనుయాయులకు ఎవరైతే పన్నెండు ఏళ్ళు, ఆ తరువాత కూడా క్రమం తప్పక ప్రార్థన చేస్తే వారికి తమలోనుండే సూచనలు లభిస్తాయి. వారు స్వతంత్రంగా యోగసాధన చేయవచ్చు. తమకు కావలసిన మార్గదర్శకత్వాన్ని తమలో నుండే పొందగలరు. వారు తమ గ్రామాలలో, పట్టణాలలో కేంద్రములను ప్రారంభించి ప్రార్థనలు జరిపిస్తూ, ఈ యోగమార్గములో క్రొత్తగా వచ్చేవారికి ప్రార్థనలను అందించవచ్చు. ఆయన తన అనుయాయులకు యిలా చెప్పేవారు "మాస్టరు గారే తమకు కావలసిన ఆత్మలను (వాహికలను) ఎన్నుకుంటారు. ఆయన తనకు కావలసిన వారిని చక్కగా ఎంపిక చేసి యోగ కేంద్రములకు పంపుతారు. క్రొత్తగా వచ్చి చేరినవారు మాస్టరుగారి ద్వారా వచ్చినవారని భావించి వారికి ప్రత్యేక జాగ్రత్తలు వహించాలి. అలాగని మరీ అతిగా సేవలు చేయకూడదు. వారిని అనుయాయులుగానే చూసుకోవాలి. అందరూ అనుయాయులే. ఉన్నది ఒక్కడే 'మాస్టర్' అని చెప్పారు." అదే రోజున మాస్టర్ ఎమ్.ఎన్.గారు కొందరిని శిష్యులుగా చేర్చుకున్నారు. ఎమ్.ఎన్. గారు కూడా మాస్టరు సి.వి.వి.గారిలాగే తమ పేరును కుదించి సంక్షిప్తం చేశారు. ఆయన అనుయాయులకు ఎమ్.టి.ఎ. అన్న ఉపదిష్టమును పరిచయం చేశారు. ఆనాటి నుండి ఎమ్.ఎన్.గారి అనుయాయులు కూడ సందర్భానుసారంగా ఆ ఉపదిష్టమును ఉచ్చరించడం ప్రారంభించారు.

మాస్టర్ నమస్కారమ్

మాస్టర్ సి.వి.వి. నమస్కారమ్

మాస్టర్ ఎమ్.ఎన్. నమస్కారమ్

మాస్టర్ నమస్కారమ్

సాధారణంగా ప్రతి యోగ విద్యార్థి నిశ్శబ్దంగా ఈ ఉపదిష్టమును ఉచ్చరిస్తారు. సందర్భానుగుణంగా గట్టిగా చెప్పేవారు. కాలక్రమంలో ఈ ఉచ్చారణ ప్రఖ్యాతి చెందినది. కాని, ఇప్పటికీ చాలా బృందములలో ఈ మంత్రములను నిశ్శబ్దంగా మననం చేసేవారు ఉన్నారు.

**సంశయము- ధ్రువీకరణము :**

ఒక మానవుడు మాస్టర్ గా పరివర్తన చెందాడంటే అక్కడ ఎన్నో విచికిత్సలు ఉంటాయి. బృందములో కూడ కొంతమందికి మాస్టరుగారి అనుభూతులు, అనుభవాల గురించి సందేహాలు ఉన్నాయని విన్నారు. ఒక సాయంత్రం గుంటూరులోని ఇంటి పైన ఉన్న డాబా మీద ప్రార్థనా సమావేశం ఏర్పాటు చేయబడింది. మాస్టరుగారు బృందమంతటికీ ఒకే అనుభూతి కలుగుతుందని చెప్పారు. ఆయన ముందుగానే బృందానికి విశిష్టమైన అనుభూతి కలుగుతుందని స్పష్టంగా సూచించారు. సభ్యులందరిలో తీవ్రమైన ఆసక్తి మరియు ఉత్సాహము మొదలయ్యాయి. నాస్తికులు తటస్థంగా (ఉదాసీనంగా) ఉన్నారు. కాని అందరూ కళ్ళు మూసుకొని కూర్చున్నారు. మాస్టరుగారు ప్రార్థన మొదలు పెట్టారు. ఆ ప్రార్థన నలభై ఐదు నిమిషాలపాటు జరిగింది. ఇరవైనాలుగు నిమిషాల తరువాత అందరికీ ఒకే సమయంలో గగుర్పాటు కలిగించే అనుభూతి కలిగింది. మాస్టరుగారు

నెమ్మదిగా కళ్ళు తెరిచి ఒక్కొక్కరిని తమ తమ అనుభూతి గురించి అడిగారు. మొదటివాడు ఇలా చెప్పాడు. 'నాకు ఒక విచిత్రమైన అనుభూతి కలిగింది. మీరు లేచి వచ్చి నా చెంపపైన చక్కగా ముద్దు పెట్టారు. నాకు మీరు కాల్చే క్యాప్‌స్టన్ సిగరెట్ వాసన కూడా తెలిసింది. మీకు ఇంకా చిలిపితనం పోలేదా మాస్టరుగారూ!' అని అన్నాడు. వెంటనే రెండవ వ్యక్తి లేచి 'సరిగా నాకు కూడ యిలాంటి అనుభవమే కలిగింది' అన్నాడు. మూడవ వ్యక్తి కూడ ఆ విషయాన్ని సమర్థించాడు. ఆ బృందములో స్త్రీలు కూడా ఉన్నారు. వారు కూడా తలవంచి తమకు కూడ యిలాంటి అనుభవమే కలిగిందని ధృవీకరించారు. ఆ అనుభూతిని తప్పించుకున్నవారు ఒక్కరు కూడ లేరు. అక్కడున్న హేతువాదులు ఈ విషయాన్ని కాదనలేక పోయారు. ఎందుకంటే అదే సమయంలో వారికి కూడా అలాంటి అనుభూతి కలిగింది. బృందమంతటికీ ఒకే సమయంలో ఒకే అనుభూతి కలగడంచేత వారు దిగ్భ్రమ చెందారు. అప్పుడు మాస్టరుగారు ఇలా అన్నారు, నేను ఒక్క విషయాన్ని నిరూపించాను. నేను పురుషత్వమును పొందాను. అందువలన పురుషుని యోగ్యతను చూడ గలిగాను. మీ గురువును సందేహించకండి. ఆయనను మీరు హృదయపూర్వకంగా అనుసరించండి. నేను మీకు నా అఖండత్వాన్ని రుచి చూపించాను. నీవు ఎంత శ్రద్ధగా నీ హృదయాన్ని గురువుకు సమర్పిస్తే, అంతగా ఆయన పవిత్ర ప్రేమను నీవు అనుభవించగలవు. గురువు పరమప్రేమమూర్తి. బ్రహ్మము కూడ ప్రేమమూర్తియే. నీవు నీ గురువును ఎంతగా ప్రేమించి అనుసరిస్తావో, ఆయన కూడ నీకు అంతగా సంకేతాలను యిస్తాడు.

ఒక అయస్కాంతము తన అయస్కాంత శక్తిని ప్రసరిస్తుంది. గోపగోపికలు తమను తాము ఏ నియమ-నిబంధనలు లేకుండా స్వేచ్ఛగా శ్రీకృష్ణునికి సమర్పించుకున్నారు. కనుకనే వారందరూ ఒకే అనుభూతిని పొందారు. ఆ గోపగోపికలలో స్త్రీలు, పురుషులు కూడా ఉన్నారు. కాని ఆ పురుష స్థితిలో ఉన్నది స్త్రీ కాదు అలా అని పురుషుడూ కాడు. ఆ భగవత్ స్పర్శ (ముద్దు) చిన్న-పెద్ద, వయసు-వావి, కుల-మతాల వ్యత్యాసం లేకుండా అందరిలో ఉన్న ఆత్మకు లభించింది. ఆ పురుషస్థితి ఏడు దశలను దాటి ఎనిమిదవ స్థితికి చేరినది. మాస్టరుగారి ఎనర్జీ ఏడు దశలను దాటి ఎనిమిదవ దశలో ఉంటుంది. దీనిని 'గోలోకం' అని కూడా అంటారు. కృష్ణ చైతన్యము లేదా క్రీస్తు ప్రజ్ఞ 8 వ దశలో ఉన్న శక్తి కన్న వేరే కాదు. మాస్టరు గారి చైతన్యము 8 వ దశలో ఉన్న శక్తి. మాస్టర్ సి.వి.వి గారు దీనికి ప్రతినిధి. అలానే మాస్టర్ ఎమ్.ఎన్.గారు.

(2008 ఆగష్టులో ఈ రచయిత ఏంజల్బర్గ్, స్విట్జర్లాండులో జరిగిన ఒక యోగ సమావేశానికి హాజరై, ఆ సభలో మాస్టర్ ఎమ్.ఎన్.గారి జీవితచరిత్ర మరియు క్రియాశీలతను గురించి మాట్లాడటం జరిగింది. అంతేకాక ఆయన మాస్టర్ ఎమ్.ఎన్. గారి ద్వారా అందరికీ ఒకే సమయములో ఒక్కలాగే లభించిన స్పర్శ మరియు వారు అనుభవించిన సిగరెట్ వాసన గురించి వివరించారు. అది విన్న సభలోని వారందరు స్పందించారు. ఆ తరువాత కొద్ది నిమిషాలకే ఆ హాల్ లోని చాలామందికి సిగరెట్ వాసన తెలిసింది. ఆ వాసనకు వారందరూ ఆశ్చర్యపడ్డారు, ఎందుకంటే ఆ భవన ప్రాంగణంలో సిగరెట్ కాల్చడం

నిషేధింపబడినది. అంతకు ముందెన్నడూ ఏ సమావేశంలోనూ సిగరెట్ వాసనను వారు అనుభవించలేదు. ఆ తరువాత జరిగిన సమావేశాలలోనూ అలాంటి వాసన వారికి రాలేదు. అలా మాస్టరుగారి సున్నితమైన స్పర్శను వారందరూ అనుభూతి చెంది సంతోషపడ్డారు.)

మాస్టరుగారు ఒక ఇంట్లో ఆ ఇంటి యజమానితో మాట్లాడుతూ మాస్టరుగారి స్పర్శతో మనుష్యులకే కాక, పశు పక్షి వృక్షాదులతోబాటు వస్తువులకు కూడ ఆయుర్దాయం పెరుగుతుందన్నారు. మాస్టరుగారి స్పర్శ పొందిన వస్తువు ఒకటి ఈనాటికీ ఒక గొప్ప ఆశ్రమంలో సంరక్షింపబడుతూ ఉంది. ఆ ఉదంతం విన్న ఆ ఇంటి యజమాని దిగ్భ్రమ చెందారు.

మాస్టర్ ఎమ్.ఎన్.గారు నవ్వుతూ ఆ గృహిణిని 'మీ ఇంట్లో బియ్యం ఎన్ని ఉన్నాయి? అని అడిగారు.

అందుకు ఆ గృహిణి 'ఐదు కిలోలు' అని జవాబిచ్చింది.

'ఇప్పుడు మూడు కిలోలు తీసుకురండి' అన్నారు.

ఆమె ఒక పాత్రలో మూడు కిలోల బియ్యం తెచ్చింది.

మాస్టర్ ఎమ్.ఎన్.గారు తమ అరచేతితో ఆ బియ్యాన్ని బాగా కలిపి ఆ తరువాత బియ్యం పైన తమ చేతిని మెల్లగా అలా తిప్పుతూనే ఉన్నారు.

ఆయన ఆమెతో 'ఇప్పుడు ఈ బియ్యానికి మాస్టరు

గారి స్పర్శ లభించి ఆయుష్షు పెరిగింది. ఈ బియ్యము ఎప్పటికీ తాజాగా, సువాసనతో కూడి మీ ఊహకు రానంతగా చాలాకాలం ఉంటాయి' అన్నారు.

ఆ ఇంటి యజమాని ఆ బియ్యాన్ని అలాగే భద్రపరిచాడు. కాలక్రమంలో ఆ బియ్యపు గింజలు బంగారు రంగులోకి మారాయి. అవి ఈనాటికీ వరంగల్ లోని యోగకేంద్రములో ప్రదర్శనకు ఉంచబడ్డాయి. అవి ఈనాటికీ మంచి నాణ్యత గల బియ్యంలాగే సువాసనతో కూడి ఉన్నాయి. (ఈ రచయితకు ఆలస్యంగా అయినా 21 శతాబ్దంలో మొదటి దశకంలో (2002 డిసెంబర్)లో వాటిని చూడటమే కాక వాసన చూసే అవకాశం కూడా లభించింది.)

మాస్టర్ సి.వి.వి. గారిలాగే మాస్టర్ ఎమ్.ఎన్.గారు కూడా తన అనుయాయులకు దీర్ఘాయుష్షును అనుగ్రహించారు. ప్రత్యేకంగా యోగ విద్యార్థులకు ఇది అవసరం. ఎందుకంటే వారు తమ సాధనను కొనఊపిరి దాకా సాగించవచ్చు. అమరత్వం పొందేవరకు, నిరంతర యోగసాధనకు దీర్ఘాయుష్షే ఒక్కటే ఉపాయమని చెప్పారు. దీర్ఘాయుర్దాయం పొందడానికి ఇదొక్కటే ప్రబల కారణం. ఇక మిగిలిన కోరికలు అనావశ్యకము కాకున్నను తక్కువ ప్రాధాన్యత కలిగినవి. భారతదేశంలోని ప్రజలు సాధారణంగా మరణము ఆసన్నమవడానికి ముందు కేవలం ముక్తి సాధనకు దీర్ఘాయువును కోరుకునేది ఒక సంప్రదాయము. జీవించి ఉండగానే మోక్షం లభిస్తే మరణము 'నిర్గమనం' (దేహత్యాగము)గా మారుతుంది. బలవంతంగా బయటికి పంపడము మరణం. కాని, ఈ నిర్గమనం తెలిసి దేహాన్ని వదలి

వెళ్ళిపోవడం లాంటిది. బలవంతంగా వెళ్ళిపోవడం బాధాకరంగా ఉంటుంది. కాని తెలిసి వెళ్ళిపోవడం సంతోషంగా ఉంటుంది. చాలామంది చనిపోతారు, కాని కొందరు మాత్రమే వెళ్ళిపోతారు. తెలిసి వెళ్ళిపోయేవాళ్ళు ధన్యజీవులు, దేహత్యాగము పూర్తి తెలివితో జరుగుతుంది. ఎరుక లేని స్థితిలో జరిగేది మరణము.

1934 నుండి మాస్టర్ ఎమ్.ఎన్. గారి దర్శనానికి ఎందరో నూతన వ్యక్తులు వచ్చేవారు. మాస్టర్ సి.వి.వి.గారికి కూడ ఇలాగే జరిగేది. మాస్టర్ సి.వి.వి.గారి ధర్మపత్నియే (శ్రీమతి వెంకమ్మగారు) ఇందుకు సాక్షి. ఎవరెవరో చెప్పులు లేకుండా ఉత్తకాళ్ళతో వచ్చేవారు, ఎత్తుగా ఉండి పొడవాటి గడ్డము కలవారు, ఊగిసలాడే జుట్టు గలవారు మాస్టర్ సి.వి.వి. గారిని దర్శించి పగలు – రాత్రి కూడ ఆయనతో చర్చలు చేసేవారు. అలాగే మాస్టర్ ఎమ్.ఎన్. గారి జీవితంలో కూడ ఈ అపరిచిత వ్యక్తులు తారస పడ్డారట. వాళ్ళు వివిధ దివ్య ఆశ్రమాలలో ఉంటున్న దైవాంశ గల వ్యక్తులు, మరియు తమ యాత్రలలో మానవజాతి ప్రగతికోసం పనిచేసే కారణ జన్మలను దర్శిస్తారని ఒక నమ్మకం. మాస్టర్ ఎమ్.ఎన్. గారి శ్రీమతి మరియు కొంతమంది అనుయాయులు ఈ అపరిచిత వ్యక్తుల రాకపోకలకు సాక్షులు. ఎప్పుడైనా మాస్టరుగారిని ఈ విషయం గురించి చెప్పమని అడిగితే ఆయన విషయాన్ని మార్చేవారు లేదా హాస్యంగా జవాబు చెప్పేవారు. ఆ మహాత్ములకు దివ్యప్రణాళికతో గల సంబంధాన్ని బహిర్గతంగా చెప్పేవారు కారు.

యోగచికిత్స మరియు యోగములో ఆయనలోని ఉత్తమ ప్రయోజకత్వమును గుర్తించిన ఆయన అనుయాయులు

దివ్యాశ్రమములను, దివ్యపురుషుల దర్శనములను తమకు కూడా కలిగించాలని ఆశించి ఆయనను ఒత్తిడి చేశారు. ఆయన దైవదర్శనం కలిగించ గలరని దృఢంగా విశ్వసించారు. అన్నీ విన్న మాస్టరుగారు కూడ ఒక రోజు దృఢంగా ఇలా అన్నారు :

''బృందములో రహస్యాలను తెలుసుకోవాలన్న ప్రవృత్తి పెరుగుతూ ఉంది. అందుకే అందరిలో నుండి ఆ ప్రవృత్తిని తొలగించాలని భావించాను. నేను ఇక్కడికి (భూమికి) వచ్చింది మీకు దేవుని చూపించటానికి కాదు. మీకు దివ్యాశ్రమములను మరియు దివ్యపురుషులను చూపించటానికి కాదు. మీరు ఈ భౌతిక ప్రపంచము వైపు ఆకర్షితులై భ్రమలో చిక్కుకోకండి. ఆధ్యాత్మిక మోహం నుండి మిమ్ములను మీరే తొలగించుకోండి. సేవాకార్యక్రమాలలో కష్టపడి పనిచేయండి. సేవకోసం నిరంతరం మీ వంతు కర్తవ్యం నిర్వహించండి, ప్రయత్నించండి. శ్రద్ధగా ప్రార్థన చేయండి. జిజ్ఞాసా హృదయాన్ని పెంచుకోండి. కోరికలను తగ్గించుకోండి. ప్రేమికులు ఒకరిని ఒకరు కలుసుకోవడం కోసం తహతహ లాడుతున్నట్లుగా మీరు దివ్యత్వం పొందాలన్న మహత్వాకాంక్షను పెంచుకోండి. ఏకోన్ముఖమైన మనోవృత్తిని పెంచుకోండి. ఆ మనోవృత్తిని ఎవరో మీకు బహుమతిగా యిస్తారని ఆశించకండి. మీరు వెన్నను కలిగివున్న పాలలాంటి వారు. మిమ్ములను మీరే మథించుకుంటే వచ్చేది నవనీతం. మీరు పళ్ళు, పూలతో కూడి ఉన్న ఫలవృక్షం లాంటివారు. ఆ పళ్ళను పూలను వేరెవరూ తెచ్చి అతికించరు. నీలోని జిజ్ఞాస పెరిగే కొలదీ ఆ ప్రక్రియ అంత త్వరగా జరుగుతుంది. అలాంటి అగ్నిని నీలో

నీవే ప్రజ్వలింప చేసుకోవాలి. అలా పుట్టిన వేడి క్రమంగా జ్వాల అవుతుంది. నేను ఒక కాటలిస్ట్ (Catalyst)గా (తాను తటస్థంగా ఉండి ఇతరులను చైతన్యపరచువాడు) ఉంటాను. కాని మీకోసం మీరే త్వరపడాలి. భావము, భాష మరియు ఆచరణలలో స్వచ్ఛంగా ఉండండి. మీ పరిసరములను ప్రేమించండి. ఆవేశము, ఉద్వేగము ప్రేమ కాదు. మిమ్ములను మీరు నమ్మాలి. మీరు బహిర్గతం కావటానికి కావలసిన తాళంచెవి మీ దగ్గరే ఉన్నది. సంవేగాత్మక భావనలతో, ఆశలతో మిమ్ములను మీరే బంధించుకోకండి. మీలో సమర్పణాభావం పెంచుకోండి. మిమ్ములను సంపూర్ణంగా మాస్టరుగారికి సమర్పించుకోండి. రాధలా ఉండాలి. ఆమెకు కృష్ణుని కంటే ఇతరము ఏదీ లేదు. గోపికలా ఉండండి. ప్రతిక్షణం సర్వాంతర్యామిని అన్వేషించే మరియు అనుభవించే ఒక శిష్యునిలా గడపండి. మీ ప్రయత్నములో మీరు పరిపూర్ణులు కాగలరు.''

''నేను ఇప్పుడే కాక ఆ తరువాత కూడ మీకు ఏ సమయములోనైనా అందుబాటులో ఉంటాను. మీరు మనస్ఫూర్తిగా మీ మనసులోకి నన్ను ఆహ్వానిస్తే, మీ ప్రయత్నంలో నేను మీకు సహకరిస్తాను. మీ పని నేను చేయను. కాని మీరు చేసే పనిలో నా సహాయం తప్పకుండా ఉంటుందని గుర్తుంచుకోండి. మీ పక్కనే మీకు చేదోడుగా ఉండి మిమ్ములను అభినందిస్తాను. నేను ఎప్పటికీ మీకు యోగ స్నేహితుడిలా ఉంటాను.''

ఇలా మాస్టరుగారు తమ మాటలను ముగించేటప్పటికి ఆయన ''ప్రచండ జ్యోతి'' లా కనిపించారు.

10

# చివరి ప్రయాణం

మాస్టర్ ఎమ్.ఎన్. గారికి 'హైడ్రోసిల్' అనే ఆరోగ్య సమస్య ప్రారంభమైంది. ఆ జబ్బు ఆయనకు ఉందని 1911 – 1912 లోనే గుర్తించారు. అప్పటికి అది కాస్త తగ్గి ఆయన పనులకు ఎలాంటి ఇబ్బంది కలుగలేదు. 1936 లో తనలో హైడ్రోసిల్ సమస్య ఎక్కువవుతుందని, గమనించి ఆపరేషన్ (శస్త్రచికిత్స) చేయించుకోవడానికి నిశ్చయించారు. 1936 మే 6 వ తారీఖున తానే ఒంగోలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేరారు. ఆపరేషన్ చేయటానికి పూర్వ సిద్ధతా కార్యక్రమం పూర్తయ్యాక మే 7వ తేదీ ఆపరేషన్ జరిగింది. ఆయనకు మత్తు కలగటానికి క్లోరోఫామ్ కాని, ఏ ఇతర మత్తుమందును కాని యివ్వకుండా కొకైన్ ఇంజక్షన్ మాత్రమే యిచ్చారు. ఆపరేషన్ బాగా జరిగింది, కాని తరువాత ఆ కొకైన్ ఇంజక్షన్ దుష్పరిణామము కారణంగా ఇతర ఆరోగ్య సమస్యలు ప్రారంభమయ్యాయి. విపరీతమైన జ్వరముతో ఆయన ఐదు రోజులు చాలా నలిగిపోయారు. ఆ జ్వరం మే 13వ తారీఖు నాటికి తగ్గుముఖం పట్టి ఆస్పత్రి నుండి ఇంటికి తిరిగి వచ్చారు. మే 14 వ తేదీ ఆయనకు మరల మరణానుభూతి

కలిగింది. ఆయన వివరంగా కాకుండా తెలివిగా ఆ అనుభూతిని తన అనుయాయులతో పంచుకున్నారు. శరీరంలో నుండి తను వెళ్ళిపోతున్నట్లుగా అనుభూతి చెందారు. ఆ వెళ్ళిపోవటాన్ని కూడా ఆయన అంతులేని ఒక సొరంగంలో, పెరుగుతున్న వేగముతో వెళ్ళిపోయే అనుభూతి చెందారు. ఆయన వెలుగు ప్రదేశముల నుండి చీకటి ప్రదేశములకు, ఆ చీకటి ప్రదేశములనుండి ఇంకా నలుపు, నీలము కలిసిన ప్రదేశములకు ప్రజ్ఞాపూర్వకముగా వెళ్ళారు. అక్కడి నుండి అంతులేని నీలపు వెలుగుతో మెరుస్తున్న వినీల ఆకాశంలోకి వెళ్ళారు. ఆయన దేహభావన లేకుండా, పక్షి ఈకలాగా తేలికగా ఉన్న అనుభవము అయినది.  కానీ ఈకలాగ దిక్కు, లక్ష్యము లేకుండా తిరుగక, స్థిరంగా ఉంటూ, ఆత్మ నియంత్రణ పొంది ఉన్నారు. ఆయన ఆ శరీరము (పదార్థము) లేక ప్రజ్ఞ మాత్రమే ఉన్న స్థితిలో చాలా ఆనందాన్ని పొందారు. కొంతసేపటి తరువాత ఆ ప్రజ్ఞాస్థితి నుండి వెనక్కి తిరిగి వచ్చి చైతన్యస్థితికి వచ్చారు. చైతన్యము పునర్జీవితమైనప్పుడు ఆయన circle కేంద్ర బిందువు (మధ్య బిందువు) తో కూడిన వృత్తమును చూశారు. ఆ కేంద్ర బిందువు ద్వారా ఆయన మళ్ళీ సొరంగంలోకి వెళ్ళి, ఈసారి విరుద్ధమైన అనుభూతులతో తిరిగి వచ్చి, తాను శరీరములో ఉన్న అనుభూతి పొందారు. ఆయన మొదటిసారిగా పరిమితమైన శరీరములో ఉండటం ఎంత కష్టమో గమనించారు. ఒక పెద్ద ఏనుగును అగ్గిపెట్టెలో ఇరికించిన అనుభూతి పొందారు. కాసేపటివరకు ఆయన ఉక్కిరి బిక్కిరయ్యారు కాని, నెమ్మదిగా కావలసిన సర్దుబాట్లు జరిగినట్లు కనుగొన్నారు.

అప్పటి నుండి మాస్టర్ ఎమ్.ఎన్. గారు తరచుగా, రాత్రిపూట 2 నుండి 4 గంటల మధ్యలో శరీరమునుండి బయటికి వెళ్ళి, మళ్ళీ ప్రాపంచిక కార్యక్రమములను నిర్వర్తించడానికి బ్రాహ్మీముహూర్త సమయంలో శరీరంలోకి వచ్చేవారు. ఆయన దివ్యప్రణాళికలో భాగంగా సూక్ష్మలోకాలలో ఉండి దైవకార్యములను నిర్వహించే బృందములకు బాగా సన్నిహితులయ్యారు. ఆయన మునుపటి కంటే ఎక్కువగా మౌనంగా ఉండసాగారు. ఆయన పగలు లౌకిక ప్రపంచములోని పనులు, రాత్రిపూట అలౌకిక ప్రపంచపు పనులు చేసేవారు. అలా భగవద్గీతలో కృష్ణపరమాత్ముడు చెప్పినట్లుగా యోగికి పగలు రాత్రిగా, రాత్రి పగలుగా పరిణమిస్తుందన్న భవిష్యవాణి ఆయన విషయంలో నిజమైంది.

ఆయన జూన్ 1936 మరియు ఫిబ్రవరి 1940 మధ్యకాలంలో వీలైనంతవరకు అన్ని యోగ కేంద్రాలను సందర్శించారు.

ఆయన 1939 *'డిసెంబర్ కాల్'*లో ప్రజ్ఞాస్థితిలో ఉండగా భౌతిక స్వాతంత్ర్యమునకు (Physical independence) సంబంధించిన కోర్సులను నిర్వహించారు. భౌతిక స్వాతంత్ర్యమునే దృష్టిలో పెట్టుకుని ప్రేయర్స్ నిర్వహించారు. ఆయన "భౌతిక స్వాతంత్ర్యమునకు మార్గదర్శకులైనవారు ఆత్మకు కూడ మార్గదర్శకులవుతారు" అనే వాక్యాన్ని చెప్పారు. ఆ బృందముల వారు మాస్టరుగారి సూచనను పూర్తిగా అర్థం చేసుకోలేక పోయారు. అప్పటిదాకా అనుయాయులకు భౌతిక శరీర స్వాతంత్ర్యమును

గురించి చెప్పారు. ఆ తరువాత ఆత్మ స్వాతంత్ర్యమునకు దారి చూపారు. మాస్టరుగారి ప్రజ్ఞ ప్రతిజీవికి దారి చూపుతుంది. ప్రతి జీవిలో ఉన్న లౌకికమైన కోరికలు, లౌకిక వాంఛలవైపే దారి చూపుతాయి. లౌకికమైన ఆలోచనల నుండి, ఉద్వేగాల నుండి, లౌకిక సంపదనుండి స్వేచ్ఛ పొందడమే భౌతిక స్వాతంత్ర్యము. మాస్టరుగారు లౌకిక విషయాలు మరియు లౌకిక బంధనాల నుండి ముక్తులు కావటానికి సూక్ష్మంగా దారి చూపుతుంటారు. లౌకిక విషయాల నుండి ముక్తులైనవారు స్వాతంత్ర్యమును పొందగలరు. ఎవరెవరు భౌతిక నియమాలలో ముక్తులవుతారో వారు భౌతిక స్వాతంత్ర్యమును పొందగలరు. ఎవరు భౌతిక స్వాతంత్ర్యమును పొందగలరో, వారు బ్రహ్మమును చేరడానికి కావలసిన మార్గదర్శకత్వం పొందగలరు. దారిచూపే ఆత్మలు ద్విముఖంగా ఉంటాయి. మొదటిది వారికి మరణము నుండి ముక్తి, రెండవది పరమాత్మ లేక బ్రహ్మముతో అనుసంధానము చెందటం. డిసెంబర్ 31, 1939తో *'డిసెంబర్ కాల్'* సమావేశాలు ముగిశాయి. ఆనాటి సాయంత్రం 6 గంటల ప్రార్థనతో సామూహిక సహజీవనం పూర్తయింది. రాత్రి భోజనాల సమయములో మాస్టర్ ఎమ్.ఎన్. గారు తన కుడి కాలు మరియు కుడిచేతిలో ఏదో ప్రత్యేకమైన మార్పు జరుగుతోందని గమనించారు. తనలోని ప్రాణ చైతన్యము కుడికాలి బొటనవ్రేలి నుండి ప్రారంభమై కుడిభాగములోని కీళ్ళద్వారా బహిర్గతమవుతూ ఉందని గ్రహించారు. ఆయన తమ ఈ అనుభూతిని తమ శిష్యుడైన ఆయుర్వేద వైద్యునికి తెలిపారు. ఆ రాత్రి ఆయనకు ఆయుర్వేద మందులనే యిచ్చారు.

1940 జనవరి 1వ తేదీన, నూతన సంవత్సర ఉదయాన్నే మాస్టర్ ఎమ్.ఎన్.గారు తలకు, ఒంటికి, కుడికాలికి నూనె రాయించుకొని, మర్దన చేయించుకొని అభ్యంగన స్నానం చేశారు. ఆయన కుడి కాలిలో నొప్పి లక్షణాలు, బలహీనతను గమనించారు. ఈ విషయాన్ని తనతో ఉన్న అనుయాయులకు చెప్పారు. ఉదయం ప్రార్థనలో ఆయన గట్టిగా ''మూడు రోజులు, మూడు నెలలు, మూడు ఏళ్ళు'' అని చెప్పారు. జనవరి 1 తేదీ రాత్రి సాధకులందరూ ఇళ్ళకు వెళ్ళిపోయే ముందు మాస్టర్ ఎమ్.ఎన్. గారికి వీడ్కోలు చెప్పారు. అప్పుడు ఆయన తనలో తాను అస్పష్టంగా మాట్లాడుతూ వున్నారు. ఆ మాటలు కొంతమందికి 'శౌరి' అని వినిపిస్తే, కొందరికి 'సారీ' అని వినిపించాయి. మాస్టరుగారి ఆరోగ్య పరిస్థితిని గమనించి కొంతమంది ఆ రాత్రి అక్కడే ఉండటానికి నిశ్చయించుకున్నారు. జనవరి 2 వ తేదీన, మాస్టరుగారు కొంతమంది శిష్యులతో తనకు కుడి చేయి పటుత్వము, కుడి కాలి స్పర్శ కూడ తగ్గిందని చెప్పారు. తన మేనల్లుడి ఆరోగ్యస్థితిని గురించి తెలుసుకున్న శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారు ఫిబ్రవరిలో హుటాహుటిగా ఒంగోలుకు వచ్చారు. ప్రకాశంగారు మేనమామ, అంతే కాదు కుటుంబ పెద్దగా వేళ వేళకు మాస్టర్ ఎమ్.ఎన్.గారు యోగిగా అభివృద్ధి చెందుతున్న విషయాలను తెలుసుకొనేవారు. ఆయన తన మేనల్లుడికి మౌన అనుయాయి. తన తమ్ముడు జానకిరామ్ కూడ మాస్టర్ యోగమార్గములో ఉన్నాడని తెలిసి ఎంతో సంతోషపడ్డారు. తమ్ముడు ఎలాగూ మద్రాసులోనే ఉన్నాడు. కాని మేనల్లుడు 170 మైళ్ళ (250 కి.మీ) దూరంలో ఉన్నాడు. అందుకని ప్రకాశంగారు

భారత స్వాతంత్ర్య ఉద్యమములో క్షణం తీరికలేని పనులున్నప్పటికీ, మాస్టర్ ఎమ్.ఎన్. గారితో రెండురోజులు ఉన్నారు. ఆయన ఎమ్.ఎన్.గారి ఆరోగ్యం గురించి విచారించినప్పుడు మాస్టర్ ఎమ్.ఎన్. గారు తన ఆరోగ్య పరిస్థితి గురించి ఉన్నది ఉన్నట్లుగా చెప్పారు. పిల్లలు ఇప్పుడిప్పుడే జీవితంలో స్థిరపడుతున్నారు. పెద్దకొడుకు అప్పుడే చదువు ముగించి బార్ కౌన్సిల్లో తన పేరు నమోదు చేయించుకున్నాడు. ప్రకాశంగారు ఆ అబ్బాయికి మద్రాసు బార్ కౌన్సిల్లో పేరు నమోదు చేయిస్తానని భరోసా ఇచ్చారు. రెండవ కొడుకు కూడా అప్పుడే చదువు పూర్తిచేశాడు. ప్రకాశంగారి చిరునవ్వు మాస్టర్ ఎమ్.ఎన్. గారికి, తన మేనమామ గతంలో తన బాధ్యత తీసుకున్నట్లుగానే ఇప్పుడు తన పిల్లల భవిష్యత్తు, ప్రగతి బాధ్యత కూడా తీసుకుంటారన్న విశ్వాసము కలిగించింది. భారతదేశంలో 'ఎవరికైనా తండ్రి పోయినప్పటికీ ఫరవాలేదు, ప్రేమగా చూసుకొనే మేనమామలుంటే అదే పదివేలు' అని చెబుతూ ఉంటారు. ఈ విషయంలో మాస్టర్ ఎమ్.ఎన్. గారు చాలా అదృష్టవంతులు. ఇద్దరు మేనమామలు ఆయనను దేవుడిలా ఆదుకున్నారు. సాధారణంగా మేనల్లుడు మేనమామతో తండ్రి కంటే చాలా సన్నిహితంగా ఉంటారు. తండ్రి అంటే ప్రేమ, గౌరవం ఉన్నప్పటికీ కొంత దూరంకూడ ఉంటుంది. స్నేహితుడి లాంటి తండ్రి, లేక మేనమామ దొరకటం చాలా అదృష్టం. ఆ ఇద్దరూ లేనివాడు చాలా దురదృష్టవంతుడు.

మాస్టర్ ఎమ్.ఎన్.గారు ఆయనకు తన కృతజ్ఞతలు తెలిపి తమ కార్యక్రమాలను కొనసాగించారు.

ఫిబ్రవరి 24, ఆయన తన మరొక నివాసమైన బాపట్లకు వెళ్ళారు. బాపట్లలో ఆయనకు ఆప్తులైన స్నేహితులు, అనుయాయులు ఉన్నారు. ఆయన తన సహోద్యోగి మరియు సహ సాధకుడైన వెలగపూడి సుబ్బారావును కలిశారు. ఆయన ఇంట్లోనే మూడు పగళ్ళు, మూడు రాత్రులు ఉన్నారు. బాపట్లలోని యోగ సాధకులను కలిశారు. సుబ్బారావుగారి ఇల్లు కూడ వారి ఇల్లులాగే ఉండేది. ఆయనకు ఆ కుటుంబముతో అంతటి ఆత్మీయత ఉండేది. ఆ స్నేహితుడు తనతో సమానంగా మంచి లాయరు మరియు బాపట్ల టౌన్‌లో పేరు ప్రఖ్యాతు లున్నవాడు. మూడు రోజుల తరువాత ఆయన తెనాలి వెళ్ళారు. అక్కడి నుండి కార్యక్రమాల నిమిత్తం మరొక ఊరికి వెళ్ళారు. అక్కడ కూడ ఆయనకు బాగా ఆత్మీయుడైన, సంఘంలో పేరు మోసిన వ్యక్తి శ్రీ వేదాంతం లక్ష్మీనారాయణ అనే మరొక స్నేహితుడు ఉన్నాడు. ఆయన కూడ మాస్టర్ ఎమ్.ఎన్.గారి అనుయాయి. మాస్టర్ ఎమ్.ఎన్.గారు స్నేహితుడి చేతికి ఉన్న గడియారాన్ని తీసుకొని తన చేతికి కట్టుకుని, 'ఒంగోలుకు వచ్చి నీ వాచీ తీసుకెళ్ళు' అని చెప్పి నవ్వారు. ఆ స్నేహితుడు కూడా నవ్వుతూ 'ఎలాగూ నేను మార్చి 11వ తేదీ ఒంగోలుకు రావాలి కదా! అప్పుడు నేను గుర్తు పెట్టుకొని నా గడియారాన్ని తీసుకుంటాను' అన్నాడు.

అందుకు మాస్టరుగారు "రావటం మరచిపోవద్దు. తప్పకుండా అక్కడికి వచ్చి నీ వాచీ తీసుకో" అన్నారు.

ఆ తరువాత మన్నవ హనుమంతరావు అనే మరొక సన్నిహితుడైన స్నేహితుడు వచ్చాడు. ఆయన 'చేతావని' అన్న

పుస్తకము మరియు కలకత్తా నుండి తెచ్చిన మంచి చెప్పుల జత తెచ్చి ఇచ్చాడు. ఆయన ఆ చెప్పులను మాస్టరుగారి పాదములకు తొడిగాడు (ఆ చెప్పులు 555 అని చెప్పబడతాయి).

మాస్టరుగారు లక్ష్మీనారాయణ మరియు హనుమంతరావు గార్లతో "మీకు నేను యివ్వగలిగినదంతా ఇచ్చాను. ఇక చివరగా నేను మీకు ఇవ్వవలసినది భౌతిక స్వాతంత్ర్యమునకు సంబంధించిన కోర్సు. అంతకంటే ఇంకేమీ అవసరము లేదు. రిజల్ట్స్ కోసం ఎదురు చూడాలి".

27 ఫిబ్రవరిన మాస్టరుగారు ఒంగోలుకు తిరిగి వచ్చారు. ఆయన దగ్గర సుబ్బయ్య అనే సెక్రటరీ చాలా ఏళ్ళుగా పనిచేస్తున్నాడు. వారిద్దరి మధ్య చాలా ఆత్మీయత ఉండేది. మాస్టరుగారు సుబ్బయ్య, వారి కుటుంబ సభ్యులను గురించి చాలా శ్రద్ధ వహించేవారు. ఆ రోజు మాస్టరుగారు సుబ్బయ్య యోగక్షేమాలను విచారిస్తుండగా సుబ్బయ్య, 'ఈ మధ్య నేను తరచు ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నాను. మీకు వీలైతే దయచేసి నా నెల జీతాన్ని పెంచండి' అన్నాడు.

మాస్టరుగారు సుబ్బయ్యను ఒకసారి అలా చూచి నవ్వుతూ "మనిద్దరం చాలాకాలం నుండి కలిసి ఉన్నాము. నీ ఆర్థిక ఇబ్బందులను గురించి చింతించకు. దయచేసి మార్చి 11 వ తేదీ వరకు వేచి ఉండు" అన్నారు.

అలా చెప్పి మాస్టరుగారు ఇంటిలోనికి వచ్చేశారు. ఆ మాటలు విన్న సుబ్బయ్యకు చాలా ఆశ్చర్యం వేసింది. 'మార్చి 11వ

తేది అనే ఎందుకు చెప్పారు. మార్చి 1 అని ఎందుకు చెప్పలేదు. మార్చి 1 వ తేదీకి ఇంకా నాలుగు రోజులే ఉంది. మార్చి 11 వ తేదీ అంటే ఇంకా పదిహేను రోజులు ఉన్నాయి. ఏది ఏమైనా ఆయనకు అన్నీ తెలుసులే' అనుకున్నాడు.

1940 మార్చి 2 వ తేదీన మాస్టరుగారు ఆఖరిసారి బాపట్లకు వెళ్ళారు. అక్కడ సుబ్బారావుగారితో ఒక రాత్రి ఉండి 3వ తేదీకి తిరిగి వచ్చారు.

మార్చి 4 నుండి దేహత్యాగము చేసి దివ్యలోకాలను చేరేదాకా ప్రతి రాత్రి ఆయన పాండవులకు తాతగారైన భీష్ముడు చెప్పిన ప్రార్థనా శ్లోకాలను పఠనం చేసేవారు. ఆ ప్రార్థనాశ్లోకాలు ఆంధ్రప్రదేశములో చాలా ప్రాచుర్యం పొందాయి. ఈ నాటికి కూడ అక్కడి సంప్రదాయవాదులు ఆ శ్లోకాలను కంఠస్థం చేసి ప్రతి రాత్రి పడుకునే ముందు మననం చేస్తూ ఉంటారు. (ఆ శ్లోకాలు పురాణ పురుషునికి సంబంధించినవి. వారికి తమ లోపల, చుట్టుపక్కల విశ్వపురుషుని దర్శనము కలుగుతుంది. భీష్ముడు దేహత్యాగం చేసే ముందుగా ఆయన అంపశయ్య ప్రక్కన శ్రీకృష్ణ పరమాత్ముడు నిలబడ్డాడు. భీష్ముడు తాను వెళ్ళిపోవటానికి శ్రీకృష్ణుని అనుమతి కోరాడు. ఆ సందర్భములో ఆయన శ్రీకృష్ణుని స్తుతించాడు. దానికి సంబంధించిన శ్లోకాలు తెలుగు భాగవతములో ఉన్నవి. వాటిని కంఠస్థంచేసి, భక్తి శ్రద్ధలతో పఠించాలి.)

మార్చి 4 నుండి మాస్టర్ ఎమ్.ఎన్. గారు భక్తిలో పరాకాష్ఠకు చేర్చే ఆ శ్లోకాలను పఠించేవారు.

మార్చి 10 వ తేదీ మద్రాసు పట్టణంలో ఉన్న ఆయన పెద్దకొడుకు నుండి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరములో ఆయన తాను చెన్నై బార్ కౌన్సిల్‌లో అడ్వకేటుగా నమోదు అయ్యానని, ఇప్పుడు ఆయన అడ్వకేటుగా ప్రాక్టీసు చేయవచ్చునని, మరుసటి రోజు తండ్రి ఆశీర్వాదం తీసుకోవడంకోసం ఒంగోలు వస్తున్నానని వ్రాశాడు. మాస్టర్ ఎమ్.ఎన్. గారు ఎంతో సంతోషపడి ఆ సంతోషాన్ని తన భార్యతో పంచుకుంటూ "నీ కొడుకు ఇప్పుడు వాళ్ళ నాన్నలాగే అడ్వకేటు అయ్యాడు. ఇప్పుడు ఇంటి బాధ్యతలలో పాలుపంచుకుంటాడు. ఇకపై నీవు తల్లిగా గర్వించవచ్చు" అన్నారు.

మార్చి 10 వ తేదీ ఆదివారం కావటం చేత మాస్టర్ ఎమ్.ఎన్. గారు ఇంట్లోనే ఉండి భార్య రంగనాయకమ్మగారు, నాలుగవ కొడుకు మధుసూదనరావు మరియు మూడవ కూతురు శారదతో బాటు కాలక్షేపం చేశారు. వాళ్ళింట్లో కొండాపి చిలకమ్మ అనే వంటావిడ, కొండాపి సుబ్బయ్య అనే సెక్రటరీ ఉండేవారు. మాస్టరుగారింట్లో బాబూ సాహేబ్ అనే ముస్లిం నౌకరు కూడా ఉండేవాడు. ఆ వంటావిడ, సెక్రటరీ, నౌకరు కూడా చాలా ఏళ్ళుగా ఆ ఇంట్లో పనిచేస్తూ కుటుంబ సభ్యులుగా ఉండేవారు. ఆ వంటావిడ మాస్టరుగారు యోగజీవనంలో అడుగు పెట్టినప్పటి నుండి దాదాపు 20 ఏళ్ళుగా మాస్టరుగారి భార్యకు ఇంటిపనిలో, వంటపనిలో, వడ్డనలో సహాయం చేస్తూ అతిథులుగా వచ్చే బృంద సభ్యులకు బాగా సన్నిహితం అయింది. ఆ సెక్రటరీ కూడ చాలా నమ్మకమైన సేవకుడు. ఆయనే క్లయింట్స్‌తో సంప్రదింపులు

మరియు కోర్టులో వాయిదాలు తీసుకోవడము లాంటివి చేసేవాడు. ఆయన మాస్టరుగారికి వృత్తి వ్యవహారాలలో సహకరించేవాడు. సేవకుడు ఇంటిపనులలో సహాయం చేస్తూ, రోజంతా పనిచేసి అలసిపోయిన మాస్టరుగారికి నిద్రపోయే ముందు పాదాలకు నూనె రాసి మర్దన చేసేవాడు. మార్చి 10 తేదీ మాస్టరుగారు వాళ్ళందరితో సంతోషంగా గడిపారు. ఆ సంతోష సమయంలో చిన్న కూతురు, చిన్న కొడుకు కూడ అక్కడే ఉన్నారు. వాళ్ళు ఒంగోలులోని స్కూల్లో చదువుకుంటున్నారు. మాస్టరుగారి పెద్దకొడుకు శ్రీనివాసరావు అడ్వకేటు అయ్యాడు. ఆయన ఎమ్.ఏ. మరియు ఎమ్.ఎల్ (మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్, మాస్టర్ ఆఫ్ లా). ఆయన తండ్రిలాగే చాలా తెలివైన విద్యార్థి. టంగుటూరి ప్రకాశంగారు ముఖ్యమంత్రి అయ్యాక, ఆయనకు మొదటి సెక్రటరీగా పనిచేశారు. రాష్ట్ర లెజిస్లేటివ్ అసెంబ్లీకి కార్యదర్శిగా పనిచేశారు. ఆ సమయంలో రెండవ కొడుకు శేషుమాధవరావు మద్రాసులో ఇంజనీరింగ్ చదువుతూ ఉండేవాడు. ఆ కారణంగా ఆయన ఇంట్లో లేడు. ఆ తరువాత ఆయన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖలో ముఖ్య అధికారిగా పనిచేస్తు ఉండేవారు. మూడవ కొడుకు అప్పారావు కూడ చదువు నిమిత్తంగా మద్రాసులోనే ఉండిపోయాడు. నాలుగవ కొడుకు మధుసూదనరావు ఇంకా హైస్కూలు చదువులో ఉండటంవల్ల, ఆ రోజు ఇంట్లోనే ఉన్నాడు. తరువాత ఆయన విజయవాడలోని యోగా స్కూలులో అధికారిగా పనిచేశాడు. మాస్టరుగారి మొదటి కూతురు శ్రీమతి లక్ష్మీనరసమ్మ అప్పటికే పెళ్ళి అయిపోయి కర్నూలులో అత్తగారింట్లో ఉన్నది. రెండవ అమ్మాయి సావిత్రికి

కూడ పెళ్ళి అయింది. మూడవ అమ్మాయి శారద అక్కడే చదువుతూ వాళ్ళతోనే ఉంది.

మార్చి 10 తేదీ విశ్రాంతి మరియు సంతోషముతో గడిపిన దినమైనది. అదియును గాక పెద్ద కుమారుడు అడ్వకేటుగా స్థిరపడ్డందుకు పరమానందముతో గడిపి, రాత్రి పడుకోబోయే ముందు భీష్మ స్తుతితో ఆ దినము గడిచింది.

**11 మార్చి 1940 :**

ఆ రోజు మాస్టర్ ఎమ్.ఎన్.గారు తాము మామూలుగా నిద్రలేచే సమయంకన్నా ముందుగా లేచారు. పరిపూర్ణ అభ్యంగన స్నానం ఆచరించారు. సరిక్రొత్త పట్టుబట్టలు ధరించి వాటితో పాటు సిల్కు తలపాగా కూడా ధరించి ఉదయం ప్రార్థనను పరిసమాప్తి గావించారు. ఆ రోజు ఆయన ప్రత్యేకమైన ఆనందం మరియు వెలుగుతో ఉన్నట్టు ప్రార్థనకు వచ్చినవాళ్ళు గమనించారు. ఆ రోజే ఆయన ఇదివరకు తన శిష్యుడు యిచ్చిన 555 బ్రాండు క్రొత్త చెప్పులు కూడ ధరించారు. (555 బ్రాండ్ చెప్పులు ఆ రోజుల్లో కలకత్తాలో ప్రత్యేకంగా చేయబడేవి) వారి శ్రీమతి "ఈ రోజు మీరు ఎంతో వెలుగుతోను, ఆనందముతోను ఉన్నట్లు కనబడుతూ ఉంది. ఏమన్నా విశేషమా ?" అని ప్రశ్నించారు. మాస్టరుగారు చిరునవ్వుతో 'అవును. నిజంగా ప్రత్యేక దినమే' అని సమాధానమిచ్చారు. తన ఇంట్లో ఉన్న అఫీసుగదిలో కొంత సమయం గడిపి, భోజనం చేసి కోర్టుకు వెళ్ళారు. (ఆయన

సాధారణంగా గుఱ్ఱపు బండి మీద కోర్టుకు వెళ్ళేవారు. దానిని హిందీ భాషలో 'బగ్గీ' అని పలుకుతారు). కోర్టులో ఎంతో చిరునవ్వుతో, ఆనందంతో తనకు తెలిసిన ప్రతి న్యాయవాదిని పలకరించారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు పనిచేసుకున్న తరువాత ఆయనకు రెండు గంటల ప్రాంతంలో మగతగా నిద్ర పట్టింది.

సరిగ్గా మధ్యాహ్నం 3.30 గంటలకు ఉలిక్కిపడి లేచారు. చేతి గడియారం చూసుకొని ఎడమచేతి నాడిని పరీక్షించుకుని తనలో తను ఏదో గొణుక్కుంటూ వడివడిగా తాను వెళ్ళవలసిన గుఱ్ఱపు బండి వైపు బయలుదేరారు. తోటి న్యాయవాదులు 'ఏమిటంత తొందర? ఇంత త్వరగా బయలుదేరుతున్నారు?' అని ప్రశ్నించారు. మాస్టరుగారు 'ఈ రోజు నాకు వేరేపని ఉన్నది' అని వారిని సమాధానపరచి బయలుదేరారు. ఇంటికి వస్తుండగా దారిలో తనకు కనపడిన, తెలిసినవారి నందరినీ వారి వారి క్షేమసమాచారాలు కనుక్కుంటూ ఇంటికి చేరారు. సరిగ్గా 3.55 నిమిషాలకు ఇంటికి చేరి త్వరగా బండి దిగి ఇంటిలోకి ప్రవేశిస్తూ తలపాగాను కుర్చీలోకి విసిరేసి, నల్లకోటు మరియు చొక్కాను ఆ గదిలోనే ఉన్న కొక్కెమునకు తగిలించారు. ఇంటిలోని మెట్లదారి మూల ఆ రోజు మధ్యాహ్నం ఆయన తీసుకొన్న ఆహారమంతా వాంతి చేసుకున్నారు. ఇదంతా గమనించిన వారి శ్రీమతి 'వైద్యునికి కబురు చేద్దామా' అని ప్రశ్నించారు. మొదట వద్దన్న మాస్టరుగారు తరువాత 'నీకు కావాలంటే కబురు చెయ్యి' అని తాను నిర్వహించుకుంటున్న ప్రార్థనా మందిరములోకి ప్రవేశించి

తివాచీ పరచి దానిమీద కూర్చున్నారు. తనకు అనునిత్యం సేవ చేసే సేవకుడు (బాబూ సాహెబ్) వచ్చి చూశాడు. మాస్టరుగారు తన కుడి కాలు బొటనవ్రేలిని లాగమని ఆదేశించారు. అతనలా చేయబొయే లోపల మాస్టరుగారి శ్రీమతి వెంటనే బయలుదేరి వైద్యుని తీసుకురమ్మని ఆజ్ఞాపించారు. అతడు బయలుదేరాడు. మాస్టరుగారి శ్రీమతి వారికి నిత్యం ఇచ్చే కోల్డ్ కాఫీ పట్టుకొచ్చారు. మాస్టరుగారు ఆ కాఫీగ్లాసు తీసుకుని 'ఇది చాలా చల్లగా ఉంది. దీనిని కొంచెం వెచ్చబెట్టి తీసుకురా' అని అన్నారు. ఆవిడ వంటగదిలోకి వెళ్ళి తిరిగి వచ్చే లోపల మాస్టరుగారి శరీరం నేలమీదకి ఒరిగిపోతున్నట్లు గమనించారు. వెంటనే ఆవిడ కాఫీగ్లాసు ప్రక్కన పెట్టి ఆయన వద్దకు వెళ్ళి తన ఒడిలో తల పెట్టుకునే ఏర్పాటు చేశారు. మాస్టరుగారు ఆవిడ ఒడిలో తలపెట్టిన వెంటనే దేహత్యాగం చేశారు. ఆవిడ దిగ్భ్రమకు లోనయ్యారు.

అదే సమయానికి మాస్టరుగారి తోటి న్యాయవాది మరియు ఆయన శిష్యుడు అయిన శ్రీ వేదాంతం లక్ష్మీ నారాయణగారు వచ్చారు. అంతకు ముందే ఆయన 11 మార్చి నాడు ఆయన వస్తానని మాట యిచ్చిన కారణంగా వచ్చారు కాని ఆలస్యమయింది. మాస్టరుగారు దేహత్యాగం చేసిన సంఘటనను ప్రత్యక్షంగా, ప్రథమంగా గమనించింది వీరే. మరొక శిష్యుడు (హనుమంతరావు) అనే వ్యక్తికి స్వప్నదర్శనమై ఆ స్వప్నంలో ఆతనికి మాస్టరుగారి పార్థివదేహం కనబడింది. ఆయన కూడా ఎంతో వ్యథతో కొన్ని గంటల తరువాత ఒంగోలు చేరుకుని తెలుసుకున్నాడు.

ఆ రోజున మాస్టరుగారి పార్థివ శరీరంతోపాటు ఉన్నవారు వారి శ్రీమతి, చిన్న కొడుకు, చిన్న కూతురు మరియు వారి ఆఫీసు మేనేజరు సుబ్బయ్య, వంటమనిషి చిలకమ్మ, బాబూ సాహెబ్. ఆ రాత్రికి చెన్నైనగరం నుండి వారి ముగ్గురు కుమారులు, ఆ మరునాడు వారి కుమార్తెలు చేరుకున్నారు. ముఖ్యమైన ఇతర శిష్యులందరూ కూడా మరునాటికి చేరుకున్నారు. మాస్టరుగారు చెప్పిన తారీఖు (11.3.1940) మరచిపోయినందుకు ఎంతో చింతించారు. సాధారణంగా ప్రతి మహాత్ముని విషయంలో శిష్యుడు మరచిపోవటం సహజమే కదా! ఇదీ కాక మరి కొంతమంది మాస్టరుగారు అంతకు ముందు చూచాయగా చేసిన సంభాషణల అంతరార్థం గ్రహింపలేక పోయామని బాధపడ్డారు. సాధారణంగా ఇవన్నీ లోకంలో జరిగే విషయాలు అయినప్పటికీ ముఖ్యఘట్టాలు జీవితంలో జారిపోవటం సహజమే. ఘట్టం జరిగిన తరువాత మాట్లాడుకోవటము సహజమే మరియు వ్యర్థమే. సామాన్య ప్రజలలో జరిగిపోయిన ఘట్టాల గురించి వ్యర్థ ప్రసంగాలు చేసుకోవటం కూడా పరిపాటి.

# 11

# అలౌకికత్వము / అతీంద్రియత్వము
## (Transcendence)

ఈ నవీనకాలంలో మాస్టర్ ఎమ్.ఎన్. గారి అతీంద్రియత్వం ఒక అందమైన అనుభవము. ఒక యోగి మరణాన్ని అధిగమించి అలా వెళ్ళిపోతాడు కాని చచ్చిపోడు అని మన పురాణాలు ఘోషిస్తున్నాయి. అజ్ఞానులకు మాత్రమే మరణం ఉంటుంది. స్వేచ్ఛా జీవులకు మరణం ఉండదు. ముక్తజీవులకు మాత్రమే శరీరంలో నుండి బయటికి వెళ్ళేదారి తెలుస్తుంది. ఇది అజ్ఞానులకు తెలియదు. అజ్ఞానులకు మరణం కష్టతరంగా ఉంటుంది. ఆ నొప్పి ఎలా ఉంటుందంటే వెయ్యి మండ్రగబ్బలు ఒక్కసారి కుట్టినట్లుగా ఉంటుంది. ఒక ఇంటికి ఆకస్మికంగా నిప్పంటుకుందనుకోండి, ఆ ఇంటిలో ఉన్న మనిషి, ఆ క్షణంలో అతనికి బయటికి వెళ్ళేదారి తెలియక అటూ ఇటూ పరుగెత్తుతూ ఉంటాడు. ఆయన పెట్టే గావు కేకలు వినిపించవు. అది అరణ్యరోదన అవుతుంది. అందరూ చుట్టూ కూర్చొని ఆ చనిపోయేవానిని అసహాయంగా చూస్తూ ఉంటారు. ఆ చనిపోయేవాడు కూడా ఏదైనా సహాయం దొరుకుతుందేమో అని దీనంగా, నిరాశగా చూస్తూ ఉంటాడు.

అదెలా ఉంటుందంటే బలవంతంగా మెడకు తాడు వేసి లాగినట్లుగా ఉంటుంది. అతడు ఊపిరి ఆడక కొట్టుమిట్టాడుతూ ఉంటాడు. ఆ గొంతులోనుండి ద్రవములు, నురుగు కారుతూ ప్రాణవాయువుకు అడ్డంకి అవుతుంది. అతను పరిసరాలతో కాని, శరీరముతో కాని, ఊపిరితో కాని విడివడలేక విలవిలలాడుతాడు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుంటే ప్రాణభయం కమ్మేస్తుంది. వస్తువులన్నీ మసక మసకగా కనిపిస్తాయి. ఆయనకున్న జ్ఞానం మాయమవుతుంది. మననం చేసే మంత్రము జ్ఞాపకం రాదు. చుట్టూ ఉన్నవారు 'నారాయణ', 'శ్రీరామ', 'ఓం నమశ్శివాయ' మొదలైనవి చెబుతున్నప్పుడు అతడు వినలేడు, చెప్పలేడు. ఎందుకంటే ప్రాణం పోతుందన్న భయం. స్పృహ తప్పిపోతాడు. ఈనాడు చాలామంది శరీరంతో విడివడడానికి చేతకాక స్పృహ తప్పి పోతున్నారు. వాళ్ళకు కూరగాయలకు తేడాలేదు. వారిని క్యాబేజిగ చెబుతారు. అలాంటి సందర్భాలలో ప్రజ్ఞ వారిలో ఉండదు. ప్రజ్ఞాసూత్రము శరీరమునుండి దూరం కావాలని ప్రయత్నిస్తే, జీవనసూత్రం శరీరమునకు సన్నిహితంగా ఉంటూ పట్టుకోమని చూస్తుంది. అలాంటి ఎటూ కాని స్థితిలో మనిషి చాలాకాలం ఉంటాడు. అలాంటి సందిగ్ధ స్థితి చనిపోయేవారికి మాత్రమే కాక చుట్టూ ఉన్న బంధుమిత్రులకు కూడ బాధాకరంగా ఉంటుంది. బంధుమిత్రులకు అక్కడ తమకు ఇష్టమైన మనిషి ఉన్నప్పటికీ ఎలాంటి కదలిక, మాటామంతి ఉండదు (జీవచ్ఛవంలా) కానీ ప్రాణము ఉన్నంత వరకూ అతనిని కాపాడుకోవటానికి ఆస్పత్రులలో ఉంచి, అయ్యే ఖర్చులు భరించాలి. ఆ శరీరమును, అందులోని ప్రాణమును ద్రవ

పదార్థములతో పోషించాలి. కానీ ఆ మనిషితో ఏ విధంగా కూడా వ్యవహరించలేము. అదొక బాధాకర స్థితి. అన్ని పనులు జరుగుతూ ఉంటాయి కాని ఆ మనిషికి ఎలాంటి సంబంధమూ ఉండదు. అది ఒక దుఃఖకరమైన సన్నివేశము, వైద్యులు ఆ జీవనసూత్రాన్ని తెంపలేరు, అలా తెంపడానికి బంధుమిత్రులు కూడ ససేమిరా ఒప్పుకోరు, ఎందుకంటే ఆ మనిషి ప్రజ్ఞను పొంది ఆరోగ్యవంతుడై మళ్ళీ తిరిగి వస్తాడని ఆశతో ఉంటారు. అలా పునః చైతన్యం పొందే అవకాశము ఎక్కడో కోటికొక్కడికి మాత్రమే లభిస్తుంది. ప్రాచ్య, పాశ్చాత్యదేశాలలో ఇలాంటి కేసులతో ఆస్పత్రులలో ఎన్నో పడకలు నిండి ఉంటున్నాయి. ఇలా జరగడానికి కారణం, ఎలా దేహము వదలి వెళ్ళిపోవాలన్న జ్ఞానం లేకపోవడమే.

ప్రతి ఒక్కరూ మరణమునకు సంబంధించిన జ్ఞానాన్ని పొందడం అవసరమని మన పురాణాలన్నీ ఏక కంఠముతో ఘోషించాయి. భగవద్గీత, భాగవతములోని మొదటి అధ్యాయాలలో చాలా సూచనలు ఇచ్చారు. పతంజలి యోగ సూత్రములు ఈ ప్రక్రియను వివరిస్తాయి. కఠోపనిషత్తు ఈ మరణ రహస్యాన్ని తెలుపుతుంది. మార్కండేయుని కథ, సావిత్రీ ఉపాఖ్యానములలో శరీరత్యాగము యొక్క ప్రక్రియను, శరీరమునుండి ఎలా బయటికి వెళ్ళాలో తెలుపుతున్నవి.

పరమగురువులు 'మరణమంటే చచ్చిపోవడం కాదు' అని చెప్పారు. తెలిసినవారికి మరణమంటే శరీరములో నుండి వెళ్ళిపోవడమే. అది ఇంట్లోనుండి బయటికి వెళ్ళటం లాంటిది.

దానిని మనం శరీరముతో ఉన్నప్పుడు ప్రజ్ఞాపూర్వకంగా అభ్యాసం చేయాలి, మృత్యుదేవత పిలవడానికి వచ్చినప్పుడు గౌరవంగా వెళ్ళిపోవాలి. ఈ ప్రక్రియ తెలిసిన జ్ఞానులకు మృత్యువు దూరదేశపు లోకాలనుండి వచ్చి వెలుగు ప్రపంచములోకి తీసుకువెళ్ళే దేవదూత. ప్రతిరాత్రి వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉండాలి. నిజానికి నిద్రంటే వెళ్ళిపోవడం, నిద్రలేవడం అంటే మళ్ళీ రావటమే. నిజానికి చాలామంది యోగసాధన నిద్రకు ఉపక్రమించేందుకు ముందుగా, నిద్ర లేవగానే అభ్యాసము చేస్తారు. ప్రతి రాత్రి పడుకున్నప్పుడు శరీరంలోనుండి ప్రజ్ఞతో జరిగే నిర్గమనము ఒక సాధన జరిగినట్లే. శరీరంలోనికి తిరిగిరావటం అన్న ప్రక్రియ ఈ క్రింది విధంగా జరుగుతుంది.

1. నమ్మిన గురువును ప్రార్థించి పంచేంద్రియాలతో కూడిన (తల, మొండెము, కాళ్ళు, చేతులు) శరీరమును తూర్పు – పడమరగా లేదా ఉత్తర – దక్షిణాలుగా ఉంచి పడుకోవాలి.

2. పంచభూతాత్మకమైన ఈ శరీరము ఈ విశ్వానికి చెందిన బృహత్ పంచభూతముల ద్వారా పునర్ నవీకరణ కావాలనే సూచనను మన శరీరానికి అందించాలి.

3. అప్పుడు పంచేంద్రియాలు, మనసు విశ్రాంతి తీసుకొన నివ్వాలి. ఎందుకంటే ఆ సమయంలో వాటికి ఏ పనీ ఉండదు.

4. రాత్రంతా లౌకిక జగత్తుతో సంబంధం ఉండకపోవటం చేత, లౌకిక ఆలోచనల వలన ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. అవి మళ్ళీ సూర్యోదయంతోనే ప్రారంభమవుతాయి.

5. అప్పుడు అతడు ఆత్మ మరియు బుద్ధిగా మిగులుతాడు.

6. ఆ తరువాత అతనికి నిద్రలో తన ప్రపంచ అస్తిత్వమును కూడ మరచిపోతాడు. బుద్ధి సహాయం చేత విశ్వాత్మతో లేదా విరాట్ పురుషునితో లేదా దివ్య పురుషునితో లేదా విష్ణువుతో లేదా ఆదాము కాడ్మన్ అనే దివ్య పురుషునితో అనుసంధానం చెంది ఉంటాడు. ఆ దివ్యపురుషుడే నిజమైనవాడు. దానికి ప్రతీకయే ప్రత్యగాత్మ. ఆ రెండింటినీ బుద్ధి కలుపుతుంది. ఇలా అర్థం చేసుకుంటే నీవు విశ్వాత్మతో సమగ్రత్వం పొందగలవు. నీవు 'అది నేను' అన్న దానిని సంస్కృతములో 'సోహం' మంత్రముగా చెప్పబడింది. అంటే 'సః' అంటే 'అతడు', 'అహం' అంటే 'నేను.'

ఎవరైనా నిరంతరం ఈ ప్రక్రియను సాధన చేస్తూ ఉంటే ప్రాణస్పందన సహాయంతో 'ఆజ్ఞ'లో ఉన్న ఒక ద్వారము నుండి నిర్గమించి 'శరీరమునుండి వేరుపడిన' అస్తిత్వము యొక్క అనుభూతి చెందగలరు. సాధకునిలో యోగసాధన జరిగినకొలది పరమగురువులకు చెందిన ఈథరిక్ స్థాయిలో ఉన్న ఆశ్రమాలలోనికి లేదా వెలుగు కేంద్రాలలోనికి లేదా వెలుగు సమావేశములలోనికి తమకు తెలియకనే ప్రవేశించగలరు లేదా ధ్యానము ద్వారా సమాధి స్థితికి చేరుకోగలరు.

ప్రతి రోజూ నిద్రలేవగానే 'అది నేను' (ఆత్మ – బుద్ధి) అన్న స్థితి నుండి మనోస్థితి (బుద్ధి – మనస్సు)కి రావాలి. ఆ తరువాత నెమ్మదిగా పంచేంద్రియాలను, కీళ్ళు, శరీరమును జాగృతం చేసి ఆ తరువాత పక్కపై నుండి లేవాలి.

నిజానికి నిద్రా సమయంలో ఎన్నోసార్లు జీవి శరీరంలో నుండి బయటికి వచ్చి స్వప్న స్థితిని అనుభవిస్తాడు. మానవుడు నిద్రాస్థితిలో రక్తమాంసములతో కూడిన శరీరము నుండి బయటికి వచ్చి స్వప్న ప్రపంచములో ఉంటాడన్నది ఖచ్చితం. కాని స్వప్నస్థితిలో ప్రజ్ఞాపూర్వకమైన, క్రమబద్ధమైన చలనం ఉండదు. కాని యోగసాధన ద్వారా ప్రజ్ఞాపూర్వకమైన, క్రమబద్ధమైన చలనం స్వప్నస్థితిలో ఉంటుంది. జన్మద్వారా శరీరములోనికి ప్రవేశించిన జీవి మరణించేదాకా తప్పనిసరిగా శరీరములోనే ఉండాలన్న నియమం లేదు. ప్రకృతి సహాయంతో, రాత్రివేళల జీవి స్వేచ్ఛగా బయటికి వెళ్ళవచ్చు. శరీరమునకు అతీతమైన కొన్ని అనుభూతులు కలలుగా రావచ్చు. కాని చాలాసార్లు అవి మనకు గుర్తు ఉండవు. ఈ భౌతిక ప్రపంచములోనే సూక్ష్మ ప్రపంచముంది. అందులోకి ప్రజ్ఞాపూర్వకంగానే వెళ్ళవచ్చు. అది వెలుగు ప్రపంచం.

ఎవరైనా ఒక మనిషి ఇంట్లో ఉన్నాడంటే, అతను రోజూ ఇంటి నుండి బయటికి వెళ్ళకుండా, అలాగే బయటి నుండి ఇంట్లోకి రాకుండా ఉండగలడా? మానవశరీరం కూడా ఇల్లే. అంటే వాసస్థానం. ఒక జీవి అందులో ఉండి, విశ్రాంతి తీసుకుంటూ, పని చేసుకుంటూ ఉంటాడు. అలాగే బయటికి కూడా వెళ్తూ ఉంటాడు. ఇల్లు ఒక చెరసాల కాదు. ఎప్పుడు ఎవరు పనిమీద బయటికి వెళ్తారో ఎవరూ ఆపలేరు. ఇంటికి లోపలకు, బయటకు వెళ్ళటానికి ద్వారము ఉన్నట్లే మానవ శరీరానికి ప్రవేశ, నిర్గమన ద్వారం ఉంటుంది. దానినే 'సింహద్వారము' అంటారు.

ఆ సింహద్వారము 'ఆజ్ఞ'లో ఉంటుంది. మన పూర్వీకులకు ప్రవేశ నిర్గమనాలు తెలుసు. ఈ జ్ఞానమునకే అగ్రతాంబూలం యివ్వబడింది. ఇక మిగిలిన జ్ఞానమంతా తరువాతనే. అందుకే యోగవిద్య. ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ అందుకు సంబంధించిన సోపానాలు. భగవద్గీతలోని ఆరు మరియు ఎనిమిదవ అధ్యాయములలో ఈ విద్యను గురించే చెప్పబడింది. భాగవతము కూడ ఈ సిద్ధాంతము ఆధారంగానే రచింపబడింది. పరీక్షిత్తు ప్రజ్ఞాపూర్వకంగానే వెళ్ళిపోయాడు. పాండవులు కూడ అలాగే వెళ్లిపోయారు. ధృతరాష్ట్రుడు మరియు గాంధారి కూడా తెలిసే దేహాన్ని వదలి వెళ్ళారు. కృష్ణుడు మరియు బలరాముడు కూడ ప్రజ్ఞాపూర్వకంగానే వెళ్ళిపోయారని చెప్పనవసరంలేదు. అలా వారు 'శరీరం వదలి వెళ్ళటాన్ని' గురించి మన పురాణాలలో వివరంగా తెలుపబడింది.

ప్రాచీన కాలంలో ఈ లౌకిక ప్రపంచములోని అన్ని బాధ్యతలను పరిపూర్తి చేసిన తరువాత దాదాపు అరవై ఏళ్ళ స్త్రీపురుష లిద్దరూ వానప్రస్థాశ్రమం స్వీకరించేవారు. ఆ వానప్రస్థంలో వారు భగవంతుని ధ్యానంలో అనుసంధానం చెంది క్రమంగా ఆహారము, నీటిని తగ్గించుకునేవారు. వారు ప్రాణాయామం చేస్తూ ఎక్కువ గాలినే సేవిస్తూ, భగవంతునితో అనుసంధానం చెంది సులభంగా దేహత్యాగం చేసేవారు. కాని ఈనాడు చాలామంది వానప్రస్థం పేరిట వృద్ధాశ్రమాలలో ఉంటున్నారు. ఇది హాస్యాస్పదంగా ఉంటుంది. వారు అక్కడ

టి.వి. ద్వారా అన్ని ఛానల్స్‌లో లౌకిక ప్రక్రియలన్నిటకీ దగ్గరగా ఉంటున్నారు. వారికి మంచి ఆహారము, వైద్య సదుపాయములు, వైద్య ఖర్చులు అంతేకాక ఎయిర్ కండిషన్డ్ రూములు, అన్నీ తమ దగ్గరకే వచ్చే సర్వీస్ అపార్ట్‌మెంట్– ఇలా అన్నీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. తమ వారితో దగ్గరగా ఉండటానికి సెల్ ఫోన్‌లు కూడా ఉండి రోజూ మూడుపూటలా మాట్లాడుతున్నారు. ఇలాంటివన్నీ ఉంటే అది వానప్రస్థం కాదు. వానప్రస్థమంటే లౌకిక మరియు అలౌకిక ప్రపంచానికి మధ్యేమార్గమైన ప్రగతి ప్రయాణమునకు సంబంధించినది. ఈనాటి వానప్రస్థం గురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంత బాగుంటుంది.


తెలిసి శరీరములో నుండి వెళ్ళిపోవటం కేవలం మానవులకు మాత్రమే సాధ్యం. మానవులు తమదైన ప్రజ్ఞ కలవారు. దానిని చేసి చూపగల యోగ్యత ఉంది. వారి శరీరములకు వెలుగు శరీరములను నిర్మించుకోగల యోగ్యత ఉంటుంది. మాస్టర్ సి.వి.వి.గారు దీనిని చేసి చూపారు. మాస్టర్ ఎమ్.ఎన్.గారు కూడ దీనిని చేసి చూపారు. యోగులైన లహరి మహాశయులు, యుక్తేశ్వర్ గిరి, షిరిడీ సాయిబాబా, రామకృష్ణ పరమహంస, వివేకానంద, రమణమహర్షి, అరవిందులు ఈనాటి కాలానికి ఉత్తమ ఉదాహరణలు. ఈ జాబితా ఇంతేకాదు. వారందరు సింహములాగా జీవించినవారు. వారు పురుషులు, వారు యోగులు.

యోగులకు వారి మరణ సమయము ముందుగానే

తెలుస్తుంది. అందుకు వారు సిద్ధంగా ఉంటారు. మాస్టర్ ఎమ్.ఎన్. గారికి కూడ మరణ సమయము తెలిసింది. దాని గురించి ఆయన చాలాసార్లు సూచనప్రాయంగా తెలిపారు. చివరకు ఆ సమయం వచ్చినప్పుడు ఆయన వెళ్ళిపోవటానికి సంతోషంగా సిద్ధపడ్డారు. ఆయన లౌకిక పరిస్థితులను ఏ మాత్రం లెక్కచేయక సింహములాగ వెళ్ళిపోయారు. అలౌకిక ప్రపంచములోకి వెళ్ళిపోవటానికి ముందే ఆయన ఆ లోకంలో క్రొత్త సంబంధాలు ఏర్పరుచుకొని, ఆ లోకంలో చేయవలసిన పనుల గురించి తెలుసుకొన్నారు. ఆయన జీవితమే ఒక వైభవోపేతమైన జీవితం. ఆయన మరణం కూడా అంతే వైభవం.

*మాస్టర్ ఎమ్.ఎన్. గారి*

*శ్రీ పాద పద్మాలకు సదా సర్వదా నమస్కారం!*



# 12

## చికిత్స (ఉపశమనం) మరియు శిక్షణ (బోధన)

## (హీలింగ్ మరియు టీచింగ్)

ఆంధ్రప్రదేశ్ కోస్తా ప్రాంతాలలో ''మాస్టర్ సివివి యోగము'' వడి వడిగా మరియు గాఢంగా ప్రభావితం చేయగలిగిందంటే అందుకు కారణం మాస్టర్ ఎమ్.ఎన్.గారే. ఆయన కారణంగానే ఆంధ్రదేశంలోని ఒంగోలు, గూడూరు, నెల్లూరు, కర్నూలు, ఆదోని, తెనాలి, బాపట్ల, గుంటూరు, విజయవాడ, పిడుగురాళ్ళ, గురజాల, రాజమండ్రి– ఇలా ఎన్నో యోగ కేంద్రాలు వెలిశాయి. ఇప్పుడు మూడవ తరం యోగబృందము వారు ఆయా కేంద్రాలలో యోగసాధన చేస్తూ నడిపిస్తున్నారు. తన జీవితకాలంలో ఆయన ఎందరికో శిక్షణ మరియు ఉపశమనం (చికిత్స) చేశారు. ఆయన తన శిక్షణ మరియు హీలింగ్ ద్వారా అమరులయ్యారు. పాఠకుల సౌలభ్యంకోసం కొన్ని సంఘటనలను (ఎపిసోడ్స్) ఈ అధ్యాయములో పరిచయం చేస్తున్నాను.

**హీలింగ్ / (చికిత్స) :**

ఒక యోగ విద్యార్థి ఇలా వివరించాడు. 'మాస్టర్ ఎమ్.ఎన్.

గారు పరిచయం కావటానికి ముందే నేను భగవద్గీతకు యోగ్య విద్యార్థిని. బహుశా దాని మూలంగానే నేను మాస్టరుగారిని కలుసుకోగలిగాను. ఉపదేశము పొంది, యోగసాధన చేసిన తరువాతనేనుబోధించటానికిమరియుఉపశమనంకలిగించడానికి యోగ్యతను పొందాను. శ్వాసలో గణనీయమైన ప్రగతి కలిగి ఎక్కువగా హీలింగ్ శక్తిని పొందడానికి అర్హుడనయ్యాను. ఇలాంటి హీలింగ్ శక్తుల సహాయంతో తెనాలిలో నా దగ్గరికి వచ్చే వారికి బోధించి ఉపశమనం కలిగించేవాడిని. నేను నా అంతఃకరణాలలో దివ్యపురుషుడైన కృష్ణ దర్శనం చెయ్యగలిగాను. ఒక్కోసారి కృష్ణుడితో అన్యోన్యంగా ఉన్నాను. ఇంతకన్నా ఇంకేం కావాలి? నేను అంతరంగ సాన్నిధ్యాన్ని అనుభవించి నా చుట్టూ ఉన్న వారికి హీలింగ్ ద్వారా ఉపశమనాన్ని కలిగించగలుగుతున్నాను.

– ఉన్నవ లక్ష్మీనారాయణ (న్యాయవాది)

★★★

ఒకసారి ఒక సాధువు హిమాలయాల నుండి సరాసరి ఒంగోలులో మాస్టర్ ఎమ్.ఎన్. గారి ఇంటికి వచ్చి మూడు పగళ్ళు, రెండు రాత్రులు ఉన్నాడు. ఆయన జుట్టు మోకాళ్ళదాకా ఉండేది. ఆయనకు ఒంటిమీద నడికట్టు బట్ట మాత్రమే ఉంది. ఆయన మాస్టరుగారిని వరండాలోనే చూశాడు. ఆయన సరాసరి మాస్టరుగారి దగ్గరకు వచ్చి సాష్టాంగ ప్రణామం చేశాడు. మాస్టరుగారు తక్షణమే లేచి తన రెండు చేతులతో ఆ అపరిచిత వ్యక్తి భుజాలను పట్టుకుని, పైకి లేవనెత్తి 'గురువుగారూ! మీరు

నా కన్న పెద్దవారులా ఉన్నారు. మీ ముఖములో జ్ఞాన తేజస్సు కనిపిస్తోంది. మీరు నాకు ఎందుకు సాష్టాంగ ప్రణామం చేస్తున్నారు? మీరు భావిస్తున్న వ్యక్తి బహుశ నేను కాదేమో!' అన్నారు. దానికి ఆ వ్యక్తి నవ్వుతూ ఇంగ్లీషులో ఇలా చేయమని సూచించారు. ''నేను హిమాలయ పర్వతశ్రేణిలో ఉంటున్నాను. మీరు లౌకిక మరియు అలౌకిక విధులను సమానంగా నిర్వర్తిస్తున్న మహాయోగి అని మిమ్మలను ఉదాహరణగా మా బృందాలలో చెబుతూ ఉంటారు. నాకు మిమ్మలను చూడాలని బలంగా కోరిక కలిగి, మీతో ఉండాలని, రెండు రోజుల నుండి ప్రయాణం చేసి వచ్చాను'' అన్నాడు. మాస్టరుగారు ఆశ్చర్యపడ్డారు. ఆ సాధువుకు ఆయన ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేశారు. ఆ సాధువు రెండు రాత్రులు, మూడు పగళ్ళు ఉన్నాడు. వారిద్దరి మధ్య సుదీర్ఘ సంభాషణ జరిగింది. కాని దానిని రికార్డు చేయలేదు. మూడవనాడు సాయంత్రం ఆ సాధువు ''మాకు ఒక నియమం ఉంది. ఏ ప్రదేశములోనైనా మూడవనాటి రాత్రి నిద్రపోకూడదు. అందుకే నేను ఇప్పుడు వెళ్ళిపోతున్నాను. మనం మళ్ళీ కలుసుకుందాం'' అని చెప్పి వెళ్ళిపోయాడు.

★★★

ఒక రోజు ఒక స్త్రీ పట్టుచీర, ఒంటినిండా నగలు ధరించి మాస్టరుగారి దగ్గరికి వచ్చింది. ఆమె ఒక వితంతువు. ఆమె ఒక బుట్టనిండా పళ్ళు తెచ్చి యిచ్చి ఆశీర్వాదం కోరింది. ఆమె కూడ ఒక యోగ విద్యార్థిని. ఆమె 'మాస్టరుగారూ ! మీ అనుగ్రహం ఎప్పుడూ నాకు ఉండాలి' అన్నది. మాస్టరుగారు చిరునవ్వుతో, కాసేపు కళ్ళు

మూసుకున్నారు. ఆయన అంతరంగములో చూసినపుడు ఆ స్త్రీ తన మేనత్త చనిపోయినప్పుడు ఆమె పూర్వార్జిత ఆస్తి పొందినది. అలా చాలా ధనంతోపాటు, బంగారం, పట్టుచీరలు రావటంతో ఆకస్మికంగా శ్రీమంతురాలైంది.

మాస్టర్ ఆమెతో 'నాకు అనుకోకుండా చాలా ధనం కావాలి. కాని ఆ ధనాన్ని నీకు అవసరం వచ్చినప్పుడు తిరిగి యిస్తాను. ఇప్పుడు నీ దగ్గర ఉన్న ధనం యిస్తావా?' అని అడిగారు. ఆమె ముఖకవళికలు మారిపోయాయి. ఆమె గంభీరంగా, మౌనంగా ఉండిపోయింది. అవునని, కాదని ఏదీ చెప్పలేదు. ఆమె బృందముతో పాటు ప్రార్థన మరియు సాధన చేయటానికి ఎంతో దూరంగల పల్లె నుండి వచ్చి వెళ్ళిపోయింది.

ఏడేళ్ళు గడిచాయి. ఒక రోజు ఆ స్త్రీ మాస్టరుగారి పాదాలపై బడి ఏడుస్తూ మాస్టరుగారిని క్షమాపణ కోరింది. అందుకు మాస్టరుగారు "నీవు అమాయకురాలివి. ప్రతి స్త్రీ కూడా నీలాగే నగలు, పట్టుచీరలు, ధనంపై మోహం పెంచుకుంటుంది. మీకు అవే చాలా ముఖ్యంగా అనిపిస్తాయి. నీవు ఆ బట్టలు, నగలను వదలి ఉండలేవని నాకు తెలుసు. నీవు ఆ ధనాన్ని పోగొట్టుకోగల అపాయం ఉందని నేను గ్రహించాను. నీ మరిది నీ దగ్గర ఉన్న ధనాన్ని ఎక్కువ వడ్డీ వచ్చేలా చేస్తానని తీసుకొని నట్టేట్లో ముంచేశాడు. నీవు కూడ ఆ వడ్డీకి ఆశ పడి, ఉన్నది కూడా పోగొట్టుకున్నావు. అవునా? ఈ సంగతి నేను ముందే గ్రహించి ఆ నష్టం నుండి నిన్ను కాపాడాలని అనుకున్నాను. కాని నీవు నన్ను

అనుమానించి, నీ మరిదిని నమ్మావు. ఇప్పుడు ఏం చేద్దాం?' అన్నారు.

'నేను ధనంతో వ్యవహారం చేయను. వీలైనంతవరకు ధనాన్ని ముట్టుకోను. ధనం చాలా వస్తుంది, పోతుంది. నా అవసరాలకు కావలసినంత వస్తుంది. అవి పూర్తి అయ్యాక వెళ్ళిపోతుంది. నీలోని అమాయకత్వాన్ని చూసి నిన్ను కాపాడే బాధ్యత తీసుకున్నాను. కాని నీవు అందుకు ఒప్పుకోలేదు. పోయిందేదో పోయింది. దాని గురించి దిగులుపడకు' అన్నారు.

పరిస్థితినంతా అర్థం చేసుకోగల మాస్టరుగారి సూక్ష్మ గ్రహణశక్తికి ఆమె ఆశ్చర్యపోయింది. ఆ తరువాత ఆమె మాస్టరుగారికి ముఖ్యమైన వాహికగా మారింది.

★★★

మాస్టరుగారి ఇంటి తలుపులు పరహితంకోసం సదా తెరిచే ఉండేవి. కొంతమంది దూర ప్రాంతముల నుండి పూర్వానుమతి లేకుండానే యోగసాధన కోసం వచ్చేవారు. వారికి ముందుగా అనుమతి తీసుకోవటానికి అప్పుడు టెలిఫోన్ సౌకర్యం కూడా ఉండేది కాదు. వారు బృందములుగా వచ్చి మాస్టరు గారింట్లో కొన్ని రోజులపాటు ఉండిపోయేవారు. వారి మాస్టరు గారింట్లోని హాలు మరియు మేడ మీద ఉన్న ఖాళీ స్థలం వాసస్థాన మయ్యేది. అక్కడికి దగ్గరలో ఉన్న కొలను నీరు వారి స్నానమునకు మరియు ఇతర అవసరములకు ఉపయోగపడుతుండేది. నిర్ణీత సమయములో

వారికి రుచికరమైన వంటలతో అల్పాహారము, భోజనము ఏర్పాటు చేయబడేది. మాస్టరుగారి వంటగదిలో నిరంతరం అగ్నిహోత్రుడు వెలుగుతుండేవాడు. పైకప్పు కొబ్బరి ఆకులతో కప్పబడిన ఆరుబయలు వంటశాల. గాడిపొయ్యిల మీద ఎప్పుడూ అన్నము, సాంబారు, కూరలు మరియు గింజలతో (Lentils) కూడిన వంటలు వండబడుతూ ఉండేవి. ఒక బృందము ఎప్పుడూ ఇడ్లీ పిండి రుబ్బుతూ ఉండేది. అది చాలా అద్భుత దృశ్యం. యోగ బృందములోని కొందరు స్త్రీలు వంటావిడ చిలకమ్మ మరియు ఇంటావిడ శ్రీమతి రంగనాయకమ్మగారితో ఒక బృందముగా చేరి పనులు చేసేవారు. అక్కడ సంవత్సరమంతా పండుగే. వంటలు చేయడము, వడ్డించడము (అన్నదానము) మాస్టర్ సి.వి.వి. యోగములో ముఖ్యంగా, పవిత్రంగా భావింపబడేది. (నిజానికి భారతదేశములోని ప్రతి గురువుగారి ఆశ్రమములో ఈ కార్యక్రమము జరుగుతూ ఉంది).

★★★

మాస్టరుగారు భోజనాన్ని ఆస్వాదించేవారు. ఆయన అందరికీ అన్ని వేళలా రుచికరమైన భోజనం పెట్టడాన్ని దృఢపరచుకొనేవారు. ఒకసారి ఎవరో మాస్టరుగారి శ్రీమతిని 'మీకు ప్రియమైనది ఏది?' అని అడిగారు.

అందుకు ఆమె చిరునవ్వుతో 'నాకు మీ మాస్టరుగారే అన్నిటికన్న ప్రియమైనవారు. ఈనాటి వరకూ ఆయన భోజనాన్ని విమర్శించడం గాని, వంకలు పెట్టడం గాని నేను చూడలేదు.

ఆయన ప్రశాంతంగా భోజనం చేసేవారు. భోజనాల బల్ల దగ్గర దేని గురించి చర్చ చేసేవారు కాదు. ఉప్పు ఎక్కువైందని, తక్కువైందనికాని, కారం ఎక్కువైందని, తక్కువైందని కాని యిలా విమర్శించేవారు కాదు. నాకు గుర్తున్నంతవరకూ 'నాకు ఇది ఇష్టం' అని ఎప్పుడూ చెప్పలేదు. కేవలం భోజనం చేసి బాగుందని మెచ్చుకొనేవారు. ఆయన పళ్ళెములో వేసిన పదార్థములను చల్లడం నేను ఇంతవరకూ చూడలేదు. భోజనం ప్రారంభించడానికి ముందుగా ఆయన ఒక పిడికెడు అన్నాన్ని అజ్ఞాత జీవులకోసం గౌరవంగా సమర్పించేవారు. భోజన సమయంలో చాలా సంతోషంగా, ప్రశాంతంగా ఉండేవారు. భోజన సమయంలో గంభీరంగా ఉండడం ఎప్పుడూ నేను చూడలేదు' అన్నారు.

★★★

మాస్టరుగారు సామూహిక ప్రార్థనా సమయంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య విషయాన్ని గమనించేవారు. ఆరోగ్య సమస్యలున్న వారికి ప్రత్యేకంగా నయం చేసి సర్దుబాటు చేసేవారు. ఒక్కోసారి వారిని కొన్ని రోజులు తనతోబాటు ఉండి ప్రార్థనలు చేయమని చెప్పేవారు. చాలావరకు ప్రార్థన ద్వారానే చికిత్స / నయం చేసేవారు. తనతోబాటు ప్రార్థనలు చేసేవారికి ప్రాణచైతన్య చికిత్స చేసి వారిలో యోగసాధన జరిగేలా చేసేవారు. సభ్యులు తమ ఇళ్ళలో వారు చేసే ప్రార్థన కంటే మాస్టరుగారితో బాటు చేసే ప్రార్థన ప్రత్యేకంగా, విశిష్టంగా ఉంటుందని అనుభూతి చెందేవారు. ప్రార్థనకు వచ్చే సభ్యులు తమకున్న ఆరోగ్య సమస్యలు

వీరికి చెప్పకపోయినను మాస్టర్ ఎమ్.ఎన్.గారు వారిని గమనించి తరువాత వాటిని ప్రార్థనలో సరి చేసేవారు. సమాజంలో ఆయనకు 'ఉత్తమ చికిత్సకుడు' అనే పేరు ఉండేది. యోగ సభ్యులు కాకున్నను ఇతరులు చికిత్సకోసం వారి దగ్గరకు వచ్చేవారు.

★★★

ఒకసారి యోగబృందములోని ఒక సభ్యుడు మాస్టరుగారి దగ్గరకు వచ్చి, 'నాకు ప్రార్థనలో హీలింగ్ చేయమని సూచింపబడింది. అలా హీలింగ్ కూడా జరుగుతూ ఉంది. కాని ఒక వ్యక్తికి ఎన్నిసార్లు ప్రార్థన చేసిననూ వ్యాధి నయం కాలేదు. నేను ఆయనకు ఈ మార్గం గురించి ఉపదేశమిచ్చాను. ఎందుకంటే ఆయనకు ఆయనే నయం చేసుకోవచ్చు కదా! కాని ఏమీ ఫలితం లేదు. కారణం ఏమై ఉంటుంది ?'' అని అడిగాడు.

అందుకు మాస్టరుగారు ''నీవు హీలింగ్ గురించి సూచించి ఉండవచ్చు. ఆ తరువాత పనిని మాస్టరుగారికి వదలిపెట్టు. అది నయం కావటానికి నీవు వ్యక్తిగతంగా బాధ్యత వహించకు. అలా అనుకుంటే అది అహంకార మవుతుంది. నీవు నిజానికి హీలర్ కాదు. మాస్టరుగారే హీలర్. అహంభావాన్ని వదలి మాస్టరుగారికి సమర్పించు. ఎప్పుడు, ఎలా నయం చేయాలో, ఎలా సహాయం చేయాలో మాస్టరుగారికే బాగా తెలుసు.''

★★★

ఒకసారి ఒక శిష్యుడు మాస్టర్ ఎమ్.ఎన్.గారిని 'మీరు మాస్టర్ సి.వి.వి.గారిని హీలింగ్ లేదా ఏదైనా సహాయం గురించి అడిగినప్పుడు ఆయన నుండి ప్రత్యుత్తరము వస్తుందా ?' అని అడిగాడు.

అందుకు మాస్టర్ ఎమ్.ఎన్.గారు నవ్వుతూ 'నాకు ప్రత్యుత్తరం వచ్చేది. నాలో నుండే ప్రత్యేకంగా వచ్చిన ఒక ధ్వనిని నేను వింటాను. ఆ శబ్దము 'ఆహ్' (ఒక దృఢ (అంగీకార) సూచకం) నేను దానిని వింటే, హీలింగ్ తప్పకుండా జరుగుతుంది, కోరిన సహాయం తప్పకుండా లభిస్తుంది.

★★★

మాస్టర్ ఎమ్.ఎన్.గారు తనకు శిష్యులు లేదా అనుయాయులు ఉన్నారని ఎక్కడా చెప్పలేదు. ఉదయం సాయంత్రం ఆయన ఇంట్లో జరిగే ప్రార్థనలకు హాజరయ్యే జనాన్ని చూసి ఒంగోలులోనే ఉన్న కొంతమంది మాస్టర్ ఎమ్.ఎన్. గారి దగ్గరకి కోర్టు వ్యాజ్యాలకోసం చాలామందే వస్తున్నారు అనుకునేవారు. ఆయన పేరుమోసిన ప్లీడరు. ఒకసారి ఆయన సహోద్యోగి ఆయనను 'మీరు చాలామంది కక్షిదారులను ఆకర్షిస్తున్నారు. దానికి మీరు ఏ తంత్రాన్ని వాడతారు?' అని అడిగాడు.

దానికి మాస్టరుగారు చిరునవ్వు నవ్వారు. ఆ సహోద్యోగికి కావలసిన జవాబు దొరికింది. "చిరునవ్వు" ఒక తాళం చెవి అని అర్థం చేసుకున్నాడు.

★★★

ఒకసారి మాస్టరుగారు విజయవాడలోని తమ స్నేహితునితోబాటు ఇంట్లో ఉన్నప్పుడు, మానసికంగా అస్వస్థతగా ఉన్న ఒక స్త్రీని చూశారు. ఆమె ఎవరైనా అపరిచితులను చూసినప్పుడు పాట పాడుతూ నృత్యం చేసేది. ఆ స్నేహితుడు ఆమె తనకు అక్క అని, ఆమెకు చిన్నతనం నుండే ఆ జబ్బు ఉందని, అందుకే ఆమె పెళ్ళి చేసుకోకుండా ఉందని, ఆమెకు తానే ఆధారమని చెప్పాడు. మాస్టరుగారు ఆ స్త్రీని చాలా సూక్ష్మంగా పరిశీలించారు. ఆయన ఆమెను గమనిస్తున్నకొద్దీ ఆమె ప్రోత్సహిస్తున్నారనుకొని, చాలాసేపు పాటలు పాడుతూ, నృత్యం చేస్తూ ఉండేది. రెండు గంటల తరువాత మాస్టరుగారు ఆమె కళ్ళలోకి చూస్తూ 'స్టెడీ' (స్థిరంగా ఉండు) అన్నారు. ఆ స్త్రీ కొంతసేపు అలాగే శిలాప్రతిమలా కదలకుండా ఉండిపోయింది. మరునాటికి ఆమె ఆరోగ్యం కుదుటపడి మామూలు స్థితికి వచ్చింది. ఆ జబ్బు మళ్ళీ ఆమెకు చేరువ కాలేదు. ఆ స్నేహితుడు మాస్టరుగారికి కృతజ్ఞుడిగా ఉండిపోయాడు.

★★★

మాస్టరుగారు హిస్టీరియా పేషెంట్లను, మానసిక రోగులను వారి నుదుటిని స్పర్శించి నయం చేసేవారు. కొన్నిసార్లు ఆ నుదుటిపైన కొట్టేవారు. అలా దెబ్బలు కొట్టడం ద్వారా ఫిట్స్ (ఎపిలెప్సీ) రోగాలను నయం చేసేవారు.

★★★

ఒకసారి యోగ సభ్యుడు మాస్టరుగారి దగ్గరకు వచ్చి నాలుగేళ్ళ బాలుడొకడు దుష్టశక్తిచేత పీడింపబడు తున్నాడని చెప్పాడు. మాస్టరుగారు ప్రార్థనలు చేసి ఆ దుష్టశక్తిని వాడి శరీరంలో నుండి వెళ్ళిపొమ్మని సూచించారు. ఆ నిమిషానికి ఆ దుష్టశక్తి వెళ్ళిపోయి మళ్ళీ తిరిగి వచ్చేసేది. ఆయన మాస్టర్ సి.వి.వి.గారిని దారి చూపమని అడిగారు. అందుకు మాస్టర్ సి.వి.వి.గారు 'నీవు ప్రార్థనలో ఆ దుష్టశక్తిని వెళ్ళిపొమ్మని అంటున్నావు. అందువలన అది వెళ్ళిపోయి మళ్ళీ తిరిగి వస్తూ ఉంది. నీవు వెళ్ళి ప్రార్థనలో ఆ దుష్టశక్తిని మాయమైపొమ్మని చెప్పు' అన్నారు.

ఆయన మాస్టరుగారు చెప్పినట్లే చేశారు. ఆ తరువాత దుష్టశక్తి మళ్ళీ ఎప్పుడూ ఆ అబ్బాయి జోలికి రాలేదు.

★★★

**శిక్షణ :**

ఈ యోగములో కుండలినీ తేజస్సు వెంటనే తెలుస్తుంది. ఉపదేశము పొందిన నాటి నుండి ప్రార్థన జరుగుతున్నంత సేపు మూలాధారము నుండి సహస్రారము వరకూ నెమ్మదిగా విద్యుత్ ప్రసారం జరుగుతూనే ఉంటుంది. మొదట్లో శరీరములో కదలికలు ఉన్నప్పటికీ, సాధన పెరుగుతున్నకొద్దీ శరీరంలో బాహ్య కదలికలు

ఆగిపోతాయి. అంతరంగంలో కదలికలు మొదలవుతాయి. జీవశక్తి మరింత శక్తివంతమౌతుంది, జీవ చైతన్యము మరింత చురుకై, దృఢమౌతుంది. అప్పుడు ఎవరికీ మత్తుగాని, నిద్రాస్థితి గాని ఆవరించదు. శరీరమంతా తేలికగా, వెచ్చగా ఉందన్న అనుభూతి కలుగుతుంది. శరీరంలో వర్కింగ్స్ జరుగుతున్నకొలదీ, కళ్ళు తెరువడానికి వీలుపడదు. ఒక్క సంవత్సర కాలములో వెయ్యేళ్ళ సాధనను సాధించవచ్చు. ఈ యోగ సాధనకు, పరంపరాగతమైన యోగసాధనకు విమాన ప్రయాణానికి, ఎద్దుబండి ప్రయాణానికి ఉన్నంత తేడా ఉంటుంది. ఈ యోగమును వేరే ఏ యోగముతో పోల్చకూడదు.

★★★

నీవు సత్యయోగ సాధక మండలిలో సభ్యుడు కావాలంటే ఈ క్రింది నియమాలను పాటించాలి:

1. నాకు తెలిసిన సత్యమునే పలుకుతాను.

2. భావంలో కాని, భాషలో కాని, క్రియలో కాని (మనసా, వాచా, కర్మణా) ఎవరికీ హాని చేయను.

3. ఇతర సంస్థలలో చేరటం కాని, ఆ సంస్థల కార్యకలాపాలలో బాధ్యతలు స్వీకరించటం కాని చేయను.

4. నేను రాజకీయాలలో పాల్గొనను.

5. నా వృత్తికి అంకితమై, వృత్తిని గౌరవిస్తూ సమాజంపట్ల మరియు నా కుటుంబముపట్ల బాధ్యత వహిస్తాను.

6. నేను నా స్వభావములోగల అసహజమైన కోరికలను గురించి ఉదాసీనముగా / నిర్లిప్తంగా ఉంటూ వాటిని గురించిన చింతను మాస్టరుగారి పాదాలకు సమర్పించుకుంటాను.

7. నా వేషభూషణాలలో సాధారణంగా ఉండి సమాజములో సామాన్యుడిలాగే ఉంటాను.

8. నాలో మార్పు జరిగేది అంతరంగములోనే కాని బాహ్యములో కాదని తెలుసుకుంటాను.

9. నేను గృహస్థుగానే కుటుంబ వ్యవస్థలో ఉంటాను.

10. నేను బాహ్యప్రపంచమును, సమాజాన్ని ఎప్పుడూ తిరస్కరించను.

★★★

మనిషి చనిపోయినప్పుడు పదార్థమయ శరీరము విడివడుతుంది (disintegrates). మరణమంటే ఆత్మ భౌతిక సంబంధాలనుండి విడివడుతుంది. ఆత్మ యొక్క సమర్థన లేని శరీరము శిథిలమవుతుంది. పదార్థము ఆత్మను అనుసరించలేదు కాని దేహం నశించడం వలన పదార్థము యొక్క ప్రభావము ఆత్మతో ఉండి మరుజన్మకు / పునర్జన్మకు మార్గదర్శకం అవుతుంది. స్వతంత్రము అంటే ఆత్మ స్థూలము నుండి, సూక్ష్మము నుండి విడిపోయి స్వతంత్రముగా ఉండటమే.

★★★

ఈ విశ్వం ఉన్నది ఆత్మలన్నీ పరిపూర్ణతను అనుభవించటానికే. ఆత్మలకు అపరిపూర్ణమైన అనుభవా లుంటాయి. ఆత్మలకున్న అన్ని అపరిపూర్ణమైన అనుభవాలను సమగ్రం చేస్తే పరిపూర్ణతను దర్శించగలము. అంచెలంచెలుగా ఈ విశ్వం దర్శనమిస్తుంది.

విద్యార్థి ఉన్నంతకాలము విద్యాలయము ఉంటుంది, అధ్యాపకులు కూడ ఉంటారు. చదవటానికి ఎవరూ లేనప్పుడు విద్యాలయాల, అధ్యాపకుల అవసరం లేదు. అలాగే గురువులు మరియు విశ్వము కూడా (గురువు లేనప్పుడు విశ్వము లేదు. విశ్వము లేనప్పుడు గురువు లేడు).

★★★

పదార్థము నుండి ఎంత ఎక్కువగా స్వాతంత్ర్యము పొంది ఉంటే అంత ఎక్కువగా ప్రజ్ఞావికాసము కలుగును. పదార్థము వైపుకు ఆకర్షణ లేనంతవరకూ ప్రజ్ఞకు బంధనాలు ఉండవు. పదార్థము అన్ని ప్రదేశాలలో ఉంటుంది కాని దాని సాంద్రతలో మాత్రం తేడా ఉంటుంది.

బ్రహ్మే దీనికి నిర్దేశకుడు. వివిధ దశలలో, పదార్థము నుండి ఆత్మతత్త్వమునకు మరియు ఆత్మతత్త్వమునుండి పదార్థమునకు మార్గము కుండలినియే. వివిధ దశలలో పదార్థమునకు ప్రత్యేకమైన గుణము, స్వభావము ఉండును.

★★★

మనిషిలోనే స్వర్గము మరియు నరకము కూడ ఉన్నాయి. సత్యము మరియు అసత్యము కూడ ఉంటాయి. అతను పాపాత్ముడు కావచ్చు లేదా సాధువు కావచ్చు, యజమాని కావచ్చు లేదా సేవకుడు కావచ్చు. మనలో ప్రతి ఒక్కరూ తమకు నచ్చినట్లుగానే ఉన్నారు. సృష్టిలో మనది బాగా గారాబం చేయబడ్డ జాతి. తండ్రియైన భగవంతుడు బాగా ముద్దు చేసి, అతిగా స్వాతంత్ర్యం యిచ్చి పాడుచేశాడు. కాని ఆయన తెలివైనవాడు కావటంతో సృష్టి అల్లికలో ప్రతి తప్పటడుగుకు"చెక్ మేట్" పెట్టాడు. ఆయన తన కొడుకుకు ఒక చక్ర వ్యూహాన్నిచ్చి 'నీకు పూర్ణ స్వాతంత్ర్యముంది. నీకు చేతనైతే దానితో కలిసి బ్రతుకు. లేదా దానిని నీవే పరిష్కరించు.' అది ఒక తండ్రి తన పిల్లలతో ఆడే హాస్యముతో కూడిన ఆట. రానురాను మనిషి తనకు ఎప్పుడూ స్వాతంత్ర్యము లేదని తెలుసుకుంటాడు. స్వతంత్రము ఒక కల్పన, సిద్ధిపొందడమే నిజమైన స్వతంత్రము. ఇక మిగిలిన స్వాతంత్ర్యములన్నీ భ్రమలే.

★★★

ఇది తప్పకుండా ఒక వినూత్న యోగము. ఈ యోగములో ప్రాణశక్తి పరిచయం చేయబడుతుంది. అది అంతరంగములోనికి, మూల స్థానమునుండి స్వతంత్రంగా ప్రవహిస్తుంది. ఆ శక్తి విశ్వబంధనాలకు కట్టుబడి ఉండదు. ఆ శక్తి ఎలాంటి అడ్డంకులు లేకుండా, లోనికి ప్రవహించి, తొలుస్తూ వెళ్ళి తనదైన సూక్ష్మశరీరమును నిర్మించుకొని మానవ పరిణామాన్ని కలిగిస్తుంది. అది ఇప్పటివరకు ఉన్న విశ్వనియమాలకు భిన్నంగా

ఉంది. అందువలన ఇది ఒక 'న్యూ డైరెక్ట్ లైన్'. ఇది సత్యం, ఇది సంప్రదాయవాదులు భావించినట్లుగా మాస్టర్ సి.వి.వి. గారి అతి ఉత్సాహంతో కూడిన ఆలోచన కాదు.

ఈ నూతన జీవన సూత్రము, ఇప్పటిదాకా లేని ప్రజ్ఞయొక్క నిరంతరతను అందించును. ఇది అన్ని కోశములలోనూ సమాన అస్తిత్వమును పొంది ఉంటుంది. దాని ఆదేశముతోనే మరణం పనిచేయును. మరణానికి స్వామిత్వము లేదు. నూతన జీవన సిద్ధాంతము యజమాని అయితే, మరణం దానికి సేవకుడు. ఇది బ్రహ్మము నుండి వ్యక్తమవుతున్న నూతన జీవన తరంగము అని అర్థం చేసుకోండి. అది తనకు తానే 'నూతన యోగమార్గము' అనే విశ్వాత్మక చైతన్య ప్రవాహాన్ని ఏర్పరచుకుంటుంది. ఈ నూతన తరంగము తనకు తానే రూపుదిద్దుకుంటుంది. అది నిన్ను సరాసరి బుద్ధి లోకాలకు తీసుకువెళ్ళి అక్కడినుండి బ్రహ్మమునకు చేరుస్తుంది.

★★★

'స్టెబిలిటీ' (స్థిరత్వం) మాస్టరుగారికి చాలా ఇష్టమైన పదము. అది మాస్టరుగారి శక్తిచేత హృదయ కేంద్రములో ఆకృతి పొందుతుంది. క్రమం తప్పకుండా ప్రార్థన జరగాలి. మీ ప్రార్థనలు సూర్యోదయము మరియు సూర్యాస్తమయంలాగా క్రమబద్ధంగా ఉండాలి. ప్రార్థనలో మీకున్న క్రమబద్ధతయే మీకు కావలసిన స్థిరత్వాన్నిచ్చి నీలోని రచనాత్మక శక్తికి దారి చూపుతుంది. అది నిన్ను బ్రహ్మము దాక చేరుస్తుంది.

★★★

మీరు ఎప్పుడైనా శిశువును ఎత్తుకున్నారా? మీ చేతులలోకి లేదా ఒడిలోకి తీసుకున్నారా? ఆ శిశువు వెచ్చగా ఉంటుంది. ఆ వెచ్చదనం మీ వెచ్చదనం కంటే ఎక్కువగా ఉంటుంది. ఎందుకో మీకు తెలుసా? శిశువు వెచ్చగా ఎందుకు ఉంటుందంటే ఆ చిన్ని శరీరంలో మార్పులు జరుగుతూ ఉంటాయి. అది పెరుగుదల ప్రక్రియ. అలాంటి పెరుగుదలకు ఆ వెచ్చదనమే ఆధారము. అలాగే నీవు యోగవిద్యలో, నీ ప్రార్థనలలో ఎదుగుతున్నావంటే నీలో కూడా వెచ్చదనము పెరగాలి. ప్రతి ప్రార్థన తరువాత నీలో వేడి పెరుగుతుంది. అలా కాకపోతే నీ ప్రార్థనలు శ్రద్ధలేనివి లేదా యాంత్రికమైనవీ అవుతాయి. ప్రార్థనలో శ్రద్ధ ఉండాలి. నీలో జరిగే ప్రక్రియలను గమనించు. ఆధునిక కాలపు భౌతిక ప్రపంచపు ఆలోచనలలోకి జారిపోవద్దు. నీలో ఏమి జరుగుతున్నదో దానిని గమనించు. ప్రార్థనలో కూర్చున్నట్లు నటించకు. నీ ప్రార్థన స్వచ్ఛంగా, నిష్కపటంగా ఉండాలి.

★★★

ప్రారంభదశలో ప్రార్థనా సమయంలో భౌతిక శరీర కదలికలు ఉంటాయి. మాస్టర్ యోగములో కార్య మంతయూ అంతఃకరణాలలోనే జరుగుతుంది. మాస్టరుగారి శక్తి చిత్తము అంటే అంతరంగ వ్యక్తిలో మార్పు తెస్తుంది. ప్రార్థనా సమయంలో బయట జరిగే వివిధ విన్యాసాలు అంతరంగ విన్యాసాలకు దారి చూపాలి. బాహ్య కదలికల భ్రమలో చిక్కుకోవద్దు. అది

పసితనము. నేను చేసే ప్రార్థనలో 'నమస్కార ముద్ర' తప్ప వేరే ఎలాంటి భంగిమలైనా చూశావా? కాని ప్రార్థనలలో చాలామంది సభ్యులు చేసే ఆవలింతలు, శబ్దాలు, శరీర కదలికలు చూస్తూ ఉన్నాను. అవన్నీ నీ మనోక్షేత్రం నుండి వచ్చిన కదలికలే కాని నేను అందించిన యోగములోని భాగము కాదు. సముద్రములోని అలలు ఉల్లాసంగా కదులుతూ ఉంటాయి, నురుగును చేయాలనేది దాని సంకల్పం కాదు. ఆ నురుగుకు ప్రాముఖ్యతను యివ్వవద్దు. నీలోని శారీరిక కదలికలన్నీ అలలోని నురుగులాంటివే. ఆ నురుగులో ఎలాంటి సారమూ ఉండదు.

నీ చిత్తమునందు సర్దుబాట్లు జరగడం మొదలైనప్పుడు నీలోని ఎరుక బుద్ధిలోనికి లోతుగా వెళ్ళి అక్కడ స్థిరత్వాన్ని పొందుతుంది. ఒక్కసారి స్థిరత్వము పొందితే, నీలో జరిగే శ్వాసక్రియ కూడ నీకు తెలియకుండా జరుగును. అవి సూక్ష్మంగా, సున్నితంగా ఉండాలి. అన్ని యోగ ప్రక్రియలు చిత్తము, బుద్ధి మరియు ఆత్మకు సంబంధించినవిగా ఉండాలి, కాని భౌతిక శరీరావయవములకు సంబంధించినవి కావు.

★★★

ఆధ్యాత్మిక చికిత్స విషయంలో నీ మనోశక్తితో కసరత్తు చేయకు. కేవలం చికిత్స జరగాలని అభ్యర్థన చేసి ఆ జబ్బును మాస్టరుగారి పాదాలకు సమర్పించాలి. నీవు మాస్టరుగారి శక్తికి వాహికగా ఉండు. ఆ శక్తే నయం చేస్తుంది. మధ్యవర్తిగా ఉండకు. తటస్థ వాహికగా ఉండు. మీలో చాలామంది చికిత్సను చేయలేరు.

ఎందుకంటే 'నేను చికిత్స చేస్తున్నాను' అనే భావన మీలో ఉంటుంది. మాస్టరుగారి శక్తికి వాహికగా ఉండడం నేర్చుకోండి. చికిత్స జరగడానికి అవకాశమివ్వండి. కర్తగా ఉండకుండా, నీ ద్వారా శక్తి ప్రసారం జరుగుతోందని గమనించు. చికిత్స జరిగినప్పుడు ఆ ఖ్యాతి నీది కాదని, మాస్టరుగారిదే అని భావించు.

'బ్రహ్మధర్మము' మరియు 'సృష్టిధర్మము' ఉన్నాయి. బ్రహ్మము నియమాతీతుడు. బ్రహ్మము నీలో ప్రవహించి నీలోని అస్వస్థత అనే మాలిన్యమును తొలగించి శుభ్రపరచనీ. నీవు ఆ పనిలో క్రియాశీలివైతే, 'సృష్టిధర్మము' అనే ప్రకృతి నియమాన్ని తీసుకురాగలవు. అప్పుడు నీ కర్మ, ఆ రోగి కర్మ రెండూ కలగాపులగమై హీలింగ్ అనే ప్రక్రియ క్లిష్టమవుతుంది.

ఒకసారి 'స్విచ్ ఆన్' అయితే నీ కర్తవ్యం అంతటితో అయిపోయినట్లే. విద్యుత్తు ప్రసారము జరుగుతూ ఉంటుంది. చికిత్సమధ్యలో స్విచ్ విషయములో జోక్యము చేసుకోవద్దు. అలాగే మాస్టరుగారి శక్తికి నీవు స్విచ్ లాంటి వాడివే. ఒకవేళ నీవు చెడిపోయిన స్విచ్ అయితే రోగి అనే బల్బ్ ఫ్యూజ్ పోయినట్లే!

★★★

వేదాంతములో 'థియోసఫి' (దివ్యజ్ఞానము) అన్న కొత్త తరంగము మొదలైంది. దీనిని మేడమ్ బ్లావెట్స్కీ ప్రారంభించారు. ఆమె 'పాత సారా క్రొత్త సీసాలో' అన్నట్లుగా సనాతన విషయాలలోని అంశాలను క్రొత్తగా చెప్పారు. కాని ఆ సీసాకు ఎలాంటి రంగు

లేదు. మతాలు రంగు రంగుల సీసాలు. ఆమె దివ్యజ్ఞానమును అన్ని రంగుల నుండి వేర్పరచి తాజాగా తయారుచేసింది. ఇది జరగడానికి మాస్టరుగారి శక్తే ప్రచోదనము గావించింది. మాస్టరుగారు థియసాఫికల్ ఉద్యమానికి జీవం పోశారు. 'నూతన జీవన సిద్ధాంతము' అనే విషయాన్ని థియోసఫిలో ప్రవేశపెట్టింది మాస్టరుగారే. ఇప్పుడున్న థియోసఫిస్టులు భవిష్యత్తులో మాస్టరుగారి వాహికలుగా తయారవుతారు. మాస్టరుగారు ఈ ఉద్దేశము కోసమే థియోసఫిలో చేరారు.

★★★

ప్రార్థనలో జరుగుతున్నదాన్ని నీవు గమనించవు. ప్రార్థనకు కావలసినది అదొక్కటే, కాని దానిని మాత్రము నీవు చేయవు. గమనించడం తప్ప అన్నీ చేస్తావు. అందువల్లనే నీలో ఏమి జరుగుతున్నదో దానిని నీవు గుర్తించలేవు. మీలో చాలామంది, తమలో ఏమీ జరగటం లేదని అనుకుంటారు. కాని అది తప్పు. నీవు ఎప్పుడైతే ప్రజ్ఞాపూర్వకంగా 'అక్షరాలను' ఉచ్చరిస్తావో అప్పుడు పని ప్రారంభమవుతుంది. నీవు గమనించడంలేదు. కాని ప్రవహించే శక్తిలో ఏమాత్రమూ తేడా ఉండదు. ఒక్కసారి నీవు ఫ్యాన్ స్విచ్ ఆన్ చేసినప్పుడు అది పని చేస్తూ ఉంటుంది. మీరు దానిని గమనించక పోయినను ఫ్యాన్ తిరుగుతూ ఉంటుంది. మాస్టరుగారి శక్తి 'విద్యుత్ శక్తి'. ఎందుకంటే ఒక్కసారి స్విచ్ ఆన్ చేస్తే పని జరుగుతూ ఉంటుంది. మీలో చాలామంది చూడరు, గమనించరు. కాని జరగవలసిన మార్పు జరుగుతుంది. ఆ

మార్పు మంచికోసమే. నీవు ప్రజ్ఞాపూర్వకంగా ఉంటే ప్రతి యొక్కటి శాస్త్రీయంగా (వైజ్ఞానికంగా) కనిపిస్తుంది. ప్రజ్ఞాపూర్వకంగా లేనప్పుడు, అవన్నీ అర్థంకాని రహస్యాలుగానే ఉంటాయి.

★★★

మనం చేసేది ప్రార్థన. మనసును కేంద్రీకరించి ఏకాగ్రత సాధించడానికి చేసే కసరత్తు కాదు. ఇది శిక్షార్హులను ఉంచే శిబిరం కాదు. మనము నిజమైన సామ్యవాదులము. మనల్ని రాజకీయ ఖైదీలను శిక్షించే శిబిరాలకు పంపలేరు. మన ప్రార్థనలు బ్రహ్మ శక్తితో అనుసంధానం కావడానికి సహకరిస్తాయి. నాకు తెలిసినంతవరకు అదే సరైన అనుసంధానము. మనలో ప్రతి ఒక్కరూ బ్రహ్మమే. మనకు బ్రహ్మముతో అనుసంధానం చెందగల సామర్థ్యము ఉన్నది. అది నూతన యుగపు సామ్యవాదము. సామ్యవాదము యొక్క బృందములు భూమిపై ఉన్నవి, కాని వాటి ఉనికి సామాన్య ప్రజలకు తెలియదు.

★★★

నాకు పునర్జన్మ మీద నమ్మకం ఉంది. ప్రతి జన్మకూడా ఒక అవకాశం. ప్రతి అవకాశము కూడా క్రొత్త భూమిని దున్ని విత్తనాలు చల్లుకోవటానికి ప్రోత్సాహిస్తుంది. ఆ విత్తనం బ్రహ్మము. సరిక్రొత్త భూములే క్రొత్తగా వచ్చి చేరిన విద్యార్థులు, ఆ విద్యార్థులే వ్యవసాయం చేసి విత్తనాలు చల్లటానికి సిద్ధంగా ఉన్న క్షేత్రాలు. నేను ఎప్పుడూ, ఎల్లప్పుడూ ఆత్మలకు రైతులా ఉంటాను. నాకు వ్యవసాయం అంటే ఇష్టమే. అది పుష్టిని, పెరుగుదలను మరియు

సంతోషాన్నిస్తుంది. అందులో ఉన్న అందము, ఆనందము నాకు తెలుసు. ఎందుకంటే నాలో ఉన్న క్షేత్రాన్ని దున్ని అంకురార్పణకు సిద్ధము చేశాను. ఆ విత్తనం మొలకెత్తింది. మొలకెత్తి మళ్ళీ ఎన్నో విత్తనాలు రావడానికి అవకాశం యిస్తుంది. ప్రణాళిక యిలా ఉంటుంది. ఈ ప్రణాళికలో జ్ఞానికైనా, అజ్ఞానికైనా పునర్జన్మ తప్పకుండా జరగాలి. తెలిసినవాళ్ళు ప్రజ్ఞాపూర్వకంగా పుడతారు. అజ్ఞానులు ప్రజ్ఞ లేకనే మళ్ళీ పుడతారు. జ్ఞానులు ప్రజ్ఞా పూర్వకంగానే వెళ్ళిపోతారు. అజ్ఞానులు ప్రజ్ఞలేని స్థితిలో వెళ్ళిపోతారు. జ్ఞానికి అజ్ఞానికి మధ్యలో సంభవించే సాధారణ విషయాలు ఇలా చాలా ఉన్నాయి.

★★★

ఎప్పుడూ ప్రకృతిని స్వంతం చేసుకోవాలని ప్రయత్నించకు. నీవు ఆ ప్రకృతి నుండి వచ్చినవాడివే. ప్రకృతి నీ తల్లి. ఆ తల్లిని వశం చేసుకోవాలని ప్రయత్నించకు. రావణుడు అలా వశం చేసుకోవాలని ప్రయత్నం చేసి, చివరకు చాలా కష్టపడ్డాడు. అట్లాంటియన్లు కూడ ప్రయత్నించి నాశనమయ్యారు. రోమనులు మరియు గ్రీకులు కూడ ప్రకృతిని వశపరచుకోబోయి నాశనమయ్యారు. బ్రిటిషువాళ్ళు కూడ నేర్చుకుంటారు. ప్రకృతిని తమ వశంలో ఉండాలనే వాళ్ళు ఇంకా నేర్చుకోవడానికి ప్రారంభించలేదు. ప్రకృతిని గౌరవించేవారు జ్ఞానులు.

★★★

గుప్తవిద్య అంటే కనబడని దానిని చూడటమే. సులభంగా చెప్పాలంటే విత్తనములో ఉన్న చెట్టును, అలాగే చెట్టులో ఉన్న విత్తనమును చూడటమే. గుప్తవిద్య పతాక స్థాయిలో ఉన్నప్పుడు ఒకే సమయంలో చెట్టు మరియు విత్తనములను కూడ చూడగలుగుతాడు.

★★★

యోగవిద్యార్థి లౌకిక ప్రగతికోసం ప్రాకులాడకూడదు. అది తానుగా వచ్చినప్పుడు స్వీకరించవచ్చు. ఆ సంపదను సరియైన పద్ధతిలో ఉపయోగించాలి. యోగ విద్యార్థికి లౌకిక సంపద కంటే యోగవిద్యయే ముఖ్యం కావాలి.

★★★

ఒక విద్యార్థి మాస్టరుగారిని కలిసి 'ఉబికివచ్చే ఆలోచనలను నిశ్చలంగా ఉంచడము ఎలా? ' అని అడిగాడు.

మాస్టరుగారు ''వాటిని ఎందుకు శాంతపరచాలి ? వాటిని అలాగే ఉండనీ. సముద్రానికి దాని పరిధిలో ఎప్పుడూ అలలు ఉంటాయి. నీ ఆలోచనలు కూడ ఆ పరిధిలో ఉండనీ. నీవు సముద్రములా, లోతుగా, గంభీరంగా ఉండు. పరిధితో సంబంధము పెట్టుకోకు. అలకంటే సముద్రాన్ని గురించి ఎక్కువగా ఆలోచించు.''

విద్యార్థి తేరుకున్నాడు. ఎప్పుడైనా ఆలోచనలు వచ్చినప్పుడు

తనకు తానే 'వాటిని అలా ఉండనీ' అనుకుంటూ ఆ తరువాత స్థిరంగా ఉన్నాడు.

★★★

1999 *'మే కాల్ మహోత్సవం'* అర్జెంటైనాలోని ఇగ్వాజు జలపాతం దగ్గర ఏర్పాటు చేయబడింది. ఈ రచయిత చేత అగ్నికార్యము (హోమం) చేయబడింది. ఆ హోమ కార్యక్రమానికి ఇటీవల దృష్టిని కోల్పోయిన ఒక స్త్రీ తీసుకొని రాబడింది. పాశ్చాత్య దేశాలలో ఈ రచయిత హోమం చేసేటప్పుడు సాధారణంగా తీవ్రమైన జబ్బులున్న వ్యక్తులు ముందు వరుసలో కూర్చుంటారు. అలాగే కంటి చూపులేని ఆ స్త్రీని కూడ ముందువరుసలో కూర్చోబెట్టారు. హోమం జరుగుతున్న సమయంలో మనిషి ఆకారంలో ఉన్న ఒక అగ్నిజ్వాల ఆమె నుదుటిని స్పర్శించినట్లు గోచరమయినది. హోమం పుర్తికాగానే ఆమె కళ్ళుతెరచి చక్కగా చూడగలిగింది. ఆమెకు ఆ అనుభవము చాలా భావపారవశ్యాన్ని కలిగించింది. ఎందుకంటే, ఆమె తన చూపును కొన్ని నెలల క్రితమే పోగొట్టుకున్నది. అది నయం కాదని కూడ తేల్చి చెప్పారట. ఆమెకు చాలా ఉద్వేగం కలిగింది. ఆమె ఆ సమావేశ మందిరంలో ఉన్న వేదికను చూస్తూ మాస్టర్ ఎమ్.ఎన్.గారి చిత్రపటం దగ్గరకు పరుగెత్తుకొని వెళ్ళి అత్యంత ఉత్సాహంతో 'ఇతనే జ్వాలరూపంలో నా దగ్గరకు వచ్చి నా నుదుటిని స్పర్శించాడు' అని చెప్పింది.

రచయిత అగ్నికార్యము చేసేటప్పుడు మాస్టర్ ఎమ్.ఎన్. గారి సాన్నిధ్యము యొక్క అనుభూతి, వచ్చిన వారిలో చాలామందికి కలిగేది.

★★★

'ఎమ్.కె.' అంటే 'మహాకుండలిని' చైతన్యమును భూమికి తీసుకురావటానికి కె.ఎమ్. అంటే కుంభకోణం మాస్టరుగారు తమ శాయశక్తులా ప్రయత్నించారు. మహా కుండలిని అంటే తేజస్సు. అది అత్యంత ప్రకాశవంతమైన, ప్రతిభావంతమైన జీవనజ్యోతి. అదొక పూర్ణశక్తి. అది అన్ని రూపాలకు, ఊహలకు అతీతమైనది. దానినే ఆధ్యాత్మిక సూర్యుడు, భర్గోదేవ, ఆకాశం లేదా స్థూలరూపంలో వ్యక్తమైన ఐదవ ఈథర్. వాయువు ఇంకా ఎక్కువ సాంద్రత కలిగినది. అగ్ని (జ్వాల) దానికి కనిపించే రూపము. సూక్ష్మరూపాన్ని పొందుటకు మునుపు ఈ తేజస్సు లేదా మహా కుండలినిలో కె.ఎమ్.గారు అసంఖ్యాకమైన మార్పులు చేసి, ఆ మార్పులను అల్లికగా మార్చి, ప్రత్యేకమైన ఒక వాహికను (Channel) ఏర్పరిచి, ఆ వాహిక ద్వారా ఈ తేజస్సును ఏ మార్పు పొందకుండా ఎక్కువ మోతాదులో అంతః ప్రవాహాన్ని ఆవర్తనములోనికి పారే ప్రక్రియను ఆవిష్కరించారు. అది గంగావతరణమునకు ఏమాత్రం తీసిపోదు (గంగ దిగిరావటం). అది ఆకాశజలమే పవిత్ర గంగావతరణంగా పురాణాలలో చెప్పబడింది. కేవలం ఒక్క శివుడే ఆ తీవ్ర ప్రవాహాన్ని భరించి భూమికి తెచ్చాడు. అలాగే కె.ఎమ్.గారు ఆ తేజో ప్రవాహానికి ఒక వాహికగా నిలిచారు. ఆ ఒత్తిడిని, ఆ నిరోధకశక్తిని ఎవరూ ఊహించలేరు. ఆ విషయంలో కె.ఎమ్.గారికి సమానమైన వారెవరూ లేరు. ఈ భూమి మీద జరిగిన ప్రతి మంచిపని వెనుక ఉన్న ఆలోచనను తీక్షణమైన జ్వాలతో పోలుస్తారు. అంతేకాక

ఆలోచన అనేది ఒక జ్వాల. ఆలోచనకు సంబంధించిన ఒక ప్రక్రియ మరియు రూపానికి అతీతంగా జరిగే ఒక గొప్ప ప్రక్రియ. ఎమ్.కె. నుండి ఆలోచనా రూపమై ఉంది. కె.ఎమ్.గారు వాటికి నామకరణం చేయాలనుకున్నారు. ఆయన కొన్ని శబ్దాలను సూచించారు, మరియు దానికి సంబంధించిన ప్రక్రియ ఆయనకు మాత్రమే తెలుసు. ఆయన తన నోట్స్‌లో వీటిని రికార్డ్ చేసుకున్నారు, వాటి గురించి సంపూర్ణంగా తెలియకనే అనుయాయులు వీటిని పాటిస్తున్నారు. అనుయాయులు ఆ శబ్దములను లేదా పదములను గట్టిగా ఉచ్చరించరాదు. అర్థాలు తెలుసుకోక వాటికి వివరణ ఇవ్వకూడదు. చాలా ఉదాత్తమైన మాస్టరుగారి ప్రయత్నములను వారి అనుయాయులు వికారంగా, అవమానకరంగా అపార్థం చేసుకుంటున్నారు. కె.ఎమ్.గారు ప్రతిపాదించిన రూపాతీత దృగ్విషయాన్ని, ఆదిశంకరుల ఆలోచనలు, ప్రస్తుత కాలంలోని బ్లావెట్స్కీ గారి ఆలోచనలకు పోల్చుకొంటే అవి చాలా ప్రగతిపరంగా ఉన్నవి. ఆయన అరూపమునకు (నిరాకార) 13 దశలను చూపారు. రూపము (సాకార), అరూపము (నిరాకార) కంటే చాలా కనిష్ఠమైనది. కనిష్ఠమైనది అంటే సృష్టి ప్రక్రియలో అవి తరువాతి దశలో వచ్చినవి కావటం చేత అరూప స్థితి కంటే ఎక్కువ స్థూలంగా ఉన్నవి.

మాస్టరుగారు అపరిమితత్వమును ఉద్దేశించి, అమరత్వమును గురించి మాట్లాడారు. అపరిమితత్త్వమును గురించిన ఆలోచన పెరగాలి. ఈ కారణంగానే అంతర్ముఖులవడానికి ఒక ఆకారం కాని, ఆలోచన కాని ఆయన యివ్వలేదు. ఆయన

మనలను పరిశీలకులుగానే ఉండమన్నారు. చాలా వరకు ఉదాత్తమైన ఆలోచనలు, భవ్య రూపములు పరిమితత్వానికి చెందినవే. అవి ఆకారానికి, భావనకు పరిమితమైనవే. అందువలన అపరిమితము (అనంతము), అనంతమైన జీవనము, అపరిమితమైన జీవితము నీలో ప్రవహించడాన్ని గురించి ఆలోచించండి. అది కూడ ఒక ఆలోచనే. అందువలన తాను కలిసిపోవడం అనే ఒక తాళపుచెవితో అనంతత్త్వములోకి జారిపోవాలి. ఎప్పుడైతే నీవు ఆ అనంతత్త్వములో కలిసిపోతావో అప్పుడు నీవు స్థానికంగా కాక అంతటా ఉంటావు. 'నేను' అనేది మాయమౌతుంది. 'అది' (తత్) అనేది ఉంటుంది. కేంద్ర బిందువు మాయమైనప్పుడు పరిధి కూడా మాయమవుతుంది.

★★★

అనంత ప్రాణశక్తి లేదా మహా కుండలిని గురించి నేను కొంత సమాచారాన్ని మీతో పంచుకోవాలని అనుకుంటున్నాను. ఆ అనంతప్రాణశక్తి మీ ఉచ్ఛ్వాసలోకి ఒకసారి వచ్చిందంటే, ఏడు వారాల వరకు మీకు కావలసిన శక్తి లభిస్తుంది (7x7). నీలోనికి వచ్చిన ఒక యూనిట్ (కనిష్ఠ ప్రమాణం) అనంతప్రాణము 7x7 రోజులు నిన్ను సంరక్షించును. 49 రోజుల వరకు నీకు ఆకలిదప్పులు ఉండవు. ప్రాచీన కాలములో మన ఋషులు ఇలానే తపస్సు చేసే సమయంలో ప్రాణశక్తినే ఆహారంగా పొందేవారు. నీలోనికి ధారగా ప్రవహించే అనంతప్రాణశక్తి అన్ని మార్గములను ఏకకాలములో తెరచి నిన్ను అపరిమితత్వమునకు నడిపిస్తుంది.

అలా జరిగే ఒక్క ప్రవాహము నీకు 49 రోజులవరకు సమాధిలో ఉండటానికి సరిపోతుంది. ఈ అనంతప్రాణమునే మాస్టరుగారు 'మెర్రీ లైఫ్' (ఆనంద జీవనం) అని పిలిచారు. ఆయన ఒకసారి శ్వాస తీసుకొని కొన్ని గంటలపాటు సమాధిస్థితిలో ఉండేవారు. కె.ఎమ్. గారికి లౌకిక ప్రపంచములో ఉండటం కంటే ఇలా సమాధిలో ఉండటం చాలా సులభమనిపించేది. ఆయన సమాధిస్థితిలోని ఆనందాన్ని మనకు, మానవ జాతికోసం త్యాగం చేశారు. మర్త్యులమైన మనం ఆయన చాలాకాలం ఉండాలని కోరుకుంటాము. ఆయన దృష్టిలో ఆయన చాలాకాలం జీవించారు. మీకు ఆయన దృష్టికోణం అర్థంకాదు. సాధారణ వ్యక్తులు కొంతమంది తమ దృష్టికోణాన్నే అంటుకొని ఉంటారు. వారికి వేరే దృష్టి ఉండదు. కాని గొప్పవారు తమకన్న తక్కువ తెలిసిన వారికోసం తమ దృక్పథం వదలక పనిచేస్తారు. 11 ఏళ్ళపాటు ఆయన చేసిన కృషి కనీసం 11 శతాబ్దాల వరకు సరిపోతుంది.

★★★

కుండలిని గురించి కాని, దాని సామర్థ్యాన్ని గురించి కాని, దాని పనిని గురించి కాని ఎవరూ సంపూర్ణంగా చెప్పలేరు. సులభమైన రీతిలో చెప్పాలంటే కుండలినియొక్క ఆవర్తనములో ఏడు దశలు మరియు ఆ ప్రతియొక్క దశలో ఏడు ఉపదశలు ఉన్నాయి. అలానే కుండలినియొక్క పరిణామ క్రియలో ఉపదశలవారిగా 7 దశలలో ఉన్న 49 ఉపదశలకు పూర్ణత్వము లభిస్తుంది. ఆ సమగ్ర వివరాలను అందించటం కష్టం. దాని

మూలమును గురించి కూడ ఎవరూ మాట్లాడరు. ఎందుకంటే ఏ జీవికైనా మూలము అదే, దాని ఉనికి తరువాతనే. కుండలినియొక్క ఆవిర్భావము, అది చేసే పనికి బ్రహ్మమే సాక్షి. కొంతవరకు ఋషులు కుండలిని గూర్చి తెలుసుకోగలరు ఎందుకంటే వారు కాలక్రమములో బ్రహ్మత్వము పొందగలరు.

కుండలిని దృష్టిని, అంతర్ దృష్టిని, దర్శనాలను బలపరుస్తుంది. అది జాగృతియొక్క భూమికగా ఉంటుంది. ఆ జాగృతియే జీవితము, వెలుగు. అది అంకురించి, పెరిగి పరిపూర్తికి ఆధారమగును. దానిని తొలగిస్తే క్షీణతకు, చావుకు కారణమవుతుంది. కుండలినితో అనుసంధానం చెందిన యోగి దృష్టి, అంతరదృష్టి మరియు దర్శనం యొక్క అనుభూతిని పొందుతాడు. ప్రతి దశలో జరిగే లీలలో ఉన్న త్రిగుణములను దర్శించగలరు. ఎవరికైతే కుండలిని గురించి సంపూర్ణ జ్ఞానము ఉండునో, వారికి అన్ని విషయములు తెలియును. కుండలిని ఒక సముద్రమైతే అది తెలిసిన యోగి అందులో ఒక తరంగమే. కేవలం అది ఒక తరంగం, గుర్తుంచుకోండి. సమస్తములోని ఒక భాగము ఎప్పటికీ సంపూర్ణము కాదు, కాని అందులోని అంశము ఉంటుంది. నన్ను తరచుగా కుండలిని గురించి అడగకండి. మీ అంతరంగములోనికి ప్రవేశించి, అనుభూతి పొందండి. కాలహరణము చేసే వ్యక్తులు, నన్ను భవ్యమైన సృష్టి నిర్మాణం గురించి రకరకాల ప్రశ్నలు అడుగుతున్నారు. అదే ఆదర్శసాధకులు, గురువు యిచ్చిన సూచనల మేరకు అభ్యాసం ద్వారా తెలుసుకుంటారు.

★★★

మరణం లేకుండా ఉండటం ఒక స్థితి. దానిని సిద్ధించుకోవాలి. ఆ సిద్ధిని పొందటానికి విశేష ప్రయత్నం చేయాలి. అది స్థిరంగా ఉండే మరొక క్రొత్త కేంద్రం స్థాపనకు ప్రారంభం. అక్కడ ఉండటంవలన అతను ధగధగ మండే జ్వాలలా ఉండగలడు. మరణము లేని స్థితి ఒక సాధ్యత. అది అందరిలోను నిక్షిప్తంగా ఉంటుంది. దానికోసం శ్రమించాలి. అది పాలలో అదృశ్యంగా ఉన్న నెయ్యిలాంటిది. పాలు 'నేనే నెయ్యి' అని ఎప్పుడూ చెప్పదు. అది పాలలో అంతస్థంగా ఉంటుంది. అది నేతి స్థితిని పొందాలి. చాలామంది సోమరులు 'నేను అమరుడను' అని చెప్పడము వింటూ ఉంటాము. చాలామంది వేదికనెక్కి 'మనిషి అమరుడు, మనిషి చావడు' అని చెప్పడం కూడ వింటూ ఉంటాము. కాని వాళ్ళందరూ చచ్చిపోతారు. వాళ్ళకు కేవలం మాట్లాడటం మాత్రం తెలుసు. కేవలం సిద్ధాతము తెలిసినవారు చాలా మాట్లాడతారు. వాళ్ళవి ఒట్టి మాటలే. పని మాత్రం చాలా తక్కువ. ఎవరైతే అయస్కాంతీకరణము (ఆకర్షణ) గురించి మాట్లాడతారో వారిలో ఆ (ఆకర్షణ) అయస్కాంతశక్తి ఉండక పోవచ్చు. నిజంగా ఆకర్షణశక్తి ఉన్నవాడు వాడిని చూసి చిరునవ్వు నవ్వుతాడు. తనలో ఆకర్షణ ఉన్నవాడు అవతలివాడిలో ఉన్న ఆకర్షణశక్తిని గుర్తిస్తాడు. ఒక రాతిపని చేసేవాడు మరొక రాతిపని చేసేవాడిని గుర్తిస్తాడు. ఒక గురువు మరొక గురువును గుర్తిస్తాడు. బిరుదులకోసం పరుగెత్తకు. అమరత్వం కోసం పరిశ్రమించు. నీకు అమరత్వం లభించిందని నీకే తెలియాలి, దానిని ప్రక్కవాడు

ధృవీకరించవలసిన అవసరం లేదు. నీవు ఉదయం అల్పాహారం తిన్నావో, లేదో నీకు తెలుసు. అంతే కానీ, మధ్యలో ఇంకొకడు వచ్చి నీవు తిన్నావని చెప్పవలసిన అవసరం లేదు. నీవు ఉదయం అల్పాహారం తినకపోయినా, నీవు తిన్నావని నేను చెబితే మాత్రం నీ కడుపు నిండదు. అమరత్వం గురించి కేవలం కోరిక ఉంటే చాలదు. అవసరమైన రూపాంతరము, పరిణామము, ఇంద్రియాతీత స్థితి పొందటానికి తగు సాధన చేయాలి. నేను ప్రతిరోజూ నీలో అగ్నిప్రజ్వలనం చేయగలను, కాని దాని సహాయంతో నీవే వంట వండుకోవాలి. నీవు వండనంతవరకూ వంట పూర్తి కాదు. అది సఫలం కాదు. నీ కోసం నేను వండుతానని ఎదురు చూడకు. నేను నీకు వంటశాల మాత్రమే కాని నేను వంటవాడిని కాదు. నీవు నా దగ్గరికి వచ్చి అగ్ని తీసుకొని వెళ్ళవచ్చు. వంటసామగ్రి నీ దగ్గరే, నీ లోపలే ఉంటుంది. వంట ప్రారంభించు. పదార్థం మార్పు చెందుతుంది.

★★★

సి.వి.వి. అన్న దానిని ఒక సిద్ధాంతముగా అర్థం చేసుకోవాలి కాని ఒక వ్యక్తిగా అర్థం చేసుకోకూడదు. సృష్టి చక్రములోగల 24 సిద్ధాంతములలో ఇది కూడా ఒక భాగమైనప్పటికీ చాలా ముఖ్యమైన అంశము. ఎవరు ఈ ధ్వనిని ఆవాహన చేసినా, ఆ సిద్ధాంతము అందరియందు సమానంగా, వ్యక్తిగతంగా కాకుండా, సార్వత్రికంగా పనిచేస్తుంది. అది ఎవరితోను వ్యక్తిగత సంబంధము పెట్టుకోదు. కాని వ్యక్తులు దానితో సంబంధము కలిగి ఉంటారు.

ఎవరైనా పట్టుదలతో, దీర్ఘప్రయత్నము చేసి, సంబంధము పెట్టుకుంటే అతనిలో పని ప్రారంభించి అన్ని స్థితులలోనూ పరివర్తన కలిగేలా చేస్తుంది. మనలో అక్కరలేనివాటిని తీసివేసి అవసరమైనవాటిని మాత్రమే ఉంచుతుంది. ఈ పరివర్తనలు కొన్ని కొంతవరకు అర్థమవుతాయి, కొన్ని అర్థం కావు. ఎందుకంటే మన తర్కానికి అందని ఒక భాగం అలాగే ఉంటుంది. ఇప్పుడు ఆ తర్కము కొన్ని వేలమంది సాధకుల, యోగవిద్యార్థుల ద్వారా పనిచేస్తుంది. ఆ సంఖ్య కూడ ప్రగతిపరంగా పెరుగుతూ ఉంది. ఈనాడు నూతన ప్రపంచ విధానాన్ని జాతులు, దేశాలు, సమాజాలు దర్శించి, గుర్తించాయి. దాని ప్రభావం అవతారం కంటే తక్కువేమీ కాదు. దీని ప్రభావం గ్రహాల స్థాయిలో ఉంది. తమ అల్పమైన, క్షుద్రమైన వ్యక్తిగత జీవితం, వ్యక్తిగత సమస్యలలో మునిగి తేలే వారికి ఇవి అర్థం కావు. ఈ పరమార్థం తెలిసినవారు తమకు తాము ప్రాధాన్యం ఇవ్వరు. ఆ భాగం సమస్తంలోనిదే. తరువాత ఆ భాగం సమాధిస్థితిలో పనిచేస్తుంది. ఈ భాగం ఒక్కోసారి ప్రజ్ఞా పూర్వకంగా, చాలా సమయము అప్రజ్ఞాత స్థితిలో పనిచేస్తూ ఉంది, ఎందుకంటే అది మనిషియొక్క వ్యక్తిగత జీవితంలో నుండి పనిచేస్తుంది. మానవుడే ప్రణాళికగా పరిణామము చెందుతాడు.

*స్వస్తి!*

# DHANISHTA PUBLICATIONS

D.No. 15-7-1, Angels' Enclave, Krishna Nagar,
Visakhapatnam - 530 002.
Phone : 0891- 2701531, 2509154

## WRITINGS OF MASTER PARVATHIKUMAR

| | | |
|---|---|---|
| 1. | Agni | E |
| 2. | A Clean Life | E/G/S |
| 3. | Adhyatmika Gigyasa | K |
| 4. | Amanaskudu | K/T |
| 5. | Ambareeshudu | T |
| 6. | Antardarsana Dhyanamulu | T/K |
| 7. | Anveshakudu | T |
| 8. | Asangudu | T/K |
| 9. | Aries | E |
| 10. | Ashram | E |
| 11. | Ashram Leaves | E/G/S |
| 12. | Aswini Devatalu | T |
| 13. | Ashram Regulation for Entry | E/G/S |
| 14. | An insight into the WTT | E |
| 15. | Atmasadhana Sutramulu | T |
| 16. | Avathara of Synthesis | E |
| 17. | Ayurvedic Principles of Daily Life | E/G/S |
| 18. | Bharatiya Sampradayamu | T/K/Hi |
| 19. | Book of Prayers | E |
| 20. | Bhagavathamurthy Bheeshmudu | T |
| 21. | Bhagavatha Sukthamu - 1 | T |
| 22. | Bhagavatha Sukthamu - 2 | T |

The Books are available in English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (Hi) and Kannada (K) Languages.

| | | |
|---|---|---|
| 23. | Bricks for the Temple | E |
| 24. | Cow | K/T/E/Hi |
| 25. | C.V.V. - Mastaru Yogamu - Sadhana Sutramulu | T |
| 26. | Devapi Maharshi Bodhalu 1 & 2 | T/E/K/Hi |
| 27. | Dharmavigrahudu - Sri Ramudu | T |
| 28. | Dhanakamuni Katha | T |
| 29. | Doctrine of Eternal Presence | E |
| 30. | From the Teachers Pen | E |
| 31. | Gayatri Mantra Avagahana | T |
| 32. | Geetopanishad - Sankya Yogamu | T |
| 33. | Geetopanishad - Karma Yogamu | T |
| 34. | Geetopanishad - Gnana Yogamu | T |
| 35. | Geetopanishad - Karma Sanyasa Yogamu | T |
| 36. | Geetopanishad - Dhyana Yogamu | T |
| 37. | Geetopanishad - Vijnana Yogamu | T |
| 38. | Geetopanishad - Akshra Parabrahma Yogamu | T |
| 39. | Geetopanishad - Rajavidya Rajaguhya Yogamu | T |
| 40 | Geetopanishad - Vibhuthi Yogamu | T |
| 41. | Good Friday | E/S |
| 42. | Gurusisya Samvadamu | T |
| 43. | Healers Handbook | E |
| 44. | Health & Harmony | E/G |
| 45. | Health & Harmony-2 | E |
| 46. | Hercules - The Man and the Symbol | E/G/S |
| 47. | Himalaya Guruparampara | T/Hi/K |
| 48. | Jupiter - The Path of Expansion | E/G/S |
| 49. | Just Adjust | E |
| 50. | Jyotirlinga Yatra | T |
| 51 | Jyothisha Vignanamu | T |
| 52. | Kapila and Kardama | E/G/S |
| 53. | Katha Deepika | T |
| 54. | Kumara Sambavam | T |
| 55. | Lectures on Secret Doctrine - I | S/E |

| | | |
|---|---|---|
| 56. | Lectures on Secret Doctrine - II | E |
| 57. | Lectures on Secret Doctrine - III | E |
| 58. | Listening to the Invisible Master | E/S/K |
| 59. | Lord Maitreya - The World Teacher | E/S |
| 60. | Life and Teachings of Master Jupiter | E |
| 61. | Maitreya Maharshi Bodhalu 1 & 2 | T/K/E/Hi |
| 62. | Mana Master garu | T |
| 63. | MANTRAMS - Their Significance and Practice | E/G/S |
| 64. | Mars - The Kumara | E/G/S |
| 65. | Mercury - The Alchemist | E/G/S |
| 66. | Maria Magdalena | E/S |
| 67. | Marriage - A Sublime Sacrament | E/G/S |
| 68. | Maruvu Maharshi Bodhalu 1 & 2 | T/K/Hi/E |
| 69. | MASTER C.V.V. (Birthday Message) | T/K/E |
| 70. | MASTER C.V.V - Nuthana Yogamu | T/K |
| 71. | MASTER C.V.V. - Yogamu | T |
| 72. | MASTER C.V.V. - Yogamu (Karma Rahityamu) | T/k |
| 73. | Master K. Parvathi Kumar - Short Biography | E |
| 74. | Master CVV - Saturn Regulations | E/G/S |
| 75. | MASTER CVV The Initiator - MASTER E.K. The Inspirer | E |
| 76. | Master M.N. - A Fiery Flame | E/G/S |
| 77. | MASTER E.K. - The New Age Teacher | E/S |
| 78. | Marana Rahasyam-1 (Markandeya) | T |
| 79. | Marana Rahasyam-2 (Sathi Savitri Devi) | T |
| 80. | Marana Rahasyam-3 (Nachiketudu) | T |
| 81. | Master CSG | E |
| 82. | Messages of Master E.K. | E |
| 83. | MITHILA - A New Age Syllabus | E/G/S |
| 84. | Moon - The Key | E |
| 85. | New Age Hospital Management | E |
| 86. | Nutrients For Discipleship | E |
| 87. | OM | T/K/E |

| | | |
|---|---|---|
| 88. | Occult Meditations | E/G/S |
| 89. | Om Namo Narayanaya | E/G/S |
| 90. | On Change | E/S |
| 91. | On Healing | E |
| 92. | On Love | E/G/S |
| 93. | On Service | E/G/S |
| 94. | On Silence | E/G/S |
| 95. | PARIKSHIT-The World Disciple | E |
| 96. | Pranayamam | T |
| 97. | Prayers | E/G/S |
| 98. | RUDRA | E |
| 99. | Rukmini Kalyanam | T |
| 100. | Sai Sukthulu | T/K |
| 101. | Sai Ki Amruthavani | Hi |
| 102. | Sanghaneethi | T |
| 103. | SAM | E |
| 104. | Saraswathi-The Word | E/G/S |
| 105. | SANKHYA - The Sacred Doctrine | E/S |
| 106. | Saturn - The Path of Systematised Growth | E/G/S |
| 107. | Shodosopachara Pooja - Avagahana | T |
| 108. | SOUND-The Key and its Application | E/G/S |
| 109. | Spiritualism-Business and Management | E/G |
| 110. | Spiritual Healing | S/G |
| 111. | Sri Dattatreya | E/G/S/T |
| 112 | Sripada Srivallabha Charitamrutam | E |
| 113. | Srimadramayana Dharmakusumalu | T |
| 114. | Sri Guru Paadukastavamu | T |
| 115. | SRI LALITHA (Set 10 Books)<br>(Comentary on Sri Lalitha Sahasranamam) | T |
| 116. | SRI SASTRY GARU | T/K/E/S |
| 117. | Sri Krishna Namamrutham | T |
| 118. | Sri Shirdi Sai Sayings | E/G/S |
| 119. | Sri Suktam | E |

| | | |
|---|---|---|
| 120. | Steps of Silence | E |
| 121. | Sun that Iam | E/G/S |
| 122. | Temple and the Work | E |
| 123. | Teachings of Lord Maitreya-1 | E |
| 124. | Teachings of Lord Maitreya-2 | E |
| 125. | The Aquarian Cross | E/G/S |
| 126. | The Aquarian Master | E/G/S |
| 127. | The Doctrine of Ethics | E/S |
| 128. | The Etheric Body | E/G/K |
| 129. | The Golden Stairs | E/S |
| 130. | The Path of Synthesis | E |
| 131. | The Splendor of Seven Hills | E |
| 132. | Thus Spoke-Master Dhwhal Khul | E |
| 133. | THE TEACHER-Meaning and Significance | E |
| 134. | Teachings of Master Koot Hoomi 1 & 2 | E |
| 135. | The Teachings of Lord Kapila | E/G |
| 136. | The Teachings of Master Mourya 1 & 2 | E |
| 137. | The Teachings of Sanath Kumara | E/G/S |
| 138. | The Theosophical Movement | E/G/S |
| 139. | The White Lotus | T/E/S/K |
| 140. | The World Teacher | E |
| 141. | The Mysteries of Sagittarius | E |
| 142. | Time - The Key | E/G |
| 143. | Uranus- The Alchemist of the Age | E/G/S |
| 144. | Varuna Graha Prabhavamu | T/K |
| 145. | VENUS-The Path to Immortality | E/S |
| 146. | Violet Flame Invocations | E |
| 147. | Vrutrasura Rahasyam | T |
| 148. | Wisdom Buds | E/S |
| 149. | Wisdom Teachings of Vidura | E/G/S |
| 150. | Yama Geetha | T |

**Please visit our website**

(www.dhanishta.org / info@dhanishta.org) for prices

# మన మాస్టరుగారు




రచన : **మాస్టర్ పార్వతీకుమార్**

**మాస్టర్ ఇ.కె. నవయుగమునకు చెందిన ఆచార్యులు. ఆధునిక జీవితములో దివ్య జీవితమును ఆధ్యాత్మిక తత్త్వము మేళవించి జీవించిన మహనీయులు. సమన్వయాత్మకముగా జీవించు విధానమును అతి సులభముగా అందించిన వారు. వారి జీవనశైలి అనేక వేలమందిని మేల్కొల్పి స్ఫూర్తి కలిగించినది. సత్యాన్వేషణము తెలియజేయు వారి మార్గము ప్రాక్పశ్చిమ దేశములలో అనేకమందికి ఆదరణీయమైనది. అట్టి మహనీయుని జీవిత చరిత్ర ఈ పుస్తకము నందు అందించబడినది.**

వెల : రూ॥ **80-00**

ప్రతులకు : ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,
కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002. ఫోన్ : 0891-2701531.
www.dhanishta.org info@dhanishta.org



ఒక జిజ్ఞాసువు తనను తాను దివ్యత్వానికి వాహికగా మార్చుకొని, భూమిపైన దివ్య కార్యములను పరిపూర్తి చేస్తుంటాడు. మాస్టర్ ఎమ్.ఎన్.గారు అలాంటి ఒక ఉదాహరణ. దివ్య ప్రణాళికలో ఆయన తనదైన ప్రత్యేక స్థానమును ఏర్పరచుకున్నారు. ఆయన సంతోషంగా, సేవాభావనతో, అందుబాటులో ఉండేలా, చాలా సామాన్యంగా ఉంటారు. ఆయన పనులు అమరమై ఎప్పటికీ ప్రేరణాత్మకంగా ఉన్నప్పటికీ ఆయన సమాజములోని అందరిలో ఒకడిగా జీవించారు.

ఈ గ్రంథములో మాస్టర్ ఎమ్.ఎన్.గారి జీవితచరిత్ర, వారి యోగప్రణాళిక గూర్చి విపులముగా వివరింపబడినది.

ISBN 978-81-89467-99-9

9 788189 467999

ధనిష్ఠ